

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 326

గురువారం 16-2-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మెరిసిన దీప్తి, రిచా

మహిళల టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో భారత్‌కు రెండో విజయం. -12లో



గిరిజన విజయం..

మహిళల ప్రీమియర్ లీగ్‌లో రూ.30లక్షలు పలికిన మిన్ను మణి. -11లో



‘బీబీసీ’లో రెండోరోజూ సర్వే

బీబీసీ కార్యాలయాల్లో మంగళవారం మొదలైన ఆదాయ పన్ను శాఖ ‘సర్వే’ బుధవారం కూడా కొనసాగింది.


- వివరాలు 6లో▶



అదానీపై ‘సుప్రీం’లో మరో కేసు

అదానీ గ్రూప్ కంపెనీల షేర్లలో అవకతవకలపై బుధవారం సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది.

- వివరాలు 6లో▶



దేశీయ ఆయుధాలకే ప్రాధాన్యం

రక్షణ శాఖ పెట్టుబడి వ్యయంలో 75% నిధులను దేశీయ ఉత్పత్తుల కొనుగోలుకే వెచ్చిస్తామని మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

- వివరాలు 6లో▶



నేడు త్రిపురలో ఎన్నికలు

త్రిపురలో గురువారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 60 శాసనసభ స్థానాలకు పోలింగ్ జరగనుంది.

- వివరాలు 6లో▶

అవసరమైతే కొండగట్టుకు రూ. వెయ్యి కోట్లు

ప్రపంచ క్షేత్రంగా ఆలయాన్ని తీర్చిదిద్దుతాం ● యాదాద్రి తరహాలో అభివృద్ధి పనులు చేపట్టాలి: సీఎం కేసీఆర్

- ఆంజనేయుడి ప్రస్తావన వస్తే కొండగట్టు పేరే విన్పించాలి
- హనుమాన్ జయంతి అనగానే ఈ క్షేత్రం వైపే చూడాలి
- ఆగమ శాస్త్ర ప్రకారం ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని తీర్చిదిద్దాలి
- భక్తుల తాకిడిని తట్టుకునేలా సకల సౌకర్యాలూ కల్పించాలి
- అధికారులతో ముఖ్యమంత్రి సుదీర్ఘ సమీక్ష
- మహాకార్యం పూర్తయ్యేవరకు మళ్లీ మళ్లీ వస్తూనే ఉంటానని వెల్లడి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/ కొండగట్టు

కొండగట్టును ప్రపంచాన్నే ఆకర్షించే అతిపెద్ద హనుమాన్ క్షేత్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. ఆగమశాస్త్ర ప్రకారం ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణాలు ఉండాలని, అందుకోసం రూ.1,000 కోట్లు ఖర్చయినా ఫర్వాలేదని చెప్పారు. దేశంలో ఆంజనేయుడి పుణ్యక్షేత్రం ప్రస్తావన వస్తే కొండగట్టు పేరు వినిపించాలని, హనుమాన్ జయంతి అనగానే దేశం మొత్తం కొండగట్టు వైపు చూడాలని స్పష్టం చేశారు. బుధవారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు పుణ్యక్షేత్రాన్ని సీఎం సందర్శించారు. అనంతరం ఆలయాభివృద్ధిపై అధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల ఆలయం కోసం రూ.100 కోట్లు కేటాయించిన నేపథ్యంలో ఆలయం విస్తరణ, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, కొత్త నిర్మాణాలు, భక్తులకు వసతులపై రెండు గంటలపాటు చర్చించారు. అనంతరం

మిగతా 2వ పేజీలో ▶



బుధవారం కొండగట్టు క్షేత్రాన్ని సందర్శించి అధికారులకు సూచనలు చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో వినోద్‌కుమార్, గంగుల కమలాకర్, ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్ తదితరులు

గుడికున్న గుర్తింపును దేశవ్యాప్తం చేయాలి..

‘కొండగట్టు అంటేనే ఆంజనేయుడి నిలయమన్న గుర్తింపు ఉంది. ఈ గుర్తింపును దేశవ్యాప్తం చేయాల్సిన సమయం వచ్చింది. అందుకే మాస్టర్ ప్లాన్ రూపొందించుకుని ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుదాం. ఇప్పుడు ఆలయాభివృద్ధికి కేటాయించిన రూ.100 కోట్లు చాలకపోతే.. రూ.వెయ్యి కోట్లయినా ఇస్తా. ఇంకా కావాలన్నా ఇస్తా. అయితే ఆగమశాస్త్ర ప్రకారం.. వాస్తు నియమాలను అనుసరించి, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సకల సౌకర్యాలతో పుణ్యక్షేత్రాన్ని తీర్చిదిద్దాలి. ఎక్కడ సౌకర్యాలు బాగుంటే అక్కడికి భక్తులు తప్పకుండా వస్తారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలి..’అని కేసీఆర్ సూచించారు.



ఓ ధరణి.. ఎన్నో సమస్యలు

సీసీఎల్‌ఏ క్షేత్రస్థాయి అధ్యయనంలో వెలుగులోకి.. భూ విస్తీర్ణంలో మార్పులకు అవకాశమివ్వని ధరణి పోర్టల్...

- పట్టాదారు పేరిట స్లాట్ బుక్ చేసుకుంటున్న థర్డ్ పార్టీలు.. రైతుకు స్లాట్ కావాలంటే నో
- అందుబాటులో లేని కొత్త పహాణీలు
- వ్యవసాయ, వ్యవసాయేతర భూ మార్పిడిలో అగచాట్లు
- రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై యాదాద్రి జిల్లా యంత్రాంగం నివేదిక
- అన్ని జిల్లాల్లో భేటీలు నిర్వహించే యోచనలో సీసీఎల్‌ఏ మిత్తల్

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్‌లో తవ్వే కొద్దీ సమస్యలు వెలుగు చూస్తున్నాయి. భూవిస్తీర్ణంలో మార్పులకు అవకాశం ఇవ్వకపోవడం, కొత్త పహాణీలు అందుబాటులో లేకపోవడం, ఏజీపీఏలను పరిగణనలోకి తీసుకోక పోవడం వంటి పలు సమస్యలు బయటపడుతున్నాయి. ఇటీవల భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ)గా బాధ్యతలు చేపట్టిన నవీన్‌మిత్తల్.. రాష్ట్రంలోని భూసంబంధిత సమస్యల్లో ప్రధానమైన ధరణి పోర్టల్‌ను సులభతరం చేయడంపై దృష్టి కేంద్రీకరించారు. ఈ పోర్టల్ ద్వారా ఎదురవుతున్న కీలక సమస్యలను గుర్తించి పరిష్కరించే క్రమంలో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేపట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగానే మంగళవారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లాకు వెళ్లి అక్కడి రెవెన్యూ యంత్రాంగంతో గంటన్నర పాటు సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు, జిల్లాలోని అందరు తహసీల్దార్లతో సమావేశమై ప్రధానంగా ధరణి పోర్టల్‌లో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి గల అవకాశాలను గురించి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఈ క్రమంలో ధరణి సమస్యల పరిష్కార లాగిన్ జిల్లా కలెక్టర్లకు కాకుండా తహసీల్దార్లకు ఇవ్వాలని కొందరు సూచించినట్టు తెలిసింది. ధరణిలో అటు రైతులకు, ఇటు రెవెన్యూ యంత్రాంగానికి ప్రధానంగా ఎదురవుతున్న సమస్యలపై యాదాద్రి జిల్లా యంత్రాంగం ఓ నివేదికను కూడా మిత్తల్‌కు అందజేసింది. కాగా ‘పైలట్’తరహాలో యాదాద్రికి వచ్చిన మిత్తల్.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని రెవెన్యూ అధికారులతో సమావేశం కావాలని యోచిస్తున్నట్టు సమాచారం.

తాజా అధ్యయనంలో వెల్లడైన కీలక సమస్యలివే..

- ఒక రైతుకు వాస్తవానికి ఎకరం భూమి ఉంటే ధరణి రికార్డుల్లో రెండు ఎకరాలుగా

మిగతా 3వ పేజీలో ▶

ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించండి

- జిల్లాల అధికారులకు ఎస్పీడీసీఎల్ ఆదేశం
- విద్యుత్, సాగు నీరు వృథా అవుతోందనే భావన
- రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

- వివరాలు 10లో

న్యూస్‌రీల్


సమసిన కోమటిరెడ్డి ‘హంగ్’ తుపాను



కాంగ్రెస్, బీఆర్ఎస్ పొత్తుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కోమటిరెడ్డి ఎపిసోడ్ ముగిసినట్టేనని తెలుస్తోంది. పార్టీకి నష్టం కలిగించే ఇలాంటి వ్యాఖ్యలను పునరావృతం కానివ్వొద్దని కోమటిరెడ్డికి ఠాక్రే చెప్పినట్టు తెలిసింది.

- వివరాలు 2లో▶

‘ఎవ్వరితో పొత్తుల్లేవ్’



తెలంగాణలో బీఆర్ఎస్ ఎవరిపైనా ఆధారపడి ప్రభుత్వం ఏర్పాటు చేయదని, సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సత్తా తమ పార్టీకి ఉందని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

- వివరాలు 3లో▶

ఎక్కడా పనికిరాని నేతలు బీఆర్ఎస్‌లోకి: బండి



దేశంలో ఎక్కడా చెల్లని నేతలను బీఆర్ఎస్‌లో చేర్చుకుని చంకలు గుద్దుకుంటున్న కేసీఆర్ తీరు హాస్యాస్పదంగా ఉందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

- వివరాలు 5లో▶

‘ఇప్పటికైనా సహకరించండి’



తెలంగాణలో విమానాశ్రయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. సాంకేతిక, భూపరీక్షల ఆమోదాన్ని పొందిన విమానాశ్రయాల నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు రావాలంటూ సీఎం కేసీఆర్‌కు కేంద్రమంత్రి బుధవారం లేఖ రాశారు.

- వివరాలు 2లో▶

పదోన్నతులైనా ఉంటాయా?

- బదిలీలకు బ్రేక్‌తో టీచర్లలో ఆందోళన..
- ఏం చేయాలనే ఆలోచనలో అధికారులు
- ప్రస్తుతానికి పదోన్నతులు ఇవ్వాలంటున్న ఉపాధ్యాయులు
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న హెచ్‌ఎంలు



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల బదిలీలకు బ్రేక్ పడటంతో పదోన్నతుల ప్రక్రియ అయినా ముందుకెళ్తుందా అన్న సందేహాలు కలుగుతున్నాయి. టీచర్ల సంఘాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఏమీ పాలుపోని స్థితిలో ఉన్న అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని కోరారు. మొత్తం మీద తాజా పరిస్థితులు ఉపాధ్యాయుల్లో ఆందోళన కల్గిస్తున్నాయి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, బదిలీలపై గత నెల 15వ తేదీన ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంది. 27వ తేదీన ఇందుకు సంబంధించిన షెడ్యూల్ కూడా ఇచ్చింది. బదిలీల ప్రక్రియ కొనసాగుతుండగానే 317 జీవో ద్వారా కొత్త జిల్లాలకు వెళ్ళిన టీచర్లు కోర్టును ఆశ్రయించడంతో, బదిలీల్లో వారికి అవకాశం కల్పించాలని

మిగతా 3వ పేజీలో ▶

పట్టాలు తప్పిన గోదావరి ఎక్స్‌ప్రెస్

- తృటిలో తప్పిన రైలు ప్రమాదం
- ఆరు బోగీలు, 500 మీటర్ల మేర పట్టాలు ధ్వంసం
- ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్ గ్రామం వద్ద ఘటన
- ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
- 15 గంటల్లో పునరుద్ధరణ
- పలు రైళ్ల ఆలస్యం..

ఘట్‌కేసర్: విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలుకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కే సర్ మండలం అంకుషాపూర్ గ్రామం 219/31 మైలు రాయి వద్ద పట్టా విరగడంతో బుధవారం ఉదయం 6.09 గంటల ప్రాంతంలో రైలు చివరన ఉన్న నాలుగు స్లీపర్ (ఎస్1-ఎస్4) బోగీలు, రెండు జనరల్ బోగీలు పట్టాలు తప్పాయి. ట్రాక్‌లో 11వ మూలమలుపు కారణంగా రైలు వేగం తక్కువగా ఉండడంతో ప్రమాద స్థాయి తక్కువైంది.



పట్టాలు తప్పిన ఎక్స్‌ప్రెస్ బోగి

విద్యుత్ స్తంభం లేకుంటే భారీ ప్రమాదం

పట్టా విరిగిన స్థలం నుంచి బోగీలు సుమారు 450-500 మీటర్ల వరకు అలాగే ప్రయాణించడంతో ట్రాకు పూర్తిగా ధ్వంసమైంది. బోగీలు అదుపు తప్పి రైల్వే విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడంతో అది నేలమట్టమైంది. స్తంభం లేని పక్షంలో బోగీలు కిందికి పడిపోయి వాటితో పాటు మరికొన్ని బోగీలు పడిపోయేవి. దీంతో భారీగా ప్రాణ నష్టం సంభవించేది. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ప్రయాణికులతో పాటు రైల్వే అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలిసిన వెంటనే

మిగతా 14వ పేజీలో ▶

‘తృణ’ధాన్యమే..!



- ఇతర రాష్ట్రాలతో పోలిస్తే దిగుబడుల్లో భారీగా వెనుకబాటు
- నాలుగేళ్లుగా క్రమంగా పెరుగుతున్నా పొరుగుతో పోటీ కష్టమే
- 2017-18లో రాష్ట్రంలో సగటున 83.67 మెట్రిక్ టన్నుల తృణ దిగుబడి

- వివరాలు 5లో▶

భద్రతకు భరోసా ఎల్‌హెచ్‌బీ..

- గోదావరి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ఘటనలో ఆరు బోగీలు పక్కకు ఒరిగినా ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. జర్మనీ పరిజ్ఞానంతో రూపొందించిన లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) బోగీలను వినియోగించడమే దీనికి కారణం.

- వివరాలు 14లో▶

ఇదండీ సంగతి



కొండగట్టులో అలనాటి గురుతులు

కేసీఆర్ దశాబ్దాల క్రితం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. సతీమణి శోభ, కుమారుడు కేటీఆర్, కుమార్తె కవిత, జోగినపల్లి రవీందర్‌రావు కుటుంబంతో కలిసి ఆలయ పరిసరాల్లో కలియతిరిగారు. కొండల్రాయుడి కోటనూ సందర్శించారు. ముఖ్యమంత్రి తాజా పర్యటన సందర్భంగా అప్పటి ఫొటోలను ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ బుధవారం ట్విట్టర్‌లో షేర్ చేశారు.- కొండగట్టు (చొప్పదండి)







బుధవారం కొండగట్టు ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్

క్లుప్తంగా...

వీఆర్ఎస్ బాటలో సోమేశ్‌కుమార్?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో తెలంగాణ కేడర్ నుంచి ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు బదిలీ అయిన సోమేశ్‌కుమార్ గతనెల 12వ తేదీన ఏపీ సీఎస్‌కు రిపోర్టు చేసిన సంగతి తెలిసిందే. సోమేశ్‌కుమార్ ఏపీలో రిపోర్ట్ చేసిన తరువాత సెలవులపై వెళ్లినట్లు తెలుస్తోంది. కాగా, ఈ మధ్యనే ఆయన స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారని విశ్వసనీయ సమాచారం. మూడేళ్లపాటు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన సోమేశ్‌కుమార్ తన భవిష్యత్తుపై కుటుంబ సభ్యులు, సన్నిహితులతో చర్చించిన తర్వాత ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.

'గౌడ కులస్తుల హక్కుల కోసం ధర్మభిక్షం పోరాడారు'



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ, కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం గౌడ కులస్తుల హక్కుల కోసం చివరి వరకు పోరాడారని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో జరిగిన ధర్మభిక్షం శతజయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ వారి సేవలను, స్ఫూర్తిని, వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మభిక్షం ప్రధాన పాత్ర వహించి కార్మిక పక్షపాతిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నీరాను ప్రవేశపెట్టాలని సుదీర్ఘకాలంగా పోరాడారని శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. రాష్ట్రంలో నీరా పాలసీ ప్రవేశపెట్టడంలో ధర్మభిక్షం స్ఫూర్తి ఉందన్నారు.

పన్నులు, పన్నేతర ఆదాయం రూ.98,141 కోట్లు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి చివరి నాటికి పన్నుల వసూళ్లతో రూ.91,145 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.6,996 కోట్లు కలిపి మొత్తం రూ.98,141 కోట్ల ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. రాష్ట్ర సొంత పన్నులు, పన్నేతర ఆదాయాల వార్షిక లక్ష్యాల సాధనపై దృష్టిసారించాలని ఆమె అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంపులు, రిజిస్ట్రేషన్, రవాణా, మైనింగ్ తదితర శాఖల అధికారులతో బీఆర్‌కేఆర్ భవన్‌లో సమీక్ష నిర్వహించారు. పన్నుల వసూళ్లను పెంచేందుకు అవసరమైతే ప్రత్యేక చర్యలను చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు. ప్రతివారం సమీక్షలు నిర్వహించి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, రవాణా శాఖలు అదనపు ఆదాయాన్ని ఆర్జించేందుకు కార్యాచరణ ప్రణాళిక ప్రతిపాదించాలని కోరారు. సమావేశానికి కమిషనర్ ఇన్‌స్పెక్టర్ జనరల్, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ రాహుల్ బొజ్జా, వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ నీతూ కుమారి ప్రసాద్, ఫైనాన్స్ స్పెషల్ సెక్రటరీ రోనాల్డ్ రాస్ తదితరులు హాజరయ్యారు.

గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ అవిశ్వాసంపై హైకోర్టు స్టే

21వరకు అమల్లో మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: గజ్వేల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస ప్రక్రియను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఈ నెల 21 వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. తనపై ఫిబ్రవరి 9న మున్సిపల్ కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని జిల్లా కలెక్టర్ స్వీకరించిన నేపథ్యంలో...అవిశ్వాస ప్రక్రియ ప్రారంభించడాన్ని చైర్మన్ నేతి చిన్న రాజమౌళి హైకోర్టులో సవాల్ చేశారు. ఈ మేరకు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు చైర్మన్ పిటిషన్ వేస్తే..తమ వాదనలు వినకుండా ఉత్తర్వులు ఇవ్వవద్దని కోరుతూ కౌన్సిలర్ల తరఫున గౌరారం రాజశేఖర్‌రెడ్డి హైకోర్టులో కేవియట్ దాఖలు చేశారు. చైర్మన్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి..గతంలో వికారాబాద్, తాండూర్ చైర్మన్ల అవిశ్వాస ప్రక్రియకు స్టే ఇచ్చిన అంశాన్ని పరిగణనలోకి తీసుకుని, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ అవిశ్వాస ప్రక్రియపై కూడా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

జంక్‌ఫుడ్‌కే జై!


ఆరోగ్యకరం కాదని తెలిసినా ప్రీ-ప్యాకేజ్డ్ ప్రాసెస్డ్ ఫుడ్ వైపు ప్రజల మొగ్గు

- పెరుగుతున్న ప్యాకేజ్డ్ పాలు, కూల్‌డ్రింక్స్, కేక్‌లు, ఐస్‌క్రీమ్‌ల వాడకం
- విస్తృత మార్కెటింగ్, ప్రచారంతో వినియోగదారులను ఆకర్షిస్తున్న సంస్థలు
- ఈ నేపథ్యంలో జంక్‌ఫుడ్ వినియోగం కట్టడి దిశగా కేంద్రం చర్యలు
- ఫ్రంట్ ఆఫ్ ప్యాక్ న్యూట్రిషనల్ లేబుల్స్ పాలసీ రూపకల్పన దిశగా చర్యలు

సాక్షి, హైదరాబాద్: ఉదయాన్నే పాలు, బ్రెడ్, బిస్కెట్లు... సాయంత్రం కాసిన్ని చిప్స్, చాకెట్లు, కేకులు/పేస్ట్రీలు... రాత్రికి వేడివేడిగా ఇన్‌స్టంట్ నూడుల్స్, ఆపై కూల్‌డ్రింక్స్ లేదా ఐస్‌క్రీమ్‌లు... ఏమిటీ ఆహార చిట్టా అనుకుంటున్నారా? నేటి ఆధునిక జీవనశైలిలో ప్రజల ఆహార అలవాట్లలో వచ్చిన మార్పు కారణంగా పల్లెల నుంచి పట్టణాల వరకు, పిల్లల నుంచి పెద్దల వరకు దాదాపు ప్రతిరోజూ చాలా మంది ఆరగిస్తున్న ప్రీ-ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్ ఫుడ్స్ ఇవి. దీన్నే మరోలా చెప్పాలంటే ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉండేందుకు వీలుగా పారిశ్రామిక స్థాయిలో కొన్ని కృత్రిమ పదార్థాలతో శుద్ధి చేసి తయారు చేసిన ఆహార పదార్థాలన్నమాట. ఇలాంటి ఆహార పదార్థాలను తినడం వల్ల అధిక బరువు, ఊబకాయం, బీపీ, షుగర్ వంటి జబ్బులబారిన పడతామని తెలిసినా ప్రజలు జిహ్వ చాపల్యంకొద్దీ వాటి వాడకాన్ని మానలేకపోతున్నారని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

భారీగా పెరిగిన మార్కెట్...

ప్రాసెస్డ్ ఫుడ్ తయారీ సంస్థలు వినియోగదారుల దృష్టిని ఆకర్షించేందుకు ఉధృతంగా మార్కెటింగ్, వినూత్న ప్రచారం చేపడుతుండటమే 'ప్రీ-ప్యాకేజ్డ్ ప్రాసెస్డ్ ఫుడ్' ప్రజలకు చేరువయ్యేందుకు కారణమవుతోందని చెబుతున్నారు. భారత ఆహార పదార్థాల మార్కెట్ ముఖ్యంగా ప్రీ-ప్యాకేజ్డ్ ప్రాసెస్ ఫుడ్స్ మార్కెట్ 68 శాతం నుంచి 84 శాతానికి పెరిగినట్లు గతంలో నిర్వహించిన పలు అధ్యయనాలు వెల్లడించాయి. అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్‌గా ముద్రపడిన వాటిలో అధిక శాతం కొవ్వు, చక్కెర, ఉప్పు, శాచ్యురేటెడ్ ఫ్యాట్స్, ట్రాన్స్ ఫ్యాట్స్, అధిక కాలరీలు ఉంటాయి. తరచూ ఈ తరహా ఆహారాలను తీసుకోవడం వల్ల ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపడంతోపాటు అధిక బరువు, ఊబకాయాలకు దారితీస్తున్నాయి.



క్రమబద్ధీకరణ దిశగా కసరత్తు..

ప్రాసెస్డ్ ఫుడ్ వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కేంద్రం ప్రీ-ప్యాకేజ్డ్ ప్రాసెస్డ్ ఫుడ్స్ క్రమబద్ధీకరణ, వాటి గ్రేడింగ్స్, ఉపయోగాల గురించిన విధాన రూపకల్పనకు కసరత్తు చేస్తోంది. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) వివిధ సింబల్స్ ఆధారంగా ఫ్రంట్ ఆఫ్ ప్యాక్ న్యూట్రిషనల్ లేబులింగ్‌ని అమలు చేయాలని యోచిస్తోంది. ఏ ప్రాసెస్డ్ ఆహారం ఎంత మేరకు ఆరోగ్యకరమో ప్యాకెట్లపై స్టార్ రేటింగ్స్ ద్వారా తెలిపేలా కేంద్రం చర్యలు చేపట్టనుంది.

ఆహార అభిరుచులపై సర్వే...

ఇండియన్‌కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌సంయుక్తంగా ప్యాకేజ్డ్ ఫుడ్స్ వాడకంపై ఓ అధ్యయనం చేపట్టాయి. 10 నుంచి 60 ఏళ్లలోపు వారిని రెండు వర్గాలుగా విభజించి ఢిల్లీ, కోల్‌కతా, పుణే, హైదరాబాద్, జోర్హత్‌లలో 3,231 మందిపై సర్వే నిర్వహించాయి. ఆహారం, సంస్థల విశ్వసనీయత, పోషకాల శాతం, స్టార్ రేటింగ్స్, వార్నింగ్ లేబుల్స్ వంటి అంశాల గురించి పలు ప్రశ్నలు అడిగాయి. అనేక ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. అవి ఏమిటంటే...

ఎక్స్‌పైరీ డేట్‌కే అధిక ప్రాధాన్యత

- మనోళ్లు ఎక్కువగా ప్రాసెస్డ్ ఫుడ్ ప్యాకెట్లపై వాటి ఉత్పత్తి, ఎక్స్‌పైరీ తేదీల వివరాలనే పరిశీలిస్తున్నారు.
- క్యాలరీలు, కొవ్వుపదార్థాలు, శాచ్యురేటెడ్ ఫ్యాట్స్, కార్బోహైడ్రేట్లు, చక్కెర, ప్రోటీన్లు, ఉప్పు, కొలెస్ట్రాల్ వంటివి చెక్ చేయడం తక్కువే.
- ఐఎస్ఐ, అగ్‌మార్క్, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ వంటి పరిశీలన కూడా అంతంతే.

ప్యాకేజ్డ్ పాలు, నూడుల్స్ వాడకమే ఎక్కువ

- ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల్లో వినియోగదారులు ఎక్కువగా పాలు 61.4 శాతం (రోజువారీ) వాడుతున్నారు. బిస్కెట్స్ 11.6 శాతం (రోజువారీ) బ్రెడ్ 7.2 శాతం (రోజువారీ), చిప్స్ 6.9 శాతం (రోజువారీ), చాక్లెట్లు 5.1 (రోజువారీ) తింటున్నారు. ➡ అలాగే ఇన్‌స్టంట్ నూడుల్స్ 50.6 శాతం (వారానికి), కేక్‌లు 41.8 శాతం (వారానికి), ఏరేటెడ్ డ్రింక్స్ 38.5 శాతం (వారానికి) ఐస్‌క్రీమ్ 37.2 శాతం (వారానికి), చాక్లెట్లు 36.4 శాతం (వారానికి) లాగిస్తున్నారు.

బ్రాండ్ పేరు చూసే మొగ్గు..

- వినియోగదారుల్లో బ్రాండ్ పేరును చూసి 65.2 శాతం మంది కొంటుండగా, వెజ్,నాన్‌వెజ్ సింబల్స్ చూసే వారు 46 శాతం, పరిమాణం చూసేవారు 31.8 శాతం, ఆరోగ్య కారకాలు (హెల్త్ క్లెయిమ్స్) చూసి కొనేవారు 30.1 శాతం మంది ఉంటున్నారు.

పెరుగుతున్న ఊబకాయం...

- ప్రపంచ ఆరోగ్య సంస్థ (2020) లెక్కల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా వయోజనుల్లో 39 శాతం మంది అధిక బరువుతో, 13 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు.
- 2015లో 'ఐసీఎంఆర్-ఇండియా బీ'చేపట్టిన సర్వే ప్రకారం 15 రాష్ట్రాల్లో 11.8 శాతం నుంచి 31.3 శాతం మధ్య భారతీయులు అధిక బరువుతో ఇబ్బందిపడుతున్నారు.

ప్రభుత్వ స్థలాల్లో ఉన్న ఇళ్లు ఎన్ని?

- నియోజకవర్గాల వారీగా సమాచార సేకరణ
- నమూనా ప్రకారం గణాంకాలు పంపాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం లేదా ఇళ్లు నిర్మించి ఇచ్చే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఇళ్లులేని పేదల వివరాలతో పాటు ఇప్పటికే ప్రభుత్వ, ప్రభుత్వ సంబంధిత జాగాల్లో ఇళ్లు నిర్మించుకున్నవారి గణాంకాల సేకరణకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. కాగా, నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్న సంకల్పంతో ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కట్టించింది. అయితే డిమాండ్‌కు తగినన్ని డబుల్.. ఇళ్లు లేకపోవడంతో సొంతంగా ఇళ్లు నిర్మించుకునే వారికి ఆర్థిక సహకారాన్ని అందించాలని యోచిస్తోంది. మరోవైపు ఇంటి స్థలం లేని వారికి పట్టా సర్టిఫికెట్లు ఇచ్చే అంశాన్ని సైతం పరిశీలిస్తోంది. ఈ క్రమంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇళ్లులేని పేదలు, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న వారెందరు.. వంటి అంశాలపై పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి ప్రభుత్వానికి సమర్పించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ స్థలాలు, సంక్షేమ శాఖలు సేకరించిన భూములు, సీలింగ్ భూములు, గ్రామకంఠం, దేవాలయ భూములు, వక్ఫ్‌భూమి, శిఖం, ఇతర ప్రభుత్వ విభాగాల స్థలాలు, ప్రభుత్వ లీజు స్థలాలు, సాదాబైనామా పట్టాలు, నోటరైజ్డ్ పట్టాభూములు వంటి 12 అంశాలతో కూడిన ఫార్మాట్‌ను రూపొందించిన ప్రభుత్వం దాన్ని జిల్లా కలెక్టర్లకు పంపింది. ప్రభుత్వ నిర్ణీత నమూనాలో అడిగిన సమాచారం ఇప్పటికే చాలా జిల్లాల్లో అందుబాటులో ఉండటంతో అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ వారీగా గణాంకాల రూపంలో ఇవ్వాలని స్పష్టం చేసింది. గురువారం జరిగే వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఈ అంశంపై మరింత స్పష్టత రానుందని అధికారులు చెపుతున్నారు.

ఇప్పటికైనా సహకరించండి

- తెలంగాణలో విమానాశ్రయాల ఏర్పాటుపై బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించడం లేదు
- కేంద్ర ప్రభుత్వానికి సహకరించకపోతే ఎలా?
- ఆదిలాబాద్, జక్రాన్‌పల్లి, వరంగల్‌లో ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి ముందుకు రావాలి
- సీఎం కేసీఆర్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. సాంకేతిక, భూపరీక్షల ఆమోదాన్ని పొందిన ఆదిలాబాద్, జక్రాన్ పల్లి (నిజామాబాద్), వరంగల్ విమానాశ్రయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలంటూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కేంద్రమంత్రి బుధవారం లేఖ రాశారు. తెలంగాణలో ఎయిర్‌వేస్ అనుసంధానత కోసం అవసరమైన డెవలప్‌మెంట్ చేసి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనేకసార్లు కోరినప్పటికీ ఎలాంటి సహకారం అందట్లేదని నిందించారు. సామాన్యుడికి కూడా విమానయానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు 2016 లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఉడాన్'పథకానికి అనుగుణంగా తెలంగాణలోనూ అన్ని రకాల అనుమతులు ఉన్నటువంటి ఆదిలాబాద్, జక్రాన్‌పల్లి, వరంగల్‌లో విమానాశ్రయాల నిర్మాణం జరగాలని పేర్కొన్నారు. వీటి ద్వారా చిన్న, ప్రైవేటు విమానాలు రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని కిషన్ రెడ్డి ఆ లేఖలో వివరించారు.

ఎన్ని లేఖలు రాసినా...

విమానాశ్రయాల నిర్మాణం తదితర అంశాలకు సంబంధించి ఎయిర్ పోర్ట్ అథారిటీ పలుమార్లు లేఖలు రాసినా, చివరికి పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సీఎం కేసీఆర్‌కు లేఖ రాసినా ఎలాంటి స్పందన రాలేదని ఆరోపించారు. పౌర విమానయాన శాఖ మంత్రి లేఖకు కొనసాగింపుగా.. ఈ విమానాశ్రయాల అభివృద్ధికి సహకరించాలంటూ.. తాను స్వయంగా సీఎంకి గతేడాది జూలై 30 న లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు. దీనికి కూడా సీఎం కార్యాలయం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడం దురదృష్టకరమని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం జక్రాన్ పల్లి, పాల్వంచ (భద్రాద్రి కొత్తగూడెం), దేవకరద్ర (మహబూబ్ నగర్), మామునూరు (వరంగల్), బసంత్ నగర్ (పెద్దపల్లి), ఆదిలాబాద్‌లో విమానాశ్రయాల కోసం ప్రతిపాదనలు పంపిందని.. అయితే ఏఏఐ చేపట్టిన ఓఎల్ఎస్ సర్వే, సాయిల్ టెస్టింగ్ (భూపరీక్ష), టెక్నో-ఎకనమిక్ ఫీజిబిలిటీ స్టడీ (టీఈఎఫ్ఎస్) చేసిన తర్వాత ఆదిలాబాద్, జక్రాన్‌పల్లి, వరంగల్‌లో విమానాశ్రయాల ఏర్పాటుకు ఆమోదముద్ర వేసిందని కిషన్ రెడ్డి ఆ లేఖలో గుర్తుచేశారు.

స్పందించకుండా... పార్లమెంటులో ప్రశ్నలు

రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయాలు అభివృద్ధి చేసి ఇమ్మని అడిగితే స్పందన రాకపోగా.. ఆ పార్టీ ఎంపీలు మాత్రం పార్లమెంటులో కేంద్రం ఈ దిశగా ఏం చేస్తోందంటూ ప్రశ్నలు అడగటం హాస్యాస్పదమని విమర్శించారు. 2014 లో 74 గా ఉన్న విమానాశ్రయాల సంఖ్య ప్రస్తుతం 140 దాటడం, 2026 నాటికి ఈ సంఖ్యను 220కి పెంచే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తోందన్నారు. విమానయాన రంగంలో ఉన్నటువంటి ఈ సానుకూలమైన వాతావరణాన్ని సద్వినియోగ పరచుకుని రాష్ట్రంలోనూ విమానాశ్రయాల పెంపుపై ప్రభుత్వం దృష్టిసారిస్తే బాగుంటుందనికిషన్‌రెడ్డి సూచించారు.

అవసరమైతే కొండగట్టుకు వెయ్యి కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

పలు కీలక సూచనలు, ఆదేశాలు ఇచ్చారు.

గర్భగుడిని ముట్టుకోవద్దు..

'యాదాద్రి తరహాలో వైష్ణవ సంప్రదాయాల్ని పాటిస్తూ.. ప్రతి సూక్ష్మ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. ప్రస్తుతం ఉన్న గర్భగుడిని ఏమాత్రం ముట్టుకోకుండా మిగిలిన చోట్ల పునర్నిర్మాణాలు చేపట్టాలి. ఇందుకోసం పండితులు, వాస్తు నిపుణులు, ఆర్కిటెక్టులు సమన్వయంతో వ్యవహరించాలి. హనుమాన్ జయంతి, ఇతర రద్దీ రోజుల్లోనూ భక్తుల తాకిడిని తట్టుకునేలా ఏర్పాట్లు ఉండాలి. 850 ఎకరాల్లో ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలి. క్షేత్రాన్ని సందర్శించే భక్తుల వాహనాల కోసం 86 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి..'అని చెప్పారు.

మాల ధారణ, విరమణ సజావుగా సాగాలి

'కేవలం తెలంగాణ, పొరుగు రాష్ట్రాల భక్తులే కాకుండా దేశవ్యాప్తంగా భక్తులు ఇక్కడికి వచ్చేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. ముఖ్యంగా మాల ధారణ, విరమణ సమయంలో లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు. అందుకు అనుగుణంగా పుణ్యక్షేత్రంలో రవాణా సదుపాయాలు, అన్ని ప్రధాన ద్వారాలు విస్తరించాలి. భవిష్యత్తులోనూ పెరిగే భక్తుల సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు ఉండాలి..'అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

సీఎం మరికొన్ని ఆదేశాలు

- రెండు నెలల్లో వరద కాలువ నుంచి పైపుల ద్వారా కొండగట్టు పైకి నీటిని తరలించాలి. భక్తుల సౌకర్యాలకు సరిపోయేలా వసతి కల్పించాలి. (సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు ఆదేశం) ఈ నీటితోనే నిర్మాణాలు కూడా చేపట్టాల్సి ఉంటుంది కాబట్టి, పనులు వేగిరం చేయాలి.
- విద్యుత్ సబ్ స్టేషన్, దవాఖానా, బస్టాండు, పార్కింగ్ స్థలం, రోడ్ల నిర్మాణం, పుష్కరిణి, వాటర్ ట్యాంకులు, నీటి వసతి, కాటేజీల నిర్మాణం, దీక్షాపరుల మంటపం, పోలీస్ స్టేషన్, కళ్యాణ కట్ట తదితర మౌలిక వసతులను భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని నిర్మించాలి.
- గుడి అభివృద్ధికి అవసరమైన శిల్పులను సమకూర్చాలి. ఆలయ నిర్మాణం పూర్తి కావడానికి కనీసం మూడేళ్లు పడుతుంది. ఆలోపు బాలాలయాన్ని నిర్మించాలి.
- కొండగట్టు అంజన్న అభయారణ్య ప్రాంతాన్ని మైసూరు-ఊటీ రహదారిలో ఉన్న, నీలగిరి కొండల్లోని బండీపూర్ అభయారణ్యం మాదిరి మార్చాలి. (అటవీశాఖ అధికారి భూపాల్ రెడ్డికి ఆదేశం). మొదట మూలవిరాట్టును దర్శించుకున్న తర్వాత అమ్మవారిని, ఆ తర్వాత వెంకటేశ్వర స్వామిని, గుట్ట కింద బేతాళ స్వామిని, రాములవారి పాదుకలను దర్శించుకునేలా సర్క్యూట్‌ను అనుసరించి నిర్మాణాలు చేపట్టాలి.
- క్షేత్రాన్ని సందర్శించే వీవీఐపీల కోసం యాదగిరిగుట్ట మాదిరి ప్రెసిడెన్షియల్ సూట్లు, వీవీఐపీ సూట్లు నిర్మించాలి. ఇందుకోసం స్థలాన్ని ఎంపిక చేసి, వాస్తు నియమాలను అనుసరించి నిర్మాణాలు చేపట్టాలి.
- అంజనాద్రి పేరుతో వేద పాఠశాలను నిర్మించాలి. అందుకు తగిన స్థలం ఎంపిక చేయాలి.

ఆదాయం, జమ వ్యత్యాసంపై ఆగ్రహం

గుట్టలపై నుంచి సహజంగా ప్రవహించే ప్రవాహం (జలబుగ్గ) నుంచి నీటి లభ్యత గురించి, దాని అభివృద్ధి గురించి, గుట్ట సమీపంలోని చెరువులపై సీఎం ఆరా తీశారు. గుడికి వస్తున్న ఆదాయం గురించి కూడా ఆరా తీశారు. ప్రభుత్వానికి చేస్తున్న జమలో వ్యత్యాసంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మహా కార్యం పూర్తయ్యే వరకు తాను వస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ దివకొండ దామోదర్ రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, బాల్క సుమన్, జీవన్ రెడ్డి, సంజయ్, కె.విద్యాసాగర్ రావు, కోరుకంటి చందర్, మండలి చీఫ్ విప్ భానుప్రసాదరావు, ఎమ్మెల్సీ ఎల్.రమణ, కలెక్టర్ యాస్మిన్ భాషా, ఆలయ స్థపతి ఆనంద్ సాయి, వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ, ఆలయ ఈఓ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమసిన కోమటిరెడ్డి 'హంగ్' తుపాను

- కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్‌తో ఠాక్రే భేటీ... వ్యాఖ్యల వీడియో పరిశీలన
- తెలుగులో మాట్లాడిన విషయాలను అనువాదం చేయించుకున్న ఠాక్రే
- మాణిక్‌రావ్ ఠాక్రే లైట్ తీసుకున్నారన్న కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్ పొత్తుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎపిసోడ్ ముగిసినట్టేనని తెలుస్తోంది. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఓ పెద్ద దుమారాన్నే రేపినప్పటికీ కాంగ్రెస్‌లో మాత్రం తెల్లారేసరికి సమసిపోయాయి. రాష్ట్రంలో హంగ్ ఏర్పడుతుందని జోస్యం చెప్పిన తన మాటలు వివాదాస్పదం కావడంతో మంగళవారం సాయంత్రం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో భేటీ అయిన కోమటిరెడ్డి బుధవారం ఉదయం కూడా మరోసారి కలిశారు. వీరి భేటీలో ఏఐసీసీ కార్యదర్శులు బోసు రాజు, నదీమ్ జావేద్ కూడా పాల్గొన్నారు. ఢిల్లీలో కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపైనే భేటీలో చర్చించారని, తెలుగులో ఉన్న వ్యాఖ్యలను ఠాక్రే హిందీలోకి అనువాదం చేయించుకుని మరీ వీడియోను పరిశీలించారని సమాచారం. అదేవిధంగా వరంగల్‌లో జరిగిన రైతు డిక్లరేషన్ సభలో రాహుల్‌గాంధీ మాట్లాడిన వీడియోను కూడా ఠాక్రే చూశారని తెలిసింది. రెండు వీడియోలు చూశాక ఎన్నికల తర్వాత జరిగే అంశంపై ఏది మాట్లాడినప్పటికీ కాంగ్రెస్ అధికారంలోకి రాలేదని చేసిన వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగించేలా ఉన్నాయని, ఇలాంటి వ్యాఖ్యలను పునరావృతం కానివ్వొద్దని కోమటిరెడ్డికి ఠాక్రే చెప్పినట్టు తెలిసింది. దీనిపై కోమటిరెడ్డి నుంచి మౌఖిక వివరణ తీసుకున్న ఠాక్రే.. ఈ ఎపిసోడ్‌పై ఏఐసీసీకి నివేదిక కూడా పంపనున్నారు. ఇక ఈ ఎపిసోడ్ ఇక ముగిసినట్టేనని భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన ఠాక్రే, కోమటిరెడ్డి, బోసురాజు చెప్పడం గమనార్హం.

రాహుల్ లైన్‌లో నడుచుకోవాలి: ఠాక్రే

కోమటిరెడ్డితోపాటు పార్టీలోని నేతలందరూ రాహుల్‌గాంధీ చెప్పిన లైన్‌లోనే నడుచుకోవాలని మాణిక్‌రావ్ ఠాక్రే చెప్పారు. కోమటిరెడ్డి కూడా అదే లైన్‌లో ఉన్నారని, మంగళవారం ఆయన చేసినవ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారని తెలిపారు. తెలంగాణలో ఏ పార్టీతో తమకు పొత్తులు ఉండవని చెప్పిన ఠాక్రే.. ఒంటరిగానే అధికారంలోకి వస్తామన్నారు.

వివరణతో తృప్తి చెందాం: బోసురాజు

వెంకట్‌రెడ్డి ఇచ్చిన వివరణతో తృప్తి చెందామని ఏఐసీసీ కార్యదర్శి బోసురాజు చెప్పారు. పొత్తులపై హైకమాండ్‌దే తుది నిర్ణయమని, కోమటిరెడ్డి సమస్య సమసిపోయిందని ఆయన తెలిపారు.

ఎన్నికల సన్నద్ధతపై చర్చించాం: కోమటిరెడ్డి

తాను ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలను ఠాక్రే పరిశీలించారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. తన వ్యాఖ్యలను ఠాక్రే లైట్ తీసుకున్నారని, భేటీలో ఎన్నికల కోసం సన్నద్ధతపై చర్చించామన్నారు. ఆరు నెలల ముందే కొందరు అభ్యర్థులను ప్రకటించాలని ఠాక్రేకు చెప్పానని, త్వరలోనే తాను కూడా భువనగిరి నుంచి హాథ్‌సే హాథ్ జోడో యాత్ర చేస్తానని చెప్పారు.

టీపీసీసీ నేతలతో ఠాక్రే భేటీ

హాథ్ సే హాథ్ జోడో యాత్రలు, అనుబంధ సంఘాల పనితీరుపై సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రే బుధవారం గాంధీభవన్‌లో బిజీబిజీగా గడిపారు. ఉదయం టీపీసీసీ ఉపాధ్యక్షులతో భేటీ అయిన ఆయన హాథ్ సే హాథ్ జోడో యాత్రలపై సమీక్ష చేశారు. ఈనెల 6 నుంచి ప్రారంభమైన ఈ యాత్రలను తేలికగా తీసుకోవద్దని, ఉపాధ్యక్షులకు కేటాయించిన నియోజకవర్గాలకు వెళ్లి యాత్రలు జరుగుతున్న తీరును పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. స్వయంగా యాత్రల్లో పాల్గొనాలని చెప్పారు. ఈ యాత్రల నివేదికలు ఏఐసీసీకి పంపాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో హాథ్‌సే హాథ్ జోడో అభియాన్ రాష్ట్ర ఇంచార్జి గిరీశ్ చోడంకర్, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులు బోసురాజు, నదీమ్ జావేద్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం టీపీసీసీ ఎస్టీ సెల్, కిసాన్ సెల్ రాష్ట్ర నేతలు, జిల్లా అధ్యక్షులతో సమావేశమైన ఠాక్రే అనుబంధ సంఘాల పనితీరుపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాల్లో ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు సుంకేట అన్వేశ్‌రెడ్డి, జగన్‌లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాణిక్ రావ్ ఠాక్రే, బోసురాజు

క్లుప్తంగా...

నేడు ఎర్రవల్లికి పంజాబ్ సీఎం

- కొండపోచమ్మసాగర్ సందర్శన
- ఎర్రవల్లి చెక్‌డ్యాం, పాండవుల చెరువు పరిశీలన



సాక్షి, హైదరాబాద్: పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ నేతృత్వంలో ఆ రాష్ట్ర అధికారుల బృందం గురువారం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వగ్రామం ఎర్రవల్లిని సందర్శించనుంది. కాగా బుధవారం రాత్రి భగవత్‌మాన్‌సింగ్ హైదరాబాద్‌కు చేరుకొని సీఎం కేసీఆర్‌ను కలిశారు. మాన్‌సింగ్ బృందం కొండపోచమ్మ సాగర్ జలాశయంతో పాటు ఎర్రవల్లిలోని చెక్‌డ్యాం, పాండవుల చెరువును పరిశీలించనుంది. గురువారం ఉదయం 10 గంటలకు రోడ్డు మార్గంలో హైదరాబాద్ నుంచి బయల్దేరి.. మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి నగరానికి చేరుకోనుంది. రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఈఎన్‌సీ (జనరల్) సి.మురళీధర్, గజ్వేల్ ఈఎన్‌సీ హరిరామ్ ఈ పర్యటనలో పాల్గొని.. ఆయా ప్రాజెక్టుల గురించి పంజాబ్ బృందానికి వివరించనున్నారు. కార్యక్రమంలో పంజాబ్ సీఎంతో పాటు ఆ రాష్ట్ర సీఎంవో కార్యాలయ ఐఏఎస్ అధికారులు, నీటిపారుదల శాఖాధికారులు పాల్గొంటారు.

షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు: గుత్తా



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలో ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని తాను భావిస్తున్నానని, ముందస్తు వచ్చే అవకాశం లేదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ముందస్తుకు వెళ్లేంత సమయం కూడా లేదని, మధ్యలో కేవలం ఆరు నెలలే గడువు ఉందన్నారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. భవిష్యత్తు ఎన్నికల్లో వామపక్షాలతో కలిసి ముందుకు వెళ్లాలని మునుగోడు ఎన్నికల సమయంలో అవగాహన కుదిరినట్లు తమ పార్టీ వారు తనకు చెప్పారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాదని, హంగ్ వస్తుందని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దండుపాళ్యం బ్యాచ్ అని చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీ నాయకులకే వర్తిస్తాయని విమర్శించారు. కేసీఆర్ సాధించిన ప్రగతే బీఆర్ఎస్ ప్రభుత్వానికి మళ్లీ పట్టం కడుతుందన్నారు.

కిషన్, సంజయ్ వ్యాఖ్యలు అర్థరహితం: కడియం



స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేత గాని చవటలు, దద్దమ్మలని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి విమర్శించారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం తాటికొండ, జిట్టిగూడెం శివారులో చేపడుతున్న గండిరామారం(మల్లన్న గండి) కుడి కాల్వ పనులను ఆయన బుధవారం సంబంధిత అధికారులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అప్పులు చేశారని రాజకీయ చవటల్లా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తే జైలే..



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వాన్ని విమర్శించేవారిని పీఎం మోదీ జైళ్లలో వేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం కేవలం రాజకీయ ప్రత్యర్థులపైనే కాకుండా.. తమకు రుచించని వార్తలు ప్రసారం చేసిన అంతర్జాతీయ మీడియా సంస్థలపై కూడా దాడులు చేయడం దుర్మార్గమని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మోదీ కి సంబంధించిన విషయాలను బీబీసీ బయటపెట్టిందనే అక్కసుతో, దేశంలో ఆ వార్తా సంస్థను అణగదొక్కడమంటే భావస్వేచ్ఛను కాలరాయడమేనన్నారు.

ఇంటింటికీ తెలుగుదేశం కిట్ల పంపిణీ: కాసాని



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభంకానున్న ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి సంబంధించిన మెటీరియల్ కిట్లను త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ నాయకులతో బుధవారం సమావేశమయ్యారు. టీటీడీపీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.


అంకాపూర్ దేశీ కోడి కూరకు 50 ఏళ్లు.. ఆహా ఏమి రుచి



- కుగ్రామంలో మొదలై అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి ..
- ప్రత్యేకంగా ఆర్డర్ చేసుకుని ఆస్వాదిస్తున్న భోజన ప్రియులు
- ఇతర ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌కూ ఆర్డర్ మెస్‌లు విస్తరణ
- అప్పట్లో కిలో దేశీ కోడి కూర, అన్నం రూ.5..
- ప్రస్తుతం రూ.1,000 వరకు
- జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతితో 'అంకాపూర్'ప్రత్యేక వంటకంగా గుర్తింపు
- హైదరాబాద్, చుట్టుపక్కల జిల్లాల్లో 'అంకాపూర్ చికెన్'మెస్‌ల ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

'అంకాపూర్ దేశీ చికెన్'.. ఈ పేరు వింటే చాలు మాంసం ప్రియులకు నోట్లో నీళ్లూరుతాయి. ఎన్ని రకాల చికెన్ ఐటమ్స్ ఉన్నా.. ఈ దేశీ (నాటు) కోడి కూర రుచే వేరంటే అతిశయోక్తి కాదు. నాన్‌వెజ్ ప్రియులు వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా అంకాపూర్ వచ్చి మరీ ఈ కోడి కూరను ఆస్వాదిస్తుంటారు. 50 ఏళ్ల క్రితం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ప్రారంభమైన ఈ దేశీ కోడి కూర ఇప్పటికీ తిరుగులేని బ్రాండ్ ఇమేజ్‌తో తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. అంకాపూర్ గ్రామానికి చెందిన దుబ్బ గౌడ్, లక్ష్మి దంపతులకు వచ్చిన ఆలోచన.. నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆ ఊరి పేరును మార్మోగిస్తోంది. ఈ పేరుతో అనేకచోట్ల హోటళ్లు, ఆర్డర్ మెస్‌లు ఏర్పాటు కావడం విశేషం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ సహా అనేక మంది జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రజా ప్రతినిధులు ఈ అంకాపూర్ దేశీ కోడి కూరను రుచి చూసి మెచ్చుకున్న వారే కావడం గమనార్హం.



బుర్ర దుబ్బగౌడ్, లక్ష్మి

కల్లు తాగే వారి కోసం..

గీత కార్మికుడైన బుర్ర దుబ్బగౌడ్ కల్లు తాగేందుకు తన వద్దకు వచ్చే వారికి.. నాటు కోడి కూర వండి విక్రయించేవాడు. క్రమంగా దుబ్బగౌడ్ దగ్గరికి కల్లు కోసం వచ్చేవారి సంఖ్య పెరిగింది. దీంతో దుబ్బ గౌడ్, అతని భార్య లక్ష్మి దేశీ కోడి కూరతో పాటు బాతు కూర, ఆమ్లెట్‌లు వేసివ్వడం ప్రారంభించారు. ఇందుకోసం గ్రామంలోని తమ ఇంటి వద్దనే దేశీ కోళ్లు, బాతులు పెంచడం ప్రారంభించారు. గిరాకీ పెరగడంతో మునిపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల నుంచి రెండున్నర రూపాయల నుంచి మూడు రూపాయలకు ఒక కోడిని కొనుగోలు చేసి నలుగురు వ్యక్తులు తినడానికి సరిపడా కిలో బియ్యంతో అన్నం వండి రూ.5కు అందించడంతో క్రమంగా వారి వ్యాపారం పుంజుకుంది. లాభాల బాటలోకి వచ్చిన ఈ దంపతులను చూసి అదే గ్రామానికి చెందిన తాళ్లపల్లి రామగౌడ్, తాళ్లపల్లి మల్లాగౌడ్, బోండ్ల భాజన్న కూడా దేశీ కోడి కూర వంటకం ప్రారంభించారు. పదేళ్ల పాటు గ్రామంలోని గాంధీ చౌరస్తాలో నాటు కోడి కూర వ్యాపారం చేసిన దుబ్బ గౌడ్, లక్ష్మి దంపతులు పోటీ అధికం కావడంతో విరమించుకుని జీవనోపాధి కోసం హోటల్ పెట్టుకున్నారు. ప్రస్తుతం వీరు కాలం చేశారు. ఈ దంపతులు ప్రారంభించిన దేశీ కోడి కూర రుచి, అంకాపూర్ పేరు క్రమంగా అంతర్జాతీయ స్థాయికి విస్తరించాయి.

ఒరిజినల్ కోడి అయితే ఎక్కువ ధర..



అంకాపూర్ దేశీ కోడి (క్రాస్ బ్రీడ్) కూరను సొంతంగా తయారు చేసిన ప్రత్యేకమైన మసాలాలు దట్టించి వండటంతో దానికి మంచి రుచి వస్తుంది. కోరిన వారికి ఎల్లిగడ్డ కారం సైతం ప్రత్యేకంగా ఒక గిన్నెలో పెట్టి ఇస్తారు. భోజన ప్రియులు, ముఖ్యంగా నాన్‌వెజ్ ప్రియులు ఈ కూరను ఇష్టంగా తింటున్నారు. అయితే 50 ఏళ్ల క్రితం కిలోకు రూ.5తో ప్రారంభమైన ఈ దేశీ కోడి కూర, అన్నం ధర ప్రస్తుతం రూ.1,000 వరకు ఉంటోంది. గ్రామంలో సుమారు పది మంది ఆర్డర్ మెస్‌లు నెలకొల్పారు. ప్రస్తుతం రూ.700కు నలుగురికి సరిపడా ఫారంలో పెంచిన దేశీ కోడి కూర, అన్నం చేసి ఇస్తున్నారు. ఆర్డర్ మెస్‌లోనే తినే వారికి రూ.130కు ప్లేట్ చొప్పున వడ్డిస్తున్నారు. ఇక గ్రామాల్లో పెరిగిన ఒరిజినల్ దేశీ కోడికి మాత్రం రూ.1,000 వరకు తీసుకుంటున్నారు.

డెలివరీ @ 'డోర్ స్టెప్'

ఒక కోడి ఆర్డర్ చేసిన వారు తమ గ్రామ శివారులో ఎక్కడ కూర్చున్నా తోటలు, పంట పొలాలు, ఇళ్లకు నేరుగా వెళ్లి అందిస్తున్నారు. భోజనం తరువాత గిన్నెలను సైతం వారే తీసుకెళుతున్నారు. వండి నేరుగా తెచ్చి ఇస్తుండడంతో పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన వారు పంట పొలాల్లో, మామిడి తోటల్లో భోజనం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొందరు నిజామాబాద్, ఇతర గ్రామాల్లో కూడా ఆర్డర్ మెస్‌లు ప్రారంభించారు. అంకాపూర్ గ్రామం జాతీయ రహదారికి పక్కనే ఉండడంతో ఇక్కడ ఎర్రజొన్న సీడ్ వ్యాపారం అభివృద్ధి చెందింది. సుమారు 40 సీడ్ కంపెనీలు ఇక్కడ ఏర్పాటయ్యాయి. మరోవైపు వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు రావడంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తరచూ అంకాపూర్‌ను సందర్శిస్తున్నారు. దేశీ కోడి కూరను రుచి చూసి వివిధ ప్రాంతాల్లో దీని గురించి చెప్పడంతో ప్రాచుర్యం పొందింది. అంకాపూర్ దేశీ కోడి ఆర్డర్ మెస్‌ల నిర్వాహకులు కరీంనగర్ జిల్లాతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో దేశీ కోళ్లను కొనుగోలు చేస్తున్నారు.

ఇతర ప్రాంతాలకూ విస్తరణ..

పాతికేళ్ల క్రితం వరకు కేవలం అంకాపూర్ గ్రామానికే పరిమితమైన ఆర్డర్ మెస్‌లు ప్రస్తుతం విస్తరించాయి. ఆర్మూర్ పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో సైతం అంకాపూర్ దేశీ కోడి కూర పేరుతో ఆర్డర్ మెస్‌లు వెలిసాయి. హైదరాబాద్‌లోని కొంపల్లి, మేడ్చల్ తదితర ప్రాంతాలకు నిజామాబాద్, పెర్కిట్, మామిడిపల్లి కేంద్రాలకు విస్తరించాయి. నిజామాబాద్ జిల్లాలో సుమారు వందకు పైగా అంకాపూర్ దేశీ కోడి కూర అందించే ఆర్డర్ మెస్‌లు ఉండగా.. ఒక్క ఆర్మూర్ మండలంలోనే 50కి పైగా ఆర్డర్ మెస్‌లు ఉన్నాయి. అయితే ఈ దేశీ కూర మెస్‌లను అంకాపూర్ వాసులే కాకుండా వరంగల్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సైతం ఏర్పాటు చేసి ఆర్మూర్ ప్రాంతంలో నిర్వహిస్తున్నారు.

విదేశాలకూ పార్శిల్స్..
ఆర్మూర్ ప్రాంతానికి చెందిన పలువురు అమెరికా, యూరప్, గల్ఫ్ దేశాల్లో ఉంటున్నారు. ఉద్యోగాలు, ఉపాధి కోసం అక్కడ స్థిరపడిన వారి కోసం బంధువులు అంకాపూర్ దేశీ కోడి కూరను ఇక్కడ ప్రత్యేకంగా ప్యాక్ చేయించి కొరియర్ ద్వారా పంపిస్తున్నారు.



ప్రత్యేక మసాలాలతో ప్రత్యేక రుచి..

ఇంట్లో వండే చికెన్‌లా కాకుండా మేము ప్రత్యేకంగా తయారు చేసిన కొన్ని మసాలాలు దట్టించి దేశీ కోడి కూరను వండుతాం. చాలా రుచికరంగా ఉంటుండటంతో భోజన ప్రియులు తినడానికి ఆసక్తి చూపుతున్నారు. –కుంట నారాయణ గౌడ్, ఆర్డర్ మెస్ నిర్వాహకుడు, అంకాపూర్



అంతర్జాతీయ గుర్తింపుతో ఆనందం

అంకాపూర్ దేశీ కోడి కూర తినడానికి వివిధ ప్రాంతాల నుంచి భోజన ప్రియులు వస్తున్నారు. కోరిన విధంగా వారికి వండి పెడుతున్నాము. అంతర్జాతీయ స్థాయిలో అంకాపూర్‌కు గుర్తింపు రావడం ఆనందంగా ఉంది.
– తాళ్లపల్లి శ్రీకాంత్, ఆర్డర్ మెస్ నిర్వాహకుడు, అంకాపూర్



అంకాపూర్‌ను మించి పెర్కిట్‌లో వ్యాపారం..

దేశీ కోడి తినాలనుకున్న భోజన ప్రియులు కోరిన విధంగా వండి ఇస్తున్నాము. అంకాపూర్ కంటే పెర్కిట్, మామిడిపల్లిలో దేశీ కోడి ఆర్డర్ మెస్ వ్యాపారం చాలా ఎక్కువగా జరుగుతోంది. పట్టణ ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడికి ఎక్కువగా వస్తున్నారు.
– జీవన్‌గౌడ్, ఆర్డర్ మెస్ నిర్వాహకుడు, పెర్కిట్, ఆర్మూర్

ఎవ్వరితో పొత్తుల్లేవ్

- ఏ పార్టీ మద్దతు లేకుండానే అధికారంలోకి వస్తాం
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టీకరణ... ఎంపీ కోమటిరెడ్డికి విశ్వసనీయత లేదని విమర్శ



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ తెలంగాణలో ఎవరిపైనా ఆధారపడి ప్రభుత్వం ఏర్పాటు చేయదని, స్వంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సత్తా తమ పార్టీకి ఉందని రాష్ట్ర పశు సంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. గంటకో మాట మార్చే ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి విశ్వసనీయత లేదని, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మంత్రి తలసాని మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలతో మమేకమైన తమ పార్టీకి పొత్తులు పెట్టుకునే అవసరం లేదన్నారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రకటనలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌లో ఎంపీగా ఉంటూ మునుగోడు ఉప ఎన్నికలో బీజేపీ ఓట్లు వేయాలని కోమటిరెడ్డి చెప్పారని గుర్తు చేశారు.

చర్చకు సిద్ధమేనా కిషన్‌రెడ్డి?

అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని తలసాని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలో అంబర్‌పేటలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు అక్కడి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పార్టీలు మారిన వారు, బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీలకు వెళ్లిన వారి పరిస్థితిని ప్రజలు గమనిస్తున్నారని, ఈటల రాజేందర్ బీఆర్ఎస్‌లోకి రావడం గురించి ఆయనకే తెలియాలని మంత్రి తలసాని వ్యాఖ్యానించారు. కడపలో స్టీల్ ప్లాంట్ ప్రారంభానికి అనుమతిచ్చిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణ సెక్రటేరియట్ ప్రారంభోత్సవానికి మాత్రం ఇవ్వలేదని ఆరోపించారు. సెక్రటేరియట్ కట్టడం గొప్పతనం భవిష్యత్తులో అందరికీ తెలుస్తుందని, కొత్త సచివాలయాన్ని చూసి కొందరు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు.

కేసీఆర్ జన్మదిన వేడుకలు నగరంలో ఘనంగా నిర్వహిస్తాం

ఈనెల 17న సీఎం కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను డివిజన్ల వారీగా నిర్వహిస్తామని, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అన్ని వర్గాలకు చెందిన ప్రార్థనా స్థలాలు, మందిరాల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు జరుగుతాయని తలసాని వివరించారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయంలో మేయర్ విజయలక్ష్మి, సికింద్రాబాద్ గణేశ్ దేవాలయంలో డిప్యూటీ మేయర్ శ్రీలత పూజలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బల్కంపేట ఆలయంలో రాజశ్యామల యాగం నిర్వహించడంతో పాటు నెక్లెస్ రోడ్డులోని థ్రిల్ సిటీలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు.

పదోన్నతులైనా ఉంటాయా?

▶ మొదటి పేజీ తరువాయి

కోర్టు ఆదేశించింది. తాజాగా మరోసారి నాన్ స్పౌజ్‌ల పిటిషన్‌పై కోర్టు స్టే ఇవ్వడంతో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయింది.

కోర్టులో సవాలా? వాయిదానా?

బదిలీలకు కోర్టు ఆదేశాలు అడ్డుగా నిలవడంతో ఏం చేయాలనే దానికిపై విద్యాశాఖ అధికారులు వివిధ కోణాల్లో ఆరా తీశారు. వీటన్నింటినీ క్రోడీకరిస్తూ ప్రభుత్వానికి తెలియజేస్తామని, సర్కార్ నిర్ణయం మేరకు ముందుకెళ్తామని ఓ ఉన్నతాధికారి తెలిపారు. నాన్ స్పౌజ్‌లకు సంబంధించి కోర్టు ఆదేశాలను సవాల్ చేసే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు అధికారులు చెప్పారు. మరోవైపు బదిలీలు ఆపినా ప్రమోషన్లు ఇవ్వాలనే కోణంలో అధికారులు చర్చించారు. కొన్ని సంఘాలు దీన్ని సమర్థిస్తుంటే, మరికొన్ని వ్యతిరేకిస్తున్నాయి. పదోన్నతులు చేపడితే స్కూల్ అసిస్టెంట్లు హెచ్‌ఎంలుగా ప్రమోట్ అవుతారు. ఎంఈవో విషయంలో స్పష్టత లేకపోవడంతో తమకు పదోన్నతులకు అవకాశం ఉండదని హెచ్‌ఎంలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమకూ పదోన్నతులు కల్పిస్తేనే న్యాయం జరుగుతుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో.. బదిలీలు, పదోన్నతుల వ్యవహారాన్ని వేసవి సెలవుల వరకూ వాయిదా వేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్తే టీచర్లంతా ఎన్నికల విధుల్లో పాల్గొనవలసి ఉంటుంది. అప్పుడు ఇక బదిలీలకు అవకాశమే ఉండదని టీచర్లు చెబుతున్నారు. ఈ ప్రక్రియ ఇప్పుడు కొనసాగకపోతే ఇక ఈ ఏడాదికి లేనట్టేనని అంటున్నారు.



ఇక కష్టమే..




బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ఇప్పట్లో ముందుకెళ్లే వాతావరణం కన్పించడం లేదు. కోర్టు స్టే విధించింది. పండితులు మళ్లీ కోర్టుకెళ్లారు. వేసవిలో టీచర్లకు అనేక బాధ్యతలుంటాయి. సరైన సమయంలో ఈ ప్రక్రియ చేపట్టకపోవడమే ఇన్ని సమస్యలకూ కారణం. – మహ్మద్ అబ్దుల్లా (టీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు)

ఇప్పుడు పదోన్నతులిస్తే నష్టం లేదు



పదోన్నతుల వ్యవహారం స్పష్టంగా ఉంది. ఇప్పుడిది పూర్తి చేసి, ఆ తర్వాత అందరికీ కలిపి బదిలీలు నిర్వహిస్తే నష్టమేమీ లేదు. ఇప్పటికే టీచర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఏళ్ళ తరబడి బదిలీలకు నోచుకోలేదు. ఇంకా కాలం వెళ్ళదీస్తే ప్రభుత్వం వాళ్ల ఆగ్రహానికి గురి కావలసి వస్తుంది. ఇదే విషయాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి తెలియజేశాం. – చావా రవి (టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి)

ప్రభుత్వంపై నమ్మకం ఉంది



టీచర్లకు బదిలీలు, పదోన్నతులు విషయంలో న్యాయ పరమైన సమస్యలు అధిగమించి, త్వరలోనే ప్రక్రియను ముందుకు తీసుకెళ్తుందన్న విశ్వాసం ఉంది. అన్ని కేడర్ల టీచర్లకు న్యాయం చేసే విషయమై మాకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన సంకేతాలు వచ్చాయి. – బీరెల్లి కమలాకర్ రావు (పీఆర్‌టీయూటీఎస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

ఆ ఉద్యోగులు పాత పింఛన్‌కు అర్హులే..

- రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టంచేసిన హైకోర్టు
- 'గురుకుల'ఉద్యోగుల పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో పనిచేసి 2008లో రెగ్యులర్ అయినవారికి పాత పింఛన్ స్కీమ్ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రెగ్యులర్ చేసిన తేదీ నుంచి కాకుండా నియామక తేదీ నుంచే సర్వీస్ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. అలా వర్తించినప్పుడు ప్రభుత్వ నిబంధన మేరకు పాత పింఛన్ స్కీమ్‌కు ఈ లెక్కర్లు అంతా అర్హులేనని పేర్కొంది. పింఛన్ దయతో ఇచ్చేది కాదని.. అది రాజ్యాంగ బద్ధ హక్కు అని తేల్చిచెప్పింది. పాత పింఛన్ స్కీమ్‌ను ప్రభుత్వం తమకు వర్తింపజేయకపోవడాన్ని సవాల్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన రుషికేశ్‌కుమార్‌తో పాటు మరో 120 మంది హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. 2000 నుంచి 2003లోనే తాము కాంట్రాక్టు ఉద్యోగులుగా చేరామని తెలిపారు. 2008లో ప్రభుత్వం తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేస్తూ జీవో నంబర్ 91ని జారీ చేసిందన్నారు. తాము విధుల్లో చేరిన నాటి నుంచి సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలని, 2018లో కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీమ్‌ను వర్తింపజేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ విచారణ చేపట్టి.. తీర్పు వెలువరించారు. పిటిషనర్ల తరఫున సీహెచ్ గణేశ్, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ విద్యాసంస్థల తరఫున భూపాల్ రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. '2004లో విధుల్లో చేరిన రెగ్యులర్ ఉద్యోగులకు పాత పింఛన్ స్కీమ్‌ను వర్తింపజేస్తున్నప్పుడు పిటిషనర్లకు మాత్రం కొత్త స్కీమ్ వర్తింపజేయడం చట్టవిరుద్ధం. సమాన పనికి సమాన వేతనం అనేదానిని పరిగణనలోకి తీసుకోవాలి'అని ఆదేశించారు.

ఓ ధరణి.. ఎన్నో సమస్యలు

▶ మొదటి పేజీ తరువాయి

పొరపాటుగా నమోదైంది. ఈ పొరపాటును సవరించే/తొలగించే ఆప్షన్ ధరణి పోర్టల్‌లో అందుబాటులో లేదు.

- గతంలో కొందరు వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా (నాలా) మార్పు చేసుకున్నారు. ఈ భూములకు నాలా ప్రొసీడింగ్స్ కూడా జారీ అయ్యాయి. కానీ కొన్నిచోట్ల అవి వ్యవసాయ భూములుగానే ఉన్నాయి. దీంతో సదరు రైతులు/సంస్థలు/పరిశ్రమలు తమ భూముల మార్పిడి కోసం ధరణిలోని 33 మాడ్యూల్ కింద మిస్సింగ్ సర్వే నంబర్ల కేటగిరీలో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ దరఖాస్తులను కలెక్టర్ లాగిన్‌లో పరిష్కరించిన తర్వాత కూడా అవి వ్యవసాయ భూములుగానే కనబడుతున్నాయి.
- కొన్ని భూములకు ఇచ్చిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (ఏజీపీఏ)లు ధరణిలో ప్రాసెస్ కావడం లేదు. వీటిని ప్రాసెస్ చేసేందుకు పట్టాదారు బయోమెట్రిక్ వివరాలను ధరణి పోర్టల్ అడుగుతోంది.
- ధరణి పోర్టల్ ద్వారా భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకునేందుకు అసలు పట్టాదారుకు కాకుండా థర్డ్ పార్టీలు కూడా దరఖాస్తు చేస్తున్నారు. ఇలా ఒక సర్వే నంబర్‌లో థర్డ్ పార్టీలు (పట్టాదారుకు తెలియకుండా) దరఖాస్తు చేసుకుని ఉంటే.. అసలు పట్టాదారు లేదా ఆ సర్వే నంబర్‌లోని మరో పట్టాదారు దరఖాస్తు చేసుకునేందుకు ధరణి అనుమతించడం లేదు. ఇప్పటికే దరఖాస్తు పెండింగ్‌లో ఉందని చెబుతోంది. ఈ విషయంలో థర్డ్ పార్టీలను నియంత్రించే పద్ధతి తీసుకురావాలి.
- ధరణి పోర్టల్‌లో తాజా పహాణీలు అందుబాటులో లేవు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, తహశీల్దార్ల లాగిన్‌లలో కొత్త పహాణీలు అందుబాటులో ఉంచాలి.
- కొందరు రైతులు తమ భూములను తనఖా పెట్టి బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చుకుంటున్నారు. అలాంటి మార్టిగేజ్ భూములకు డూప్లికేట్ పాసు పుస్తకాలు తీసుకుని సేల్ డీడ్‌లు చేసుకునే వెసులుబాటును తొలగించాలి.
- ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో రైతులకు సంబంధించిన వివరాలను పొరపాటుగా నమోదు చేస్తే, దరఖాస్తు పూర్తయిన తర్వాత మళ్లీ ఆ వివరాలను సవరించుకునే అవకాశం లేదు.
- వారసత్వ హక్కులు (పౌతీ) కల్పించే క్రమంలో ఈ–పాసు పుస్తకాలు వస్తున్నాయి కానీ, అందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ఇవ్వడం లేదు. బ్యాంకర్లు రుణాలిచ్చేందుకు పౌతీ ప్రొసీడింగ్స్ అడుగుతున్నారు.
- ధరణి పోర్టల్‌లో ఆధునీకరించిన లేదా సవరించిన వివరాలు అందుబాటులో లేవు. సదరు రైతుకు సంబంధించిన అప్‌డేటెడ్ సమాచారం (సర్వే నంబర్, ఖాతా, విస్తీర్ణం లాంటి వివరాలు) అందుబాటులో ఉంచాలి.
- గతంలో ఆర్డీవోలు జారీ చేసిన నాలా ప్రొసీడింగ్స్‌ను అప్‌డేట్ చేసే ఆప్షన్ ఇవ్వాలి. గతంలో జారీ చేసిన 13–బి, 38ఈ సర్టిఫికెట్ల అప్‌డేషన్‌కు కూడా ఆప్షన్ తీసుకురావాలి.
- క్రయ విక్రయ లావాదేవీల కోసం బుక్ చేసిన స్లాట్‌లను అనివార్య పరిస్థితుల్లో రద్దు చేసుకునే ఆప్షన్ ఇవ్వాలి.

సెర్బియాలో తెలంగాణ యువకుల వెతలు

కన్సల్టెన్సీ మాటలు నమ్మి మోసపోయిన వైనం

- అక్రమంగా గాడిదలపై సరిహద్దులను దాటించే యత్నం..!
- అష్టకష్టాలు పడి స్వదేశానికి తిరిగి వచ్చిన యువకులు
- సీసీఎస్‌లో కన్సల్టెన్సీ నిర్వాహకులపై ఫిర్యాదు– కేసు నమోదు



సాక్షి, హైదరాబాద్: 'మిమ్మల్ని పోలాండ్ దేశానికి తీసికెళ్తాం.. అక్కడ టెంపరరీ రెసిడెంట్స్ కార్డు ఇప్పించి మంచి జీతాలు వచ్చేలా చేస్తాం'అంటూ నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన యువకులను అక్రమంగా విదేశాలకు పంపించి, వారిని నరకయాతనకు గురిచేసిన ఓ కన్సల్టెన్సీ భాగోతం వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం సంకెట్ గ్రామానికి చెందిన ఎత్తిన సాయితేజ ఇంటర్ పూర్తి చేసి, 2018లో బెహరా వెళ్లి తిరిగి 2020లో వచ్చాడు. ఈ క్రమంలోనే నిజామాబాద్ ప్రాంతంలో హైదరాబాద్‌కు చెందిన అబ్రాడ్ ప్లేస్‌మెంట్ కన్సల్టెన్సీకి చెందిన కొంతమంది తాము పోలాండ్ దేశానికి తీసికెళ్తామంటూ ప్రచారం చేశారు. రూ. 3.5 లక్షలు చెల్లిస్తే వీసా ప్రాసెసింగ్ చేసి, తాత్కాలిక రెసిడెంట్ కార్డు ఇప్పిస్తామని నమ్మించారు. ఈ క్రమంలో తేజాతోపాటు నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన 10 మంది రెండేళ్ల క్రితం కన్సల్టెన్సీవారిని ఆశ్రయించగా వీరికి ఆర్మూర్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి, డబ్బులు వసూలు చేశారు.

వీసాలు ఇప్పించకపోవడంతో...

సమయం సమీపిస్తున్నా వీసాలు ఇప్పించకపోవడంతో అభ్యర్థులు మధ్యవర్తిగా వ్యవహరించిన సొక్కం భూమేష్, కన్సల్టెన్సీ డైరెక్టర్లు మనీష్ అవస్తి, శ్రావణ్ అలియాస్ అజార్, మీర్ అలీ అహ్మద్ మహమూద్‌లపై ఒత్తిడి తెచ్చారు. అయితే సెర్బియా పంపిస్తామని, అక్కడ కూడా మంచి జీతాలుంటాయని, అక్కడి నుంచి తిరిగి మాల్టా, పోలాండ్ దేశాలకు పంపిస్తామని నమ్మించారు. వీరికి నెల పాటు అరైవల్ వీసా ఇప్పించి పంపించారు. అందులో కొందరిని అక్రమంగా యూరప్ దేశాల సరిహద్దులను గాడిదలపై ఎక్కించి దాటించేందుకు ప్రయత్నించారు. సెర్బియా వెళ్లగానే అక్కడ హోటల్‌లో వారికి బస కల్పించి, ఉద్యోగం ఇప్పిస్తామంటూ 20 రోజుల వరకు కాలయాపన చేశారు. అయితే అప్పటికే ఆ దేశంలోకి అక్రమంగా వచ్చిన పాకిస్తాన్ వాళ్లు ఇక్కడి నుంచి వెళ్లినవారిని బెదిరించి పాస్‌పోర్టులు, వీసాలు లాక్కొనే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడున్న అధికారులను సంప్రదించగా 'మీరు వచ్చిన ప్రాసెస్ అంతా తప్పు, మీ దగ్గర ఉన్నవన్నీ నకిలీ సర్టిఫికెట్లు, వీసా గడువు కూడా పూర్తయింది'అని చెప్పారు. 29 రోజుల్లో స్వదేశానికి వెళ్లిపోవాలంటూ అల్టిమేటం జారీచేశారు. దీనిపై కన్సల్టెన్సీ నిర్వాహకులను ప్రశ్నిస్తే ఎవరు కూడా స్పందించలేదు. దీంతో కుటుంబసభ్యులకు ఫోన్లు చేసి తిరిగి వచ్చేందుకు ఖర్చులకు డబ్బులు డిపాజిట్ చేయించుకొని తిరిగి ఇండియాకు వచ్చారు. వచ్చిన వెంటనే కన్సల్టెన్సీ నిర్వాహకుల మోసంపై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఐఓబీ ద్వారా | 12 మున్సిపాలిటీలకు రూ.1,150 కోట్లు

సాక్షి, హైదరాబాద్: జీహెచ్ఎంసీని ఆనుకొని ఉన్న 12 మున్సిపాలిటీల్లో లింక్ రోడ్ల అభివృద్ధికి గాను ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) రూ.1,150 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు మంజూరు పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌కు బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ రంజయ మిశ్రా అందజేశారు. ఈ నిధులతో 12 మున్సిపాలిటీల్లోని ప్రతిపాదిత మిస్సింగ్ లింక్ రోడ్ల ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ విషయాన్ని స్పెషల్ సీఎస్ అర్వింద్‌కుమార్ ట్విట్టర్ ద్వారా తెలిపారు.



ఇతరులకు మంచి చేయడం అనేది ఒక విధి కాదు. అదొక సౌఖ్యం. ఎందుకంటే అది మీ ఆరోగ్యాన్నీ, సంతోషాన్నీ పెంచుతుంది.
- జరాతుష్ట్ర

సాక్షి

గురువారం, ఫిబ్రవరి, 16

'బుల్‌డోజర్ న్యాయం' ఎన్నాళ్లు?

బుల్‌డోజర్‌లే సర్వరోగ, సర్వ సమస్యల నివారిణిగా భావించటం ఎంత ప్రమాదకరమో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి కనీసం ఇప్పటికైనా అర్థమైవుండాలి. ఆ రాష్ట్రంలోని కాన్పూర్ జిల్లా మడౌలీలో 'ఆక్రమణలు' తొలగించే పేరిట సోమవారం బుల్‌డోజర్‌లు వీరంగం వేస్తుండగా హఠాత్తుగా ఒక గుడిసెలో మంటలు ఎగసి తల్లీకూతుళ్లిద్దరు సజీవదహనమయ్యారు. బాధితుల బంధువులు చెబుతున్నట్టు ఇవి దారుణ హత్యలా, అధికారులంటున్నట్టు ఆత్మహత్యలా అనేది తేలడానికి కొంత సమయం పడుతుంది. కానీ ప్రభుత్వ చర్య ఏదైనా చట్టాలకు అనుగుణంగానే ఉండాలని సాక్షాత్తూ సర్వోన్నత న్యాయస్థానం చెప్పి చాన్నాళ్లవుతున్నా ఆ రాష్ట్రంలో బుల్‌డోజర్‌ల వినియోగం ఆగలేదని తాజా ఉదంతం నిరూపిస్తోంది. బీజేపీ అధికార ప్రతినిధి నూపుర్ శర్మ మహమ్మద్ ప్రవక్తను కించపరిచారని ఆరోపిస్తూ నిరుడు జూన్‌లో జరిగిన నిరసన ప్రదర్శనల సందర్భంగా ప్రయాగ్‌రాజ్, షహ్రాన్‌పూర్ తదితర ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాక ఆ నిరసనలకు సూత్రధారులుగా భావిస్తున్నవారి ఇళ్లను బుల్‌డోజర్‌లు పంపి నేలమట్టం చేశారు. నిజానికి ఇది యూపీకే పరిమితమై లేదు. బీజేపీ సర్కారుండే మధ్యప్రదేశ్‌లో నిరుడు ఏప్రిల్‌లో మతపరమైన ఘర్షణలు జరిగాక 16 ఇళ్లనూ, 29 దుకాణాలనూ అధికారులు కూల్చేశారు. అదే నెలలో బీజేపీ అధీనంలోని అప్పటి ఉత్తర ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మత ఘర్షణలు జరిగిన జహంగీర్‌పురిలో ఇదే పద్ధతిలో ఇళ్లు, దుకాణాలు నేలమట్టం చేశారు.

నిజానికి చట్టబద్ధ పాలన అనే భావన రాజ్యాంగంలో లిఖితపూర్వకంగా ఎక్కడా ఉండదు. కానీ అది సవరణకు వీలుకాని రాజ్యాంగ మౌలిక నిర్మాణ స్వరూపమని నిపుణులంటారు. ప్రజాస్వామ్యంలో సాధారణ పౌరులు మొదలుకొని అత్యున్నత స్థానాల్లో ఉండేవారి వరకూ అందరూ చట్టానికి లోబడి వ్యవహరించాల్సినవారే. కానీ ఈ 'బుల్‌డోజర్ న్యాయం' అన్ని చట్టాలనూ, నిబంధనలనూ బేఖాతరు చేస్తోంది. సాధారణంగా అయితే అక్రమమని తేలిన నిర్మాణాలను గుర్తించాక వాటి యజమానులకు అధికారులు ముందుగా నోటీసులివ్వాలి. వారినుంచి సంజాయిషీలు తీసుకున్నాక అవసరమైన వ్యవధినిచ్చి నిర్మాణాలు తొలగించాలి. కానీ ఈ ఉదంతాలన్నిటా జరుగుతున్నది వేరు. ఏదైనా ఘర్షణల్లో నిందితులుగా గుర్తించినవారి ఇళ్లనూ, దుకాణాలనూ ఒక పద్ధతి ప్రకారం కూల్చేస్తున్నారు. నామమాత్రంగా నోటీసులిచ్చి కనీసం వారి సామాన్లు తీసుకునే వ్యవధి కూడా ఇవ్వకుండా బుల్‌డోజర్‌లతో నేలమట్టం చేస్తున్నారు. మడౌలీ ఉదంతమే తీసుకుంటే గత నెల 14న కిషన్ గోపాల్ దీక్షిత్ అనే ఆసామి ఇంటితోపాటు మరికొన్ని ఇళ్లను చెప్పాపెట్టకుండా వచ్చిన అధికారులు కూల్చేశారు. వేరే ఆశ్రయం పొందటం అసాధ్యం కావటంతో కూల్చినచోటే దీక్షిత్ కుటుంబం చిన్న గుడిసె వేసుకుని ఉంటోంది. సరిగ్గా నెల తర్వాత మళ్లీ వచ్చిన అధికారులు ఆ గుడిసెవైపు బుల్‌డోజర్‌ను గురిపెట్టారు. తామంతా గుడిసెలో ఉండగానే భయభ్రాంతుల్ని చేసి పంపేయటానికి బుల్‌డోజర్‌ను ప్రయోగించారని, దానికి లొంగకపోవటంతో గుడిసెకు నిప్పంటించమని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఆదేశించారని బాధితుడు శివం దీక్షిత్ అంటున్నాడు. తానూ, తండ్రి స్వల్పగాయాలతో తప్పించుకున్నా తల్లి, 21 ఏళ్ల సోదరి సజీవదహనమయ్యారని చెబుతున్నాడు. బుల్‌డోజర్‌ల ప్రయోగం మొదలెట్టినప్పుడు రాష్ట్రంలోని బీజేపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు పెల్లుబికాయి. ఎక్కువ సందర్భాల్లో ఒక మతంవారినే దృష్టిలో పెట్టుకుని ఈ కూల్చివేతలు జరగటం అందుకు కారణం కావొచ్చు. కానీ ఇలాంటి ధోరణి చివరకు అరాచకానికి దారితీస్తుందని చాలామంది హెచ్చరించారు. విచక్షణ మరిచి సమస్య ఉన్నచోటికల్లా బుల్‌డోజర్‌లు వెళ్లడం మొదలైతే ఎలాంటి పరిణామాలు జరుగుతాయో ఊహించటం కష్టం. ఆమధ్య ఒక ఉదంతంలో రాళ్లు విసిరాడని ఆరోపణలొచ్చిన యువకుడు రెండు చేతులూ లేని వికలాంగుడు. అతని దుకాణాన్ని అధికారులు కూల్చేశారు. ఈ మాదిరి ఘటనల్లో అధికారులు తమ తప్పు సరిదిద్దుకునే అవకాశం ఉంటుందా? మడౌలీ ఉదంతంలో తల్లీకూతుళ్లు సజీవదహనమయ్యారని తెలియగానే సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్‌తో సహా అధికారులంతా పరారయ్యారు. వారు అక్కడే ఉంటే ఏం జరిగేదో! దోషులని తేలినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ చేసిన ప్రకటనకు పెద్దగా విలువుండదు. బుల్‌డోజర్‌లను ఇష్టానుసారం వినియోగించే స్వేచ్ఛ ప్రభుత్వమే ఇచ్చినప్పుడు ఇలాంటి విపరీతాలు చోటుచేసుకోవటంలో వింతేముంది? ఈ ఉదంతాల్లో చివరకు దోషులుగా తేల్చేదెవరిని? శిక్షించేదెవరిని?

నేరారోపణలు చేయటం, దాన్ని న్యాయస్థానాల్లో నిరూపించటం, తమ ముందున్న సాక్ష్యాధారాల ఆధారంగా న్యాయస్థానాలు శిక్షించటం అనే ప్రక్రియలుంటాయి. ఈ మూడు పాత్రలనూ ఒకరే పోషించాలనుకున్నప్పుడు ప్రజాస్వామ్యం మంటగలుస్తుంది. సాధారణ ప్రజానీకం సైతం ఈ ధోరణినే అనుసరించే ప్రమాదం ఉంటుంది. ఏతావాతా ఈ మాదిరి చర్యలు ఒకరకమైన అరాచకానికి దారితీస్తాయి. బుల్‌డోజర్‌ల గురించి సుప్రీంకోర్టులో పిటిషన్‌లు దాఖలైనప్పుడు అసలు కారణాలు దాచి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలుండటంవల్లే కూల్చామని యూపీ సంజాయిషీ ఇస్తోంది. ఒక ప్రభుత్వం తన చర్యల ఆంతర్యాన్ని తానే చెప్పుకోలేని దుఃస్థితిలో ఉండటం అధికార యంత్రాంగానికి నైతికబలం ఇవ్వగలదా? రెండు నిండు ప్రాణాలు బలిగొన్న మడౌలీ ఉదంతానికి మూలం ఎక్కడుందో ఇప్పటికైనా ఆదిత్యనాథ్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. మరెక్కడా ఇలాంటి ఉదంతాలు పునరావృతం కానీయకుండా, చట్టవిరుద్ధతకు తావులేకుండా చర్యలు తీసుకోవాలి.

అన్నీ ఉండీ ధరలు పెరగడమా?

విశ్లేషణ



డి.పాపారావు

దేశంలో ప్రజలందరికీ కావాల్సిన దరిదాపు అన్ని నిత్యావసరాలు మనమే పండించుకుంటున్నాం. ఇటువంటి స్థితిలో, అంటే సరఫరా తగిన స్థాయిలో ఉన్నప్పుడు నిత్యావసరాల ధరలు పెరగకూడదు. కానీ, జరుగుతున్నది అదే. మార్కెట్ తాలూకూ డిమాండ్ –సరఫరా సాఫీగా జరగడాన్ని కాపాడవలసిన ప్రభుత్వాలే స్వయంగా వ్యాపార వర్గాల అనుకూలతను చూపడం వల్ల వ్యాపారులు తమ ఇష్టానుసారం సరుకులను నిల్వ చేస్తూ, కొరతలను సృష్టిస్తూ, ధరలను పెంచే వీలు ఏర్పడుతోంది. పైగా ప్రభుత్వమే తన వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని విదేశీ మారక ద్రవ్యం కోసం అమ్ముతోంది. ఈ లాభాపేక్ష లేకుండా... నిల్వ పెట్టిన సరుకులను మార్కెట్‌లోకి తరచుగా విడుదల చేస్తే ధరల పెరుగుదల నుంచి ప్రజలను కాపాడవచ్చు.

గత సంవత్సర కాలంలో దేశంలో నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయి. గోధుమల ధర ఈ కాలంలో సుమారు 22 శాతం పెరిగింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం భారత ఆహార సంస్థ గోడౌన్ల నుంచి 2.5 మిలియన్ టన్నుల గోధుమలను బహిరంగ మార్కెట్‌లో అమ్మాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం అనంతర వారంలోనే వాటి ధర 10 శాతం మేరకు తగ్గింది. ఇది సాధారణ మార్కెట్ సూత్రం. సరఫరా పెరిగితే డిమాండ్ తగ్గడం ఈ ధర తగ్గుదల వెనుకన పనిచేస్తోంది.

గత సంవత్సర కాలంగా ఇతరత్రా నిత్యావసరాల ధరలు అన్నీ పెరిగిపోతోంటే ప్రభుత్వం చేష్టలుడిగి ఎందుకు ఉండిపోయింది? 2022 ఆగస్టు నాటికే అంతకు ముందరి సంవత్సర కాలంతో పోలిస్తే గోధుమల ధర 14 శాతం మేరన పెరిగి ఉంది. అయినా ప్రస్తుతం చేస్తున్నట్లుగా బహిరంగ మార్కెట్‌లోకి ధాన్యాన్ని విడుదల చేయలేదు. ఫలితంగా ధరల పెరుగుదల అలాగే కొనసాగింది. దీనికి కారణం, అప్పట్లో ప్రభుత్వం గోధుమలు, బియ్యం వంటి ధాన్యాలను విదేశాలకు రికార్డు స్థాయిలో ఎగుమతి చేస్తోంది. రష్యా- ఉక్రెయిన్ యుద్ధ క్రమంలో అంతర్జాతీయంగా ఏర్పడ్డ ధాన్యం కొరతలు, ముఖ్యంగా గోధుమల కొరత, విదేశీ మారక ద్రవ్య సముపార్జనకు బాగా కలిసి వచ్చింది. కానీ, ఇదే భారత ఆహార సంస్థ వద్ద గోధుమల కొరతకు దారి తీసింది. ఫలితమే అప్పుడు మార్కెట్‌లో ధర పెరిగినా గోధుమ గింజల సరఫరాను పెంచి, ధరలను తగ్గించలేని స్థితి.

నేడు నడుస్తున్నది ఎన్నికల సంవత్సరం. ప్రజలను పెరిగే ధరల పాలు చేసి, వారిలో అసంతృప్తి పెరిగి అది తన ఎన్నికల పరాజయానికి దారి తీయకూడదన్నదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం. గత సంవత్సరం జరిగిన భారీ ఎగుమతుల నేపథ్యంలో అది నిల్వల కొరతకు దారి తీసిన తర్వాత... ప్రభుత్వం గోధుమల ఎగుమతులను నిషేధించింది. ఈ నిర్ణయాన్ని మార్పు చేయించేందుకు, అమెరికా నుంచి ఒత్తిడులు కూడా వచ్చాయి. చైనా మాత్రమే దేశీయ కొరతల నేపథ్యంలో, ఎగుమతులను నిషేధించాలన్న మన నిర్ణయాన్ని సమర్థించింది. 2022 సంవత్సర కాలంలో మన దేశం బియ్యాన్ని కూడా రికార్డు స్థాయిలో ఎగుమతి చేసింది. వాస్తవానికి నాడు దేశంలో బియ్యం నిల్వలు తగినంత స్థాయిలోనే ఉన్నప్పటికీ ఈ బియ్యం ఎగుమతుల నిర్ణయం దేశీయంగా బియ్యం ధరల పెరుగుదలకు కారణమయ్యింది.

గత సంవత్సర కాలం పైబడి నిత్యావసరాల ధరలు తీవ్ర స్థాయిలో పెరిగిన స్థితి మనకు తెలిసిందే. దీనికి కొంత మేరకు విదేశాల నుంచి మనం దిగుమతి చేసుకొనే వంటనూనెలు, చమురు వంటి వాటి ధరలు అంతర్జాతీయంగానే పెరగడం కారణం కావచ్చును. అయితే, ఇది పాక్షిక సత్యం మాత్రమే. దేశీయంగా వివిధ సరుకుల ధరలను ప్రధానంగా నిర్ణయించే మార్కెట్ శక్తులయిన



'డిమాండ్ - సరఫరా'ల యాజమాన్యంలో జరుగుతోన్న లోపాలు ధరల పెరుగుదలకు ముఖ్య కారణం. దీనికి, యూపీఏ హయాం నుంచి కూడా అనేక ఉదాహరణలు ఉన్నాయి. నాడు యూపీఏ పాలనా కాలంలో దేశంలో ధరలు పెరుగుతోన్న తరుణంలోనే... భారత ఆహార సంస్థ గోడౌన్లలోని ధాన్యాన్ని ఎలుకలు తినేయడం, లేదా అవి ముక్కిపోవడం జరుగుతున్నాయి. సుప్రీంకోర్టు ఈ విషయానికి సంబంధించి నాటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే, ఆ ప్రభుత్వం 'ఉచిత భోజనం లేదు' అంటూ గోడౌన్ల లోని ధాన్యాన్ని మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు తిరస్కరించింది. మరో పక్కన అదే ధాన్యాన్ని విదేశాలకు... అక్కడ జంతువుల దాణాగా వాడకానికి ఎగుమతి చేసింది. దేశీయ ప్రజలను పెరుగుతోన్న ధరల నుంచి ఆదుకునేందుకు ప్రయత్నం చేయడం లేదా వారి క్షుద్బాధకు పరిష్కారం చూపడం ప్రభుత్వానికి లక్ష్యాలుగా లేవు. దాని ప్రధాన లక్ష్యం విదేశీ మారక ద్రవ్య సముపార్జన మాత్రమే!

యూపీఏ అయినా, ఎన్డీయే అయినా అమలు జరుగుతోన్న విధానాలు ఒకటే. కాకుంటే యూపీఏలో సంస్కరణల పేరిట ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించడంలో కొంత వెనుకా ముందు, లేదా మొహమాటాలు ఉన్నాయి. అలాగే, యూపీఏ ప్రభుత్వం కాస్తలో కాస్త నయంగా కొన్ని ప్రజానుకూల సంక్షేమ పథకాలను తెచ్చింది. దానిలో భాగమే జాతీయ ఉపాధి హామీ పథకం, ఆహార భద్రతా చట్టాల వంటివి. ప్రస్తుతం ఎటువంటి మొహమాటం లేకుండా... కార్పొరేట్, ధనవంతులు, వ్యాపార వర్గాల అనుకూల విధానాలను బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోంది.

దీనంతటి ఫలితమే నేడు దేశంలో మొత్తంగా నిత్యావసరాల ధరల పెరుగుదల! ప్రభుత్వం ధరల నియంత్రణకు చిత్తశుద్ధితో పూనుకొని తగిన విధానాలను అనుసరిస్తే ఇంత స్థాయిలో పెరిగి ఉండేవే కాదు. ప్రస్తుతం జరిగిన విధంగా మార్కెట్‌లోకి గోధుమల నిల్వలను విడుదల చేసి ప్రైవేట్ వ్యాపారులు తమ ఇష్టానుసారం ధర పెంచగల అవకాశాన్ని కట్టడి చేయగలగడం ఒక ఉదాహరణ. మరింత ప్రాధాన్యత గల మరో ఉదాహరణ కేరళ వంటి రాష్ట్రాలది. దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదలైన సందర్భాలలో కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలలో ఇది అతి తక్కువ స్థాయిలో ఉంటూ రావడం గమనార్హం. దీనికి కారణం ఆ రాష్ట్రాలలో ప్రజా పంపిణీ వ్యవస్థలు అమలు జరుగుతోన్న తీరు. ఈ రాష్ట్రాలలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా, దరిదాపు కుటుంబాలకు అవసరమైన అన్ని నిత్యావసరాలు పంపిణీ అవుతున్నాయి. ఫలితంగా బహిరంగ మార్కెట్‌లోని వ్యాపారులకు, ప్రజా పంపిణీ వ్యవస్థతో పోటీ ఏర్పడి, వ్యాపారులు తమ ఇష్టానుసారం సరుకులను నిల్వ చేస్తూ, వాటి కొరతలను సృష్టిస్తూ, తద్వారా ధరలను పెంచుకుంటూ పోయే పరిస్థితి లేకుండా పోయింది.

అత్యంత సాధారణంగా కనపడే ఈ ఇంగితాన్ని ఆచరణలో అమలులో పెట్టి అటు రైతాంగానికీ, ఇటు వినియోగదారుడికీ ప్రయోజనాన్ని చేకూర్చే విధానాల అమలు సాధ్యమేనని ఈ ఉదాహరణలు రుజువు చేస్తున్నాయి. లాభాపేక్ష లేకుండా ప్రభుత్వమే నిల్వ పెట్టిన సరుకులను మార్కెట్‌లోకి తరచుగా విడుదల చేస్తూ పోతే ధరల పెరుగుదల బెడద నుంచి ప్రజలను శాశ్వతంగా కాపాడడం సాధ్యమే. ఎన్నికల సంవత్సరంలో మాత్రమే ధరల తగ్గింపును సవాలుగా తీసుకుంటూ, మిగతా నాలుగు సంవత్సరాల కాలంలో ప్రజానీకాన్ని... వ్యాపారస్తులకూ, దొంగ నిల్వలకూ, కొరతలకూ బలిచేస్తూ పోవడం అత్యంత అసహజమైనది. అది కనీసం డిమాండ్ సరఫరాల తాలూకూ మార్కెట్ సూత్రం పరిధిలో కూడా ఇమడదు. నిజానికి మన దేశంలో ప్రజలందరికీ కావాల్సిన దరిదాపు అన్ని నిత్యావసరాలు (పాలకుల నిర్లక్ష్యంతో ఉత్పత్తి పెరుగుదల లేని వంటనూనె గింజల వంటి కొద్దిపాటివి మినహా) మనమే పండించుకుంటున్నాం. ఇటువంటి స్థితిలో, అంటే సరఫరా తగిన స్థాయిలో ఉన్న స్థితిలో కూడా నిత్యావసరాల ధరలు పెరగకూడదు. కానీ, వాస్తవంలో జరుగుతున్నది అదే.

మార్కెట్ తాలూకూ డిమాండ్- సరఫరాను సాఫీగా జరగడాన్ని కాపాడవలసిన ప్రభుత్వాలే స్వయంగా వ్యాపార వర్గాల అనుకూలతను చూపడం... పైగా, స్వయంగా తానే ఒక వ్యాపారిగా తయారై భారత ఆహార సంస్థ వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని విదేశీ మారక ద్రవ్యం కోసం అమ్ముతూ పోవడం... ఫలితంగా అధిక ధరల పరిస్థితి ఏర్పడింది. ఆహార పదార్థాల నిల్వలపై పరిమితులు విధించే చట్టాలను కూడా ప్రభుత్వం రద్దు చేస్తూ పోవడం వంటి చర్యలు కూడా ధరల పెరుగుదలకు కారణం అవుతున్నాయి.

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు
మొబైల్: 98661 79615

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తగని మాటలు



ఐపీఎల్ జట్ల ఎంపికల ద్వారా మన మహిళా క్రికెటర్లు డబ్బులు సంపాదించడం అద్భుతమైన వార్త. కానీ మహిళా క్రికెటర్లకు వేలం, అమ్మకం లాంటి మాటలు వాడకుండా బీసీసీఐ జాగ్రత్త తీసుకోవాలి. ఎంపిక, నియామకం లాంటి మాటలు మరింత హుందాగా ఉంటాయి.

– యశోవర్ధన్ ఝా ఆజాద్, మాజీ ఐపీఎస్ అధికారి

ఎందుకిలా?



కోవిడ్-19 టీకాలు వేసుకోనందున, వైద్యపరంగా ఆమెకు ఈ విషయంగా మినహాయింపు ఉన్నప్పటికీ ఒక ఆస్ట్రేలియన్ తల్లికి గుండె మార్పిడి చికిత్సను నిరాకరించారని వార్త. ఇది సున్నా శాతం సైన్సు, నూరు శాతం పిచ్చి.

– ఎలీ డేవిడ్, పరిశోధకుడు

అంతా తెలుసు



చైనీస్ బెలూన్‌ను అనుసరిస్తూ– తామేం కూల్చామో తమకు తెలియదని (అమెరికా) మిలిటరీ చెబుతోంది. దానికి కొనసాగింపుగా అదింకా ఎప్పటికీ తెలియదని కూడా వాళ్లు అన్నారు. దీన్ని నేను నమ్ముతానో లేదో నాకు తెలీదు.

– స్టీఫెన్ కింగ్, రచయిత

మనవాళ్లే!



మన ఈశాన్య భారతీయులను అగౌరవంగా చూడటం నిజంగా బాధిస్తుంది. ఈశాన్య భారతమంటే ప్రేమకు, బహుశా అత్యంత అణకువకు చిహ్నం. వాళ్ల పని వాళ్లు చూసుకునే శ్రమజీవులు వాళ్లు.

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

అన్నీ అవే!



చాట్‌జీపీటీని ఇలా అడిగాను: 2014 తర్వాత ఎన్ని యూపీఏ పథకాల పేర్లను బీజేపీ మార్చింది? అని. అది క్రాష్ అవడానికి ముందు 50 పథకాల పేర్లు చెప్పింది.

– సందీప్ వంగల, కాంగ్రెస్‌వాది

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

సొంత దేశం వద్దు... విదేశం ముద్దు

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

ప్రపంచ దేశాల్లో చాలా మంది ఇతర దేశాల్లో నివసించాలని కోరుకుంటున్నారు. తాము సర్వే జరిపిన 57 దేశాలలో 36 శాతం ప్రజలు పరాయి దేశంలో నివసించాలని కోరుకుంటున్నారని 'ఇంటర్నేషనల్ గాలప్' సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు కాంచో స్తోయ్చెవ్ తెలిపారు. స్వదేశంలో ఉపాధి అవకాశాలు లేకపోవడం, మతపర అల్లర్లు, యుద్ధాలు, రాజకీయ పరిస్థితులు సరిగా లేకపోవడం వలసలకు ప్రధాన కారణాలు. ఉన్నత చదువుల కోసం యువకులు, బతుకుదెరువు కోసం పేదలు వలసపోతారు. పేద దేశాల నుండి వలసలు ఎక్కువ.

అవసరాల కంటే ప్రపంచీకరణ ప్రతికూల ప్రభావాలు, పొరుగు వారితో పోలిక, సంప్రదాయ వాద మెరుగయిన జీవన స్థాయి కోరిక, సంచార స్వభావం వలస పోవడానికి ప్రధాన ప్రాతిపదికలు.



పలు దేశాల పట్టణ పేద ప్రజలు, ప్రత్యేకించి అభివృద్ధి చెందినట్లు ప్రచారం చేసుకున్న దేశాల ప్రజలు, పౌర వసతులు కల్పించే దేశాలకు వలసపోతున్నారు. యుద్ధాలు, ప్రపంచ ఆర్థిక సమస్యల సమయాలలో జీవన అనిశ్చితి పెరుగుతుంది. దీంతో వలసలు అవసరం, ఆకర్షవంతం అవుతాయి. అయితే చట్టపర అనుమతులు పొందటంలో అడ్డంకులు ఉన్నపుడు ప్రజలు అక్రమంగా దేశాల సరిహద్దులు దాటుతారు. ఈ కారణంతోనే డొమినికన్ రిపబ్లిక్ నుండి ప్యూర్టోరికో ద్వారా ఆమెరికా లోకి అక్రమ చొరబాట్లు ఎక్కువగా జరుగుతాయి.

ఐరోపాయేతర దేశాల కంటే యూరోపియన్ యూనియన్ దేశాల నుండి వలసలు ఎక్కువగా ఉండటం ఆశ్చర్యం. ఒక ఐరోపా దేశం నుండి మరొక ఐరోపా దేశానికి వలసలు ఎక్కువ. ఐరోపా దేశాల్లో అంతర్గత వలసలకు చట్టపర అడ్డంకులు లేకపోవడం, ఐరోపా పౌరుల స్వేచ్ఛలు, హక్కులు ఇందుకు కారణం. ఐతే తులనాత్మకంగా రష్యన్ ప్రజలు ఇతర దేశాలకు వలసపోడానికి ఇష్టపడరు. ఆర్మేనియా, బోస్నియా అండ్ హెర్జిగోవినా, జార్జియా, కజఖ్‌స్తాన్, కొసావో, మాల్దోవా, ఉత్తర మాసిడోనియా, రష్యా సమాఖ్య, సెర్బియా వంటి ఐరోపాయేతర దేశాల్లో స్థానమార్పు షరతులు, భౌగోళిక రాజకీయ నిర్ణాయక దిశ, దృక్కోణం వేరుగా ఉంటాయి. రష్యా–ఉక్రైన్ యుద్ధం కారణంగా ఉక్రెయిన్ జనాభాలో మూడవ వంతు దేశం విడిచి వెళ్లారు. మాల్దోవా జనాభాలో 23 శాతం, బోస్నియా అండ్ హెర్జిగోవినా నుండి 48 శాతం, ఉత్తర మాసిడోనియా నుండి 42 శాతం వలసలు వెళ్లారు. చారిత్రకంగా కష్టకాలాలలో రష్యన్‌లు అంతర్గత ఐక్యత, సమగ్రతలను ప్రదర్శించారు. అందువలన రష్యా నుండి వలసలు 15 శాతమే.

ఇతర దేశాలతో పోల్చితే సాంస్కృతిక, మతపర అంశాలు, సంప్రదాయాల కారణంగా ఇండియా నుండి వలసలు తక్కువ. సాపేక్షికంగా ఇండియా, చైనా, పర్షియా, బాబిలోన్, బైజాంటియంల కంటే పశ్చిమ దేశాల్లో ఆధిపత్య భావం ఎక్కువన్నది చారిత్రక సత్యం. జాతి, మత, కుల, వర్ణ, దేశ, ప్రాంత, భాషలకు అతీతంగా వివాహాలు జరగడం... వలసల వలన అతి పెద్ద ప్రయోజనం. అయితే ఇవి ఉపాధి, సంపాదన ప్రాతిపదికన కుదురుతాయి. సామాజిక ప్రగతిశీలతతో కాదు.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, । 94902 04545

మరోసారి చంద్రయాత్రలు

అభిప్రాయం



కె.బి. గోపాలం

గడచిన సంవత్సరం నవంబర్ 16 ఉదయం యూఎస్‌లోని నాసా వారు ఆర్టెమిస్–1 రాకెట్‌ను ప్రయోగించారు. అది 26 నాళ్ల పాటు తన యాత్ర సాగించింది. మనుషు లెవరూ లేని ఓరియాన్ అంతరిక్ష నౌక దాని మీద ఎగిరి, చంద్ర గోళం చుట్టూ రెండు ప్రదక్షిణాలు చేసి వచ్చింది. అందుకు అవసరమైన మూన్ రాకెట్‌ను కట్టడానికి 18 సంవత్సరాలు పట్టింది. 2012 మొదలు గడచిన సంవత్సరం వరకు దాని పేరున సుమారు 23 బిలియన్ డాలర్లు ఖర్చయినాయి. రాకెట్‌ను పంపిన ప్రతిసారీ మరో నాలుగు బిలియన్‌ల పైనే ఖర్చు ఉంటుంది.

'ఇంత ఖర్చు చేసి వదిలే ఈ రాకెట్ ఒక్కసారి మాత్రమే పని చేస్తుంది. ఇటువంటి రకాలను నమ్ముకుని ముందుకు సాగడం అంటే మామూలు విషయం కాదు. చంద్రుని మీదకు, అంగారక గ్రహానికి మనుషులను పంపే కార్యక్రమాలు మాముందున్నాయి మరి. అవి ఆగిపోకపోవచ్చు గానీ, అనుకున్నంత అనాయాసంగా జరగవు' అన్నారు నాసా ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయం వారు. పాల్ మార్టిన్ ఐజీ ఈ సంగతిని ఏకంగా కాంగ్రెస్‌లో ప్రకటించారు.



అంతకు ముందు అపోలో అంతరిక్ష నౌకల ప్రయోగం కొరకు శాటర్న్–5 అనే రాకెట్‌లను వాడేవారు. వాటి వాడకం1967లో మొదలయింది. అదీ నవంబర్ నెలలోనే మొదలయింది. ఆ రాకెట్ కన్నా బలం గలది మరొకటి లేదని ఇప్పటి వరకు రికార్డ్ నిలిచి ఉంది. రాకెట్‌కు 34 లక్షల కిలోల తోపుడు శక్తి ఉండేది. అంతరిక్ష నౌకలను పంపాలంటే అంత తోపుడు అవసరం మరి. రాకెట్‌ను ప్రయోగించిన సందర్భంలో చాలా దూరంలో ఉన్న ప్రెస్ బూత్‌లో కిటికీలు దడదడ కొట్టుకున్నాయట. వాంబ్ కంట్రోల్ సెంటర్‌లో పై కప్పు నుంచి పెళ్లలు ఊడిపడినాయట. అయిదేళ్లపాటు తొమ్మిది శాటర్న్- 5లను ప్రయోగించి మనుషులను కూడా చంద్రగ్రహానికి పంపించారు. చరిత్ర సృష్టించారు.

ఇప్పుడిక అంతకన్నా పెద్ద స్పేస్ లాంచింగ్ సిస్టమ్ (ఎస్‌ఎల్‌ఎస్) వచ్చేసింది. ప్రయత్న పూర్వకంగా దాన్ని శాటర్న్–5 కన్నా బలం గలదిగా నిర్మించారు. మునుపటి వాటికన్నా పెద్ద క్రూ (బృందం) ఉండేది. కాప్స్యూల్స్ మరింత పెద్ద పేలోడ్‌లు చంద్రగోళం మీదకు పంపే యత్నాలు సాగుతున్నాయి. వెళ్లిన అంతరిక్ష యాత్రికులు కొంతకాలం అక్కడే ఉండి పోతారు. అంతకు ముందు పరిశీలన పేరున వెళ్లే వ్యోమగాములు రెండు మూడునాళ్ల తరువాత తిరిగి వస్తారు. భూమి నుంచి బయలు దేరితే చందమామ మీదకు చేరడానికి మూడు నాళ్ల ప్రయాణం. అక్కడే కొంతకాలం ఉండి, ప్రయోగాలు, పరిశీలనలు చేసి తిరిగి వచ్చారంటే, భూమిని విడిచి బతకడం కుదురుతుందని తేలిపోతుంది. అదంతా సవ్యంగా జరిగితే, అంగారక గ్రహ యాత్ర గురించి ప్రయత్నాలు జరుగుతాయి. అక్కడికి చేరడానికి ప్రయాణమే 8 మాసాలు. తిరిగి రాను మరో ఎనిమిది నెలలు.

'ఇది ఒక కొత్త తరం ప్రయత్నం' అంటారు ఎస్‌ఎల్‌ఎస్ ప్రోగ్రామ్ మేనేజర్ జాన్ హనీకట్. అందరికీ ఖర్చుల గురించి ఆలోచన కూడా మరొక పక్కన ఉండనే ఉంది. యాత్రలలో నాసా ఒకటే కాక ప్రైవేట్ కంపెనీలు కూడా పాల్గొని, ఖర్చులు తగ్గించే ప్రయత్నంలో ఉన్నాయంటే ఆశ్చర్యం కలగవచ్చు. అక్కడ దిగిన నౌకలను తిరిగి భూమికి క్షేమంగా చేర్చడం గురించి ఇటువంటి సంస్థలు ప్రయత్నాలు చేస్తున్నాయి. రాకెట్‌లోని బూస్టర్‌ను తిరిగి వాడటం గురించి కూడా ప్రయత్నాలు, ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. శాటర్న్–5లో వాటిని ఒకసారి వాడి పడేసేవారు. ఎస్‌ఎల్‌ఎస్‌లో కూడా నాసా వాటిని తిరిగి తెచ్చే ఆలోచన చేయలేదు మరి. ముందే ఖర్చు గురించి అందరూ తలలు పట్టుకుని ఉన్నారంటే, ఇటువంటి ఆలో చనలు రాకపోవడం ఫలితమే. ఆ పనులను మరెవరో తలకెత్తుకుంటారు అంటే అద్భుతం. ఖర్చు ఎంతైనా రానున్న పదేళ్ళ వరకు ఎస్‌ఎల్‌ఎస్ వాడకం కొనసాగుతుందని నాసా ప్రకటించింది.

2030 నుంచి నాసాకు కొంత వెసులుబాటు అందుతుంది. అప్పుడిక స్పేస్ స్టేషన్ పని మాను కుంటుంది. అంటే ఏటా 4 బిలియన్ డాలర్ల ఖర్చు ఉండదు. ఆ మొత్తాన్ని కొత్త కార్యక్రమంలో వాడ వచ్చు. కనుక అప్పటినుంచి చంద్రయాత్రలు, అంగారక యాత్రలు కనీసం ఆర్థికపరంగా సులభంగా జరుగుతాయి. మానవుడు చంద్రగోళంపై కాలు మోపి అర్ధశతాబ్ది దాటింది. ఇక ముందుద మనిషి అంతరిక్షంలో మరింత ఎక్కువ కాలం గడపగలుగు తాడు. మానవ జాతి కేవలం భూమికి పరిమితమై ఉండనవసరం లేదన్న మాటే ఆసక్తికరంగా ఉంది.

వ్యాసకర్త అనువాదకుడు, రచయిత

ప్రయత్నించాలి!

ఒక ఆశ్రమంలో విద్యాభ్యాసం చేస్తున్న శిష్యులు ఓ రోజు తమ గురువుగారితో 'స్వామీ! మేము ఇల్లు వాకిలీ విడిచిపెట్టి మీ దగ్గరకు వచ్చాం. ఈరోజు వరకూ మాకు దేవుడి అనుభూతి కలగలేదు. మా గతి ఏమిటి?' అని అడిగారు. వారి మాటలో ఓ విధమైన ఆందోళన కనిపించింది. తాము దేనికీ పనికి రామేమోనని భావం వ్యక్తమవుతోంది.

అందుకు గురువుగారు ఓ చిన్న నవ్వి 'దైవానుభూతి కోసం మీరు ఎటువంటి ప్రయత్నం చేశారు' అని అడిగారు. 'ఎలాంటి ప్రయత్నం చేయాలో తెలియలేదు. కానీ దైవానుభూతి పొందాలనే ఆరాటం మాత్రం ఇప్పటికీ ఉంది. అందుకే కదా మేము మిమ్మల్ని ఆశ్రయించాం' అన్నారు శిష్యులు. వెంటనే గురువుగారు వారిని ఓ పండ్ల తోటకు తీసుకుపోయి 'మీకు పండ్లు కావాలంటే ఏం చేస్తారు?' అని ప్రశ్నించారు. 'ఏముందండీ... పండ్లున్న చెట్టుకేసి వెళ్ళడమే' అన్నారు శిష్యులు.



జ్యోతిర్మయం

'చెట్టు కిందకు చేరి ఊరికే పండ్ల వంక చూస్తే సరిపోతుందా? మీరు చెట్టుకింద సహనంతో నిరీక్షించాలి. ఏదో సమయంలో చెట్టుపై నుంచి పండ్లు రాలి కింద పడతాయి. అలాకాక నిరీక్షించే ఓపిక లేదనుకున్నప్పుడు చెట్టును ఊపితే పండ్లు రాలుతాయి. లేదా చెట్టెక్కి కోయాలి. అలాగే దైవానుగ్రహం కోసం మనలో ఓ తపన ఉండాలి. అందుకు తగిన ప్రయత్నం చేయాలి. అప్పుడే దైవదర్శనం కలుగుతుంది అన్నారు గురువుగారు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.ఏకాదశి రా.10.55 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** మూల రా.7.19 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** సా.5.46 నుండి 7.18 వరకు, తిరిగి తె.4.20 నుండి 5.50 వరకు (తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.10.20 నుండి 11.04 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.40 వరకు, **అమృతఘడియలు:** ప.1.33 నుండి 2.44 వరకు, **రాహుకాలం :** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం :** ఉ. 6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం :** 6.31, **సూర్యాస్తమయం :** 5.57.

క్లుప్తంగా...

ఆకస్మిక గుండెపోటు వల్లే 10 శాతం మరణాలు



సాక్షి, హైదరాబాద్: ఆకస్మిక గుండెపోటు రావడంతోనే దాదాపు పది శాతం మరణాలు సంభవిస్తున్నాయని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆందోళన వ్యక్తంచేశారు. వీటిని ఎదుర్కోడానికి వెంటనే సీపీఆర్ చేయాలని, అలాంటప్పుడే ప్రాణాలను కాపాడవచ్చని ఆమె వ్యాఖ్యానించారు. మెడీజీ అనే సంస్థ హైదరాబాద్ ఐఐటీ ఇంక్యుబేషన్ సెంటర్ సహకారంతో ఆటోమేటెడ్ స్మార్ట్ సీపీఆర్ డివైజ్‌ను రూపొందించగా.. బుధవారం రాజ్‌భవన్‌లో వాటిని ప్రదర్శించారు. కార్యక్రమంలో గవర్నర్ పాల్గొని మాట్లాడారు. ఈ సంస్థ రూపొందించిన స్మార్ట్ సీపీఆర్ డివైజ్‌ను పరిశీలించిన ఆమె.. తయారీ దారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ డివైజ్ ధర రూ.2.5 లక్షల నుంచి రూ.3.5 లక్షల మధ్య ఉంటుందని తయారీ సంస్థ వెల్లడించింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సీపీఆర్ డివైజ్ అందుబాటులోకి వస్తే ఎక్కువ మంది ప్రాణాలను నిలబెట్టవచ్చన్నారు. అలాగే సీపీఆర్ పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన రావాల్సి ఉందని అన్నారు.

డిగ్రీ కాలేజీ తెచ్చుకోనోడు మంత్రంట



నీరా రుచి చూస్తున్న వైఎస్ షర్మిల

పాలకుర్తి టౌన్/పాలకుర్తి: 'పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కాలేజీ తెచ్చుకోనోడు మంత్రి అంట'అంటూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఉద్దేశించి వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. ప్రజాప్రస్థానం పాదయాత్రలో భాగంగా బుధవారం జనగామ జిల్లా పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. టీడీపీలో ఉన్నప్పుడు కేసీఆర్‌ను రాక్షసుడు అన్న మంత్రి దయాకర్‌రావు...బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత కేసీఆర్ దేవుడు అయితే మీ నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు. ఇదే నియోజవర్గంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ కూడా పాదయాత్ర చేస్తున్నారని, ఆయనది పాదయాత్ర కాదు కారుయాత్ర అని సొంత పార్టీ నేతలే విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. రేవంత్ పిలక కేసీఆర్ చేతిలో ఉందన్నారు. కాంగ్రెస్‌లో గెలిచిన వారందరూ కేసీఆర్‌కి అమ్ముడుపోయారని, అమ్ముడు పోయే పార్టీకి ఓటు వేయడం అవసరమా అని ప్రశ్నించారు.

నీరా రుచి చూసిన షర్మిల

పాదయాత్రలో భాగంగా పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణపురం వద్ద కల్లుగీత కార్మికుడు గూడ రవిగౌడ్ కోరిక మేరకు వైఎస్ షర్మిల నీరా రుచి చూశారు. తాము అధికారంలో వచ్చిన వెంటనే కల్లుగీత కార్మికులకు పెద్దపీట వేస్తానని హామీ ఇచ్చారు.

గర్భవతుల సంరక్షణే లక్ష్యంగా...



గర్భవతికి అభినందనలు తెలుపుతూ కార్డును అందజేస్తున్న మంత్రి హరీశ్ రావు

సాక్షి, సిద్దిపేట: వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రతి విషయంలోనూ తన మార్కు చూపుతూ ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. ఈ క్రమంలోనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలతో మంత్రి పేరుతో కూడిన అభినందనల కార్డులను గర్భవతులకు అందజేస్తున్నారు. ఈ కార్డు సదరు గర్భిణి ఫైల్‌లో బిడ్డ రెండేళ్ల పెరిగే వరకు ఉంటుంది. గర్భవతిగా నిర్ధారణ అయిన వెంటనే ఆశ, ఏఎన్ఎంలు వారి వివరాలను నమోదు చేస్తున్నారు. వెంటనే వారికి హరీశ్‌రావు అభినందనలు తెలుపుతున్న కార్డును అందజేస్తున్నారు. ఆ కార్డులో ప్రసవం అయ్యేంత వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ వైద్య సేవలు, కేసీఆర్ కిట్, ఇమ్యునైజేషన్ టీకాలు, టీఫా స్కానింగ్, సాధారణ ప్రసవం జరిగేందుకు తీసుకోవాల్సిన ఆహార, వ్యాయామ నియమాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పు చేయడం వల్ల ఒనగూరే ప్రయోజనాలు తదితర అంశాలను పొందుపరిచారు. అలాగే సాధారణ కాన్పుకు నిరీక్షించాలని, ముహూర్తాల పేరుతో వైద్యులను ఒత్తిడి చేయవద్దని సూచిస్తున్నారు. ప్రసవం జరిగిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు అమృతంతో సమానమంటూ, బిడ్డకు రెండేళ్ల వరకు ఇవ్వాల్సిన వ్యాక్సిన్ల ప్రాధాన్యతల గురించి తెలుపుతూ వివరాలను కార్డులో పేర్కొన్నారు. ఈ కార్డును హరీశ్‌రావు చేతుల మీదుగా బుధవారం అందుకున్న మొదటి కాన్పు గర్భిణులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

'తృణ'ధాన్యమే..!

రాష్ట్రంలో అంతంత మాత్రంగానే తృణధాన్యాల సాగు

- ఇతర రాష్ట్రాలతో పోలిస్తే దిగుబడుల్లో భారీగా వెనుకబాటు
- గత నాలుగేళ్లుగా క్రమంగా పెరుగుతున్నా... పొరుగుతో పోటీ కష్టమే
- 2017–18లో రాష్ట్రంలో సగటున 83.67 మెట్రిక్ టన్నుల దిగుబడి
- ఆ తర్వాత క్రమంగా పెరిగి 2021–22 నాటికి 108.13 మెట్రిక్ టన్నులు
- అత్యధికంగా రాజస్తాన్‌లో 4290 మెట్రిక్ టన్నుల తృణధాన్యాల దిగుబడి




సాక్షి, హైదరాబాద్: తృణ ధాన్యాలు...చిరుధాన్యాలుగా పేరొందిన వీటిలో ఎన్నో పోషకాలుంటాయి. కోవిడ్–19 తర్వాత పరిస్థితులతో వీటికి క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. సమృద్ధి పోషకాలతో పాటు రోగ నిరోధక శక్తిని పెంపొందించడం, జీర్ణవ్యవస్థను గాడిలో ఉంచడంతో పాటు మానవ శరీరానికి పలు రకాల మేలు చేయగల ఈ తృణధాన్యాల సాగు రాష్ట్రంలో మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. నాలుగైదేళ్లుగా ఈ ధాన్యాల సాగు రాష్ట్ర స్థాయిలో కాస్త పెరుగుతున్నట్లు కనిపిస్తున్నా ఇతర రాష్ట్రాల దిగుబడులతో పరిశీలిస్తే తెలంగాణ చాలా వెనుకబడి ఉందని చెప్పొచ్చు. తృణ ధాన్యాల్లో ఎక్కువగా వినియోగించేవి జొన్నలు, సజ్జలు, రాగులు. వీటితో పాటు కొర్రలు, అరికెలు, సామలు తదితరాలు తృణధాన్యాల కేటగిరీలోకే వస్తాయి. కానీ తొలి మూడింటి కంటే వీటి వినియోగం అంతంత మాత్రమే. ఆరోగ్య సూత్రాల్లో భాగంగా తృణ ధాన్యాల వినియోగంపై వైద్య రంగ నిపుణులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ సూచనలిస్తున్నప్పటికీ రాష్ట్రంలో వీటి సాగు అత్యల్పమే. ఇటీవల పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రాల వారీగా తృణధాన్యాల దిగుబడులపై కేంద్ర ప్రభుత్వం ఒక నివేదిక విడుదల చేసింది. ఈక్రమంలో రాష్ట్రాల వారీగా దిగుబడుల్లో తెలంగాణ అత్యంత వెనుకబడి ఉంది. 2021–22 అంచనాలను బట్టి రాష్ట్రంలో తృణ ధాన్యాల దిగుబడి 180.13 మెట్రిక్ టన్నులుగా ఉంది. సరిగ్గా 2017–18 వార్షికంలో ఈ దిగుబడులు కేవలం 83.67 మెట్రిక్ టన్నులు మాత్రమే.

ప్రథమ స్థానంలో రాజస్తాన్...

చిరుధాన్యాల దిగుబడుల్లో దేశంలోనే రాజస్తాన్ రాష్ట్రం అగ్రభాగాన ఉంది. రాజస్తాన్‌లో ఏటా సగటున 4290.95 మెట్రిక్ టన్నుల తృణధాన్యాల దిగుబడి వస్తోంది. ఆ తర్వాతి స్థానంలో మహారాష్ట్ర 2,296 మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా...ఉత్తర్‌ప్రదేశ్‌లో 2223.86 మెట్రిక్ టన్నుల దిగుబడితో మూడో స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్, హరియాణా, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలన్నీ ముందు వరుసలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా సగటున 15921 మెట్రిక్ టన్నుల తృణ ధాన్యాలు దిగుబడి వస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పోషకాలు ఎక్కువగా ఉండి ఆరోగ్యాని అత్యంత మేలుచేసే తృణధాన్యాల సాగును విస్తృతం చేయాలని కేంద్రం సూచించింది. రాష్ట్రంలో తృణధాన్యాల సాగుకు వాతావరణం అనుకూలతతో పాటు ఇక్కడి నేలలు సైతం ఎంతో అనుకూలమైనప్పటికీ వ్యవసాయ శాఖ మాత్రం ఈ అంశంపై ఎలాంటి దృష్టి సారించలేదనిపిస్తోంది. వినియోగం పెరిగితే దిగుమతి చేసుకునే కంటే స్థానికంగా సాగు విస్తీర్ణాన్ని పెంచితే సరసమైన ధరలకే అందుబాటులోకి తీసుకురావొచ్చని కేంద్ర వ్యవసాయ శాఖ రాష్ట్రాలకు సూచించింది.

రాష్ట్రాల వారీగా తృణధాన్యాల దిగుబడులు (మెట్రిక్ టన్నుల్లో)



రాష్ట్రం	2017-18	2018-19	2019-20	2020-21	2021-22
ఆంధ్రప్రదేశ్	453.67	301.91	514.19	540.61	340.01
గుజరాత్	1116.23	1000.15	990.48	1091.97	1155.57
హరియాణా	745.81	899.56	1034.90	1366.56	1132.15
కర్ణాటక	2739.07	1762.17	2555.60	2569.08	2074.92
మధ్యప్రదేశ్	1469.12	851.34	895.71	1024.13	1186.04
మహారాష్ట్ర	2403.02	1319.31	2428.70	2513.82	2296.78
రాజస్తాన్	4061.55	4288.34	5146.89	5155.67	4290.95
తమిళనాడు	926.68	873.47	1017.03	905.26	696.57
తెలంగాణ	83.67	72.25	139.15	166.33	108.13
ఉత్తర్‌ప్రదేశ్	2014.98	1967.27	2171.91	2298.20	2223.86
ఉత్తరాఖండ్	216.80	179.74	191.09	200.85	200.38
ఇతర రాష్ట్రాలు	205.86	195.73	174.92	188.06	216.06
దేశవ్యాప్తంగా	16436.45	13711.24	17260.58	18020.55	15921.43

ఎర్రబెల్లి ఓనమాలు రాస్తే నేను తప్పకుంటా

- ఆయనంత వెన్నుపోటుదారుడు లేడు
- ఎర్రబెల్లి తీరుతో టీడీపీ లాగే బీఆర్ఎస్ ఖతం
- పాలకుర్తి సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



రైతు కొండయ్యతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

పాలకుర్తి/పాలకుర్తిటౌన్/ దేవరుప్పుల/జనగామ: పాలకుర్తి చౌరస్తాలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఓనమాలు, ఏబీసీడీలు రాస్తే తాను రాజకీయాల నుంచి వైదొలుగుతానని టీపీసీసీ చీఫ్ అనుముల రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. పౌరుషం గల ఈ గడ్డ మీద పలక బలపం ఇస్తే ఓనమాలు రాయనోడు ఎమ్మెల్యే అయ్యిండంటే విచారకరమని వ్యాఖ్యానించారు. బుధవారం ఉదయం నుంచి రేవంత్‌రెడ్డి జనగామ జిల్లా దేవరుప్పుల నుంచి పాలకుర్తి వరకు హాథ్ సే హాథ్ జోడో యాత్ర సాగించారు. యాత్రలో మిర్చి, పత్తి రైతులను పలకరించారు. రాత్రి పాలకుర్తి చౌరస్తాలో జిల్లా పార్టీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. డాక్టర్ సుధాకర్‌రావు ఉన్నప్పుడే బావ.. బావ అని తిరుగుతుంటే వెన్నుపోటు పొడుస్తడని చెప్పినా నమ్మలేదని, దీంతో డాక్టర్ సాబ్ కనుమరుగయ్యాడని విచారం వ్యక్తం చేశారు. ఎర్రబెల్లికి చదువురాకున్నా చంద్రబాబు విప్‌గా ఇస్తే విస్మరించి కేసీఆర్ రాచరికపు పాలన కోసం పావుగా పనిచేసి ఈ రోజు మంత్రి అయ్యాడని, తెలుగుదేశాన్ని నట్టేట ముంచిన దుర్మార్గుడని దుయ్యబట్టారు. మేడారం అడవుల్లో కేసీఆర్, ఎర్రబెల్లిలకు పులి ఎదురైతే ఎర్రబెల్లి బూట్లు చదురుకుంటున్నట్లు నమ్మబలికి కేసీఆర్‌ను ఆ పులికి ఎరగా వేస్తాడని చమత్కరించారు. నాడు టీడీపీ తరహాలో నేడు బీఆర్ఎస్‌ను దయాకర్‌రావు బొందపెడతాడని, జాగ్రత్తగా ఉండాలని కేసీఆర్‌కు హితవు పలికారు. చెన్నూరు రిజర్వాయర్ టెండర్ డబుల్ చేసి కమీషన్లు నొక్కాడని, ధరణితో బీఆర్ఎస్ నాయకులు భూ దందా చేసి మంత్రికి బినామీ ఆస్తులను కూడబెట్టుతున్నారని ఆరోపించారు.

కేసీఆర్ దుష్టపాలనకు చరమగీతం పాడండి

సబ్బండ వర్గాలు సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రాన్ని రాచరిపుక విధానాలతో ఏలుతున్న కేసీఆర్ దుష్టపాలనకు చైతన్యవంతులైన తెలంగాణ సమాజం చరమగీతం పాడాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ధరణి ద్వారా దోపిడీ చేసిన భూదందాదారులను జైలుపాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మల్లు రవి, పొన్నం ప్రభాకర్, దొమ్మాటి సాంబయ్య, సిరిసిల్ల రాజయ్య, బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడితే సహించబోం

హంగ్ పాలనపై ఎంపీ కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై రేవంత్ స్పందించారు. ఈ విషయమై అధిష్టానం అంతర్గతంగా చర్చించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. ధర్మాపురం శివారులో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్‌తో కాంగ్రెస్‌కు పొత్తు ఉంటుందని పార్టీలోని సీనియర్ నాయకులు మాట్లాడినా చర్యలు తప్పవని, ఈ విషయాన్ని రాహుల్‌గాంధీ స్వయంగా చెప్పినట్లు తెలిపారు. రాష్ట్రంలో అధికార ప్రభుత్వంపై విసుగు చెందిన ప్రజలు.. కాంగ్రెస్ పాలన వైపు ఎదురు చూస్తున్న సమయంలో పార్టీకి నష్టం కలిగించే విధంగా మాట్లాడితే ఎంతటి వారైనా సంహించేది లేదని హెచ్చరించారు.

ఏం మాట్లాడతారో వారికే తెలియదు: ఎర్రబెల్లి



వరంగల్ చౌరస్తా : 'రేవంత్‌రెడ్డి ఓ ఐరన్ లెగ్. ఆయన ఎక్కడ కాలు పెడితే అక్కడ మటాష్, బండి సంజయ్ ఓ తొండి మనిషి. ఏం మాట్లాడతాడో ఆయనకే తెలియదు'.. అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు విమర్శించారు. సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో భాగంగా.. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని అజంజాహి మిల్లు మైదానంలో ముందస్తుగా నిర్వహిస్తున్న మూడు రోజుల జన్మదిన వేడుకలను బుధవారం మంత్రి దయాకర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌లు పిట్టల రాముడిలా పెగ్గెలు (ఊహాజనితాలు) కొడుతున్నారని, వాళ్లతో ఊదు కాలదు... పీరు లేవదని ఎద్దేవా చేశారు.



ఉద్యోగుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీని ఆమె తన నివాసంలో బుధవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిలగాని సంపత్ కుమార్ స్వామి, సెక్రటరీ జనరల్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడా పనికిరాని నేతలు బీఆర్ఎస్‌లోకి..

- బండి సంజయ్ ఎద్దేవా
- మోదీ మీలాగే చేస్తే బీఆర్ఎస్‌లో ఒక్కరైనా మిగిలేవారా?
- మజ్లిస్ నేతలవి బ్లాక్ మెయిల్ రాజకీయాలు



నాగారంలో గ్రామంలో శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్...

సాక్షి, హైదరాబాద్/ మహేశ్వరం: దేశంలో ఎక్కడా పనికిరాని, చెల్లని కాసుల్లాంటి నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎద్దేవా చేశారు. గ్రామాల అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి నిధులివ్వాలని అడుగుతున్న ప్రజా ప్రతినిధులను బీఆర్ఎస్‌లో చేరితేనే నిధులిస్తామంటూ కేసీఆర్ ప్రభుత్వం బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. 'రాష్ట్రంలోని పంచాయతీల అభివృద్ధికి నిధులిస్తోంది కేంద్ర ప్రభుత్వమే. మీ లెక్కన (బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి) బీజేపీలో చేరితేనే పంచాయతీలకు నిధులిస్తామని మోదీ చెబితే బీఆర్ఎస్‌లో ఒక్కరైనా మిగిలేవారా?' అంటూ ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్‌పేటలో బుధవారం రాత్రి పొద్దుపోయాక నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు.

మహేశ్వరంలో యథేచ్ఛగా భూకబ్జాలు

'మహేశ్వరంలో టీఆర్ఎస్ నేతల భూ కబ్జాలకు అంతు లేకుండా పోయింది. ప్రజా సమస్యలను గాలి కొదిలేశారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి 2.4 లక్షల ఇళ్లకు నిధులిస్తే..కేసీఆర్ ప్రభుత్వం ఒక్క ఇల్లు కట్టకుండా నిధులను దారి మళ్లించింది..' అని సంజయ్ విమర్శించారు. 'ఎంఐఎం నేతలవి బ్లాక్ మెయిల్ రాజకీయాలు. బీఆర్ఎస్ నేతలతో కలిసి వక్ఫ్ భూములను కబ్జా చేస్తూ భూదందా చేస్తూ వందల కోట్లు సంపాదిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే హిందూ దేవుళ్లను కించపరుస్తున్నారు. ఎంఐఎం నేతలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అమ్ముడుపోకపోతే మహేశ్వరం నియోజకవర్గంలో పోటీ చేయాలి. అలాగే రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పోటీ చేయాలి..' అని సవాల్ చేశారు.

బీజేపీ వస్తే తండాల అభివృద్ధికి 'ప్రత్యేక కార్పొరేషన్'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే తండాల సమగ్రాభివృద్ధికి 'ప్రత్యేక అభివృద్ధి కార్పొరేషన్'ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రకటించారు. సేవాలాల్ నడయాడిన బంజారాహిల్స్ ప్రాంతంలో ఓ మందిరాన్ని నిర్మించి ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బీజేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో బండి సంజయ్ పాల్గొని మాట్లాడారు. మోదీ మంత్రి వర్గంలో ఎనిమిది మంది గిరిజనులకు స్థానం కల్పించారని అన్నారు. రాష్ట్రంలో మాత్రం సీఎం కేసీఆర్ గిరిజనులను మోసం చేస్తున్నారని విమర్శించారు.

సీడీపీవో మెరిట్ జాబితా విడుదల: టీఎస్‌పీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలో సీడీపీవో, ఏసీడీపీవో, వేర్‌హౌజ్ మేనేజర్ ఉద్యోగాలకు సంబంధించి అభ్యర్థుల మెరిట్ జాబితాను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. ఈ జాబితా టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ప్రకటించింది. త్వరలో 1:2 పద్ధతిలో నిబంధనలకు అనుగుణంగా ప్రాథమిక ఎంపిక జాబితాను ప్రకటించనున్నట్లు కమిషన్ తెలిపింది. పలు కారణాలతో తిరస్కరణకు గురైన అభ్యర్థులను మెరిట్ జాబితాలో పరిగణించలేదని పేర్కొంది.

గ్రేడ్–1 సూపర్‌వైజర్ పరీక్ష ఫైనల్ 'కీ'విడుదల

రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (సూపర్‌వైజర్) గ్రేడ్–1 ఉద్యోగాల భర్తీకి సంబంధించి నిర్వహించిన అర్హత పరీక్ష ఫైనల్ 'కీ'ని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు టీఎస్‌పీఎస్సీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. క్షేత్రస్థాయిలో అభ్యర్థుల నుంచి వచ్చిన వినతులను, సూచనలను పరిగణించి 'కీ'ని రూపొందించినట్లు వెల్లడించింది.

ఫారెస్ట్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఇంటర్వ్యూ మార్కులు..

ములుగు జిల్లాలో ఉన్న ఫారెస్ట్ కాలేజ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు సంబంధించి టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఇంటర్వ్యూలకు సంబంధించి మార్కులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కమిషన్ తెలిపింది. ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు వివరాలను పరిశీలించుకోవచ్చని సూచించింది.

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్: తలసాని

- గిరిజనుల ఆకాంక్షలను నెరవేర్చారు: మంత్రి సత్యవతి రాథోడ్



సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో తలసాని, సత్యవతి రాథోడ్ తదితరులు

బంజారాహిల్స్ (హైదరాబాద్): తన జాతిని సన్మార్గంలో నడిపించి భారత్‌లోని దాదాపు 11 కోట్ల బంజారాలకు సంత్ సేవాలాల్ మహారాజ్ ఆరాధ్య దైవంగా మారారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో బుధవారం నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక దృక్పథం, సామాజిక సాంస్కృతిక జీవన విధానాన్ని కాపాడటం కోసం సేవాలాల్ మహారాజ్ ఎంతో కృషి చేశారని చెప్పారు. తెలంగాణ వస్తే అణగారిన వర్గాల అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి తగిన గుర్తింపు దక్కుతుందనడానికి సేవాలాల్ జయంతిని అధికారికంగా ప్రభుత్వం నిర్వహించడమే నిదర్శనమన్నారు. ఉత్సవాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసిందని తెలిపారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బంజారా, లంబాడా వర్గాలకు అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలోని తాండాలను గ్రామ పంచాయితీలుగా మార్చి.. 'మా తండాలో మా రాజ్యం'అనే గిరిజనుల చిరకాల ప్రజాస్వామిక ఆకాంక్షను నెరవేర్చిందని చెప్పారు. గిరిజన విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించేందుకు రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇల్లు చక్కబెట్టాం...దేశాన్ని చక్కబెట్టుకుందాం

- దళిత క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కవిత



రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): అన్ని వర్గాల ప్రజలు, సంఘాల సహకారంతో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం సాధించుకుని ఇల్లు చక్కబెట్టుకున్నామని, ఇప్పుడు దేశాన్ని చక్కబెట్టే పనిలో బీఆర్ఎస్‌తో కలిసి అందరూ ముందుకు రావాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. ఎస్పీరోడ్‌లోని వెస్లీ కళాశాల మైదానంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ సాగర్ ఆధ్వర్యంలో బుధవారం దళిత క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంతో పాటు సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవిత పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ అన్ని మతాలవారిని సమానంగా చూశారని, ఆయన తొమ్మిదేళ్ల పాలనలో ఎక్కడా ఎలాంటి మత ఘర్షణలు చోటు చేసుకోలేదని తెలిపారు. అంబేడ్కర్ మనవడు డాక్టర్ రాజారత్నం అంబేడ్కర్ మాట్లాడుతూ..దళిత క్రైస్తవులు ఐకమత్యంతో ముందుకు వెళితేనే రాజ్యాధికారం సాధిస్తారన్నారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్ చేశారు.

'గ్రామీణాభివృద్ధి పథకాల అమలు భేష్'

సాక్షి, హైదరాబాద్: అన్ని గ్రామపంచాయితీలు బహిరంగ మలమూత్ర రహిత గ్రామాలు(ఓడీఎఫ్)గా ప్రకటించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలవడంపట్ల కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ కార్యదర్శి విని మహాజన్ అభినందించారు. ఓడీఎఫ్‌లో సాధించిన విజయాలను అభినందిస్తూ అన్ని గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ గ్రామాలుగా రూపొందించాలని సూచించారు. ఓడీఎఫ్ ప్లస్ గ్రామాల్లో ప్రధానంగా మల సంబంధిత వ్యర్థాలు, సెప్టిక్ ట్యాంక్ మురుగునీటి కాలువలు, నీటివనరులు, బహిరంగ ప్రాంతాలలోకి విడుదల లేదా డంపింగ్ చేయకుండా వాటిని శుద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. బుధవారం బి.ఆర్.కె.ఆర్. భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో మహాజన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో అమలవుతున్న పల్లెప్రగతి గురించి సి.ఎస్. వివరించారు. ఈ సందర్భంగా విని మహాజన్ మాట్లాడుతూ అవసరమైన గ్రామాల్లో ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నారు.

క్లుప్తంగా...

కోయంబత్తూర్, మంగళూరు కేసుల్లో..

ఉగ్రవాదుల కోసం వేట

న్యూఢిల్లీ/చెన్నై: కోయంబత్తూర్, మంగళూరులలో జరిగిన పేలుడు ఘటనల్లో ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులను పట్టుకునేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు గాలింపు ముమ్మరంచేశారు. తమిళనాడు, కేరళ, కర్ణాటకలో బుధవారం ఉగ్ర జాడ కోసం అన్వేషణ కొనసాగిందని ఎన్ఐఏ అధికారులు చెప్పారు. కోయంబత్తూర్ కారు బాంబు పేలుడు కేసు దర్యాప్తులో భాగంగా 32 ప్రాంతాల్లో, మంగళూరు పేలుడు కేసులో ఎనిమిది చోట్ల ఎన్ఐఏ అధికారులు సోదాలు చేశారు. భారీగా ఎలక్ట్రానిక్ పరికరాలు, రూ.4 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

‘అదానీ’పై మరో కేసు



న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీల షేర్లలో అవకతవకలపై దర్యాప్తు కోరుతూ సుప్రీంకోర్టులో బుధవారం మరో పిటిషన్ దాఖలైంది. కాంగ్రెస్ నేత జయా ఠాకూర్ దీన్ని దాఖలు చేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో దర్యాప్తుకు ఆదేశించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహల ధర్మాసనం ఎదుట వాదనలు జరిగాయి. కేసును అత్యవసరంగా విచారించాలని లాయర్ కోరారు. దీంతో కేసును ఈనెల 24వ తేదీన విచారిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. అయితే ఈ అంశంపై ఇప్పటికే నమోదైన మరో రెండు కేసుల విచారణ 17వ తేదీన ఉండటంతో అదే రోజున దీనినీ విచారించాలని జయా ఠాకూర్ తరఫు లాయర్ చెప్పారు. అందుకు సమ్మతిస్తూ, ఈనెల 17వ తేదీనే విచారిస్తామని కోర్టు స్పష్టంచేసింది. హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో స్టాక్‌మార్కెట్ నియంత్రణ వ్యవస్థల బలోపేతానికి నిపుణుల మండలిని ఏర్పాటు చేయాలన్న కోర్టు సిఫార్సులను కేంద్రం అంగీకరించడం తెలిసిందే.

పాక్‌లో కొండెక్కిన కోడి మాంసం...

కిలో 780 రూపాయలు!

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో కిలో కోడి మాంసం ఏకంగా 780 రూపాయలైంది! బోన్‌లెస్ అయితే రూ.1,100కు చేరుకుంది. లీటర్ పాల ధర 210 రూపాయలకు పెరిగింది. పాడి ఉత్పత్తులతోపాటు వంటనూనె, గ్యాస్, గోధుమలు వంటి నిత్యావసర సరకుల ధరలన్నీ కనీవినీ ఎరగనంతగా పెరిగి జనానికి చుక్కలు చూపుతున్నాయి. కొన్నాళ్లుగా పాక్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కి శ్రీలంకను తలపిస్తున్న విషయం తెలిసిందే. విదేశీ మారక నిల్వలు 1998 ఏడాది తర్వాత అత్యంత కనిష్ట స్థాయిలకు పడిపోయాయి.

భూమికి బై బై

నిష్క్రమించిన ఆకుపచ్చ తోకచుక్క



న్యూయార్క్: జనవరి మధ్య నుంచి ఫిబ్రవరి తొలి వారం దాకా దాదాపు నెల రోజుల పాటు ఆకాశంలో కనువిందు చేసిన ఆకుపచ్చని తోకచుక్క ఇక సెలవంటూ వెళ్లిపోతోంది. సి2022ఈ3గా పిలుస్తున్న ఈ తోకచుక్క మన నుంచి అత్యంత దూరంగా సౌరమండలపు వెలుపలి తీరాల కేసి పయనమవుతోంది. ఇది మళ్లీ భూమికి సమీపంగా వచ్చి మనకు కన్పించేది మరో 50 వేల సంవత్సరాల తర్వాతే! సరిగ్గా చెప్పాలంటే, 52023వ సంవత్సరంలో అన్నమాట!! అయితే సూర్యుడు, ఇతర గ్రహాల ఆకర్షణ శక్తి ప్రభావం వల్ల దాని కక్ష్యలో బాగా మార్పుచేర్పులు జరిగే క్రమంలో అది అంతకంటే చాలా ముందే మరోసారి భూమికి సమీపానికి వచ్చే అవకాశాలనూ కొట్టిపారేయలేమంటున్నారు సైంటిస్టులు. అదే సమయంలో కక్ష్యలో వ్యతిరేక మార్పులు జరిగితే 50 వేల ఏళ్ల కంటే ఎక్కువ సమయమూ పట్టవచ్చని కూడా వారు చెబుతున్నారు. భూమికి అతి సమీపానికి వచ్చినప్పుడు భూ ఉపరితలం నుంచి ఈ తోకచుక్క 4.2 కోట్ల కిలోమీటర్ల దూరంలో కనువిందు చేసింది. అది చివరిసారి మనకు కనిపించినప్పటికి భూమిపై ఆధునిక మానవుని ఆవిర్భావమే జరగలేదు! అప్పటికింకా నియాండర్తల్ మానవుల హవాయే నడుస్తోంది.

మార్‌బర్గ్.. మరో ప్రాణాంతక వైరస్



లండన్: మానవాళిపైకి మరో ప్రాణాంతక వైరస్ వచ్చిపడింది. మార్‌బర్గ్ వైరస్ డిసీస్ (ఎంవీడీ)గా పిలిచే దీని తాలూకు తొలి కేసు గత వారంలో పశ్చిమ ఆఫ్రికా తీరంలోని ఈక్వటోరియల్ గినియాలో నమోదైనట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే నిర్ధారించింది కూడా. విపరీతమైన జ్వరం, తీవ్రమైన తలనొప్పి, ఆయాసం, రక్తపు వాంతులు, విరేచనాలు, కండరాల నొప్పుల వంటివి దీని లక్షణాలు. ఈ వ్యాధి తొలిసారిగా 1967లో నమోదైంది. ఎబోలాను పోలి ఉండే ఈ ప్రాణాంతక వైరస్‌కు ఇప్పటిదాకా చికిత్సేమీ లేదు! గినియాలోని కీటెం ప్రావిన్స్‌లో దీని బారిన పడి అప్పుడే 9 మంది మరణించారని డబ్ల్యూహెచ్‌వో మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ‘‘వారందరిలోనూ గుర్తు తెలియని హెమరేజ్ జ్వరం ఆనవాళ్లు బయటపడ్డాయి. ముందు జాగ్రత్తగా మార్‌బర్గ్ సోకినట్టు అనుమానమున్న 200పై చిలుకు మందిని క్వారెంటైన్ చేశారు’’ అని వెల్లడించింది. దాంతో పొరుగునున్న కామెరూన్ సరిహద్దుల వద్ద ఆంక్షలను మరింత పెంచింది.

ఏమిటీ వ్యాధి?

ఎంవీడీ రక్తస్రావంతో కూడిన తీవ్ర జ్వరానికి దారి తీస్తుంది. దీనిబారిన పడ్డవారిలో ఏకంగా 88 శాతం మంది మృత్యువాత పడుతున్నారు! 1967లో జర్మనీ, సెర్బియాల్లో ఎంవీడీ ప్రబలింది. ఉగాండా నుంచి దిగుమతి చేసుకున్న ఆఫ్రికన్ గ్రీన్ మంకీస్ ద్వారా ఇది సోకినట్టు అప్పట్లో తేల్చారు. గబ్బిలాల వంటి వాటికి ఆవాసమైన గుహలు, గనుల్లో చాలాకాలం పాటు గడిపితే ఈ వైరస్ సోకుతుంది. పైగా ఇది అంటువ్యాధి కూడా. ఒకరి నుంచి మరొకరికి సులువుగా, అతి వేగంగా సోకుతుంది. తలనొప్పి, జ్వరం, ఆయాసంతో మొదలై మూడో నాటికల్లా పొత్తి కడుపు నొప్పి, విరేచనాల దాకా వెళ్తుంది. వారం రోజులకు రక్తపు వాంతులు మొదలవుతాయి. కళ్లన్నీ లోపలికి పోయి, మనిషి పీక్కుపోయి అచ్చు దెయ్యాన్ని తలపిస్తాడు. కేంద్ర నాడీవ్యవస్థ పనితీరు కూడా బాగా మందగిస్తుంది.

చికిత్స లేదు

దీనికి ఇప్పటిదాకా మందు గానీ, వ్యాక్సీన్ గానీ అందుబాటులో లేవు. పలు వ్యాక్సీన్లు ఇంకా ప్రయోగాల దశలోనే ఉన్నాయి. ఇదమిత్థంగా చికిత్స కూడా లేదనే చెప్పాలి. అసలు తొలి దశలో ఎంవీడీని గుర్తించడం కూడా చాలా కష్టం.

www.forest.com!

అడవుల్లో అంతర్గత నెట్‌వర్క్

చెట్లు సమాచారం ఇచ్చిపుచ్చుకుంటాయా?

చెట్ల మధ్య ప్రత్యేకమైన సమాచార వ్యవస్థ ఏమైనా ఉంటుందా? దాని సాయంతో సమాచారంతో పాటు అవసర సమయాల్లో శక్తిని కూడా అంతర్గతంగా అవి పరస్పరం ఇచ్చిపుచ్చుకోగలవా? ఇలా జరుగుతుందనే నమ్మకాలు చాలా నాగరికతల్లో కన్పించేవే. వీటిలో నిజానిజాలపై ఎన్నో పరిశోధనలు కూడా జరిగాయి. ఇది మరీ సత్యదూరమేమీ కాదని తాజా అధ్యయనం ఒకటి చెబుతుండటం ఆసక్తికరం...

-సాక్షి, నేషనల్ డెస్క్

- వనరుల బదిలీ కూడా జరుగుతుందా?
- ఫంగస్ నెట్‌వర్క్‌లే మాధ్యమమా?
- కావచ్చంటున్న తాజా అధ్యయనాలు



అడవులు. అంతుచిక్కని విశేషాలకు నిలయాలు. వాటికి సంబంధించి మనుషుల్లోనూ ఎన్నో నమ్మకాలు ఏర్పడుతూ వచ్చాయి. ఇందుకు చరిత్ర పొడవునా ఎన్నో తార్కాణాలు. అలాంటి నమ్మకాల్లో ఒకటి, అడవుల్లో చెట్ల మధ్య మనకు తెలియని అంతర్గత నెట్‌వర్క్ ఒకటి అల్లుకుని ఉంటుందన్నది. చెట్లు తమకు అందుబాటులో ఉన్న వనరులను తమ నుంచి పుట్టుకొచ్చిన మొక్కలకు పంచుతాయని కూడా చెబుతుంటారు. అవసర సమయాల్లో వాటికి అండగా నిలిచి కాపాడుకుంటాయన్నది కూడా ఒక భావన. భూమి లోపల ఉండే పలు రకాల ఫంగస్‌లను చెట్లు యానకంగా, మాధ్యమంగా చేసుకుంటాయని కొందరు సైంటిస్టుల సూత్రీకరణ. వాటి సాయంతో అడవుల్లో చెట్ల మధ్య ఎన్నో రకాల నెట్‌వర్క్‌లు విస్తరించి ఉన్నట్టు భావిస్తున్నారు. దీన్ని ‘వుడ్-వైడ్-వెబ్’గా వారు అభివర్ణిస్తుంటారు. వీటికి సంబంధించి ఇప్పటిదాకానైతే కచ్చితమైన రుజువులేమీ దొరకలేదు. వీటిలోని నిజానిజాలను నిర్ధారించేందుకు యూనివర్సిటీ ఆఫ్ అల్బెర్టాకు చెందిన అధ్యయన బృందం ప్రొఫెసర్ జస్టిన్ కర్స్ట్ సారథ్యంలో చాలాకాలం పాటు పరిశోధనలు జరిపింది.

మాధ్యమంగా సీఎంఎన్

పుట్టగొడుగులు తదితర ఫంగస్‌ల్లో సాధారణ అనుసంధాన వ్యవస్థ ఒకటి భూ ఉపరితలం లోపల ఉంటుందని చెబుతుంటారు. దీన్ని సైంటిస్టులు కామన్ మైకోరిజల్ నెట్‌వర్క్స్ (సీఎంఎన్)గా పిలుస్తుంటారు. కర్స్ట్ బృందం ప్రధానంగా దీనిపైనే దృష్టి సారించింది. ఈ నెట్‌వర్క్‌ల ఉనికి నిజమేనని తమ పరిశోధనలో తేలినట్టు చెబుతోంది. అయితే ఈ నెట్‌వర్కులు చెట్లు, మొక్కలకు కూడా యానకంగా పని చేసి వాటి మధ్య భూగర్భ నెట్‌వర్క్‌కు వీలు కల్పిస్తున్నాయన్న దాన్ని రుజువు చేసేందుకు మాత్రం గట్టి సాక్ష్యాలు లభించాల్సి ఉందంటున్నారు. అయితే సీఎంఎన్ నెట్‌వర్క్‌ల ఉనికి వాస్తవమేనని తేలడం వరకూ ఈ విషయంలో ఒక పెద్ద ముందడుగేనని కర్స్ట్ చెబుతున్నారు.

కర్స్ట్ బృందం అధ్యయన ఫలితాలు నేచర్ ఎకాలజీ అండ్ ఎవల్యూషన్ జర్నల్లో పబ్లిషయ్యాయి. ఈ విషయమై ఇప్పటికే జరిగిన ఇతర అధ్యయనాల ఫలితాలతో వాటిని పోల్చి మరిన్ని ఆసక్తికరమైన విషయాలను నిగ్గుదేల్చేందుకు యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియాకు చెందిన మెలనీ జోన్స్, యూనివర్సిటీ ఆఫ్ మిసిసిపీకి చెందిన జేసన్ హోక్స్‌మా చేతులు కలిపారు. సీఎంఎన్‌ల మాదిరిగా చెట్ల మధ్య అంతర్గత నెట్‌వర్క్‌ల ఉనికి నిజమో కాదో నిర్ధారించేందుకు ఏకంగా 1,600కు పైగా పరిశోధన పత్రాలను వారు లోతుగా విశ్లేషించారు. వారు తేల్చిందేమిటంటే...

వెలుగులోకి ఆసక్తికర అంశాలు

- చెట్ల మధ్య అంతర్గతంగా నెట్‌వర్కులున్నాయనేందుకు ఇప్పటిదాకా సాక్ష్యాల్లేవు.
- అయితే అందుకు ప్రధాన కారణం సీఎంఎన్ నిర్మాణం, పనితీరుపై సమాచార లేమే!
- ఫంగస్‌ల తాలూకు సీఎంఎన్‌ల ద్వారా భూగర్భంలో చెట్ల మధ్య వనరుల బదిలీ జరుగుతుందని 26 అధ్యయనాలపై జరిపిన విశ్లేషణలో తేలింది. అదెలాగన్నది కనిపెట్టడం మాత్రం సాధ్యపడలేదు.
- మరో రెండు అధ్యయనాల్లో చెట్ల మధ్య ఉమ్మడి ఫంగస్ లింకులున్నట్టు కూడా తేలింది.
- పూర్తిగా ఎదిగిన చెట్లు సీఎంఎన్‌లను మాధ్యమంగా చేసుకుని అందుబాటులో ఉన్న వనరులను తమనుంచి పుట్టుకొచ్చిన మొక్కలకు అందజేస్తాయని, ఆపద సమయాల్లో జాగ్రత్తగా ఉండాలంటూ సంకేతాలు కూడా పంపుతాయన్న భావనలో పెద్దగా అసంబద్ధత కూడా కన్పించదు. బహుశా అలా జరుగుతూ ఉండొచ్చు.
- కీటకాల దాడి గురించి మొక్కలకు సీఎంఎన్ మాధ్యమం ద్వారా చెట్లు హెచ్చరించడం ఒక అధ్యయనంలో వెలుగులోకి వచ్చింది.
- మరిన్ని సాక్ష్యాలు లభించనిదే చెట్ల అంతర్గత నెట్‌వర్క్‌పై పక్కాగా ఏమీ చెప్పలేం.

ఎల్‌ఏసీ బలోపేతం

మరో 7 బెటాలియన్లు, 9,400 సిబ్బంది



న్యూఢిల్లీ: భారత్-చైనా వాస్తవాధీన రేఖ వెంట సైన్యం మొహరింపును మరింతగా పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. కొత్త బెటాలియన్లు, సిబ్బందికి సంబంధించిన నిర్ణయానికి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. భారత్-చైనా వాస్తవాధీన రేఖ వెంట సరిహద్దు భద్రత చూసే ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ)లోకి మరో 9,400 మందిని నియమించనున్నారు. వీరు బోర్డర్ బేస్ వద్ద విధులు నిర్వహించనున్నారు. మరో ఏడు బెటాలియన్ల మంజూరుకూ ప్రధాని మోదీ నేతృత్వంలోని భద్రతాంశాలపై కేబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసింది. కొత్త సిబ్బందిని 47 నూతన బోర్డర్ పోస్టులు, డజను ‘స్టేజింగ్ క్యాంప్’లు/ ట్రూప్ బేస్‌లలో నియోగించనున్నారు. ఇవి చాలావరకు అరుణాల్ ప్రదేశ్‌లో ఏర్పాటవుతాయి. కొత్త బెటాలియన్లు, సెక్టార్ ప్రధానకార్యాలయాన్ని 2025-26కల్లా ఏర్పాటుచేస్తారు. సిబ్బంది స్థావరాలు, ఆఫీస్, నివాస గృహాల కోసం రూ.1,808 కోట్లు, ఏటా నిర్వహణకు రూ.964 కోట్లు ఖర్చుకానుంది. 2020 ఏడాది నుంచి లద్దాఖ్‌లో ఇరు దేశాల సైనిక మొహరింపు పెరిగిన విషయం విదితమే. ప్రస్తుతం భారత్-చైనా వాస్తవాధీన రేఖ వెంట 176 బోర్డర్ పోస్టులు ఉన్నాయి.

త్రిపురలో నేడే పోలింగ్



పోలింగ్‌కు సర్వం సిద్ధం

అగర్తలా: రాజకీయ పార్టీల హోరాహోరీ ప్రచార కార్యక్రమాలు, ఎన్నికల హామీలు, పరస్పర విమర్శనాస్త్రాల పర్వం ముగిశాక పోలింగ్ క్రతువుకు త్రిపుర రాష్ట్రం సిద్ధమైంది. గురువారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు 3,337 పోలింగ్ కేంద్రాల్లో 60 శాసనసభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా అనిఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈఓ) గిట్టే కిరణ్‌కుమార్ దినకరో చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో 1,100 కేంద్రాలు సున్నితమైన ప్రాంతాల్లో ఉండగా 28 సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్నాయి. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ కోసం ఉద్యమం చేసి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తిప్రా మోతా రాకతో ఈసారి త్రిముఖ పోరు కనిపిస్తోంది. బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమి, సీపీఐ(ఎం)-కాంగ్రెస్ కూటమి, తిప్రా మోతాల మధ్యే అసలు పోరు ఆవిష్కృతంకానుంది. 13.53 లక్షల మహిళాఓటర్లుసహా మొత్తం 28.13 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మార్చి రెండో తేదీన ఓట్లు లెక్కిస్తారు. ‘ అన్ని పోలింగ్ కేంద్రాల్లో కలిపి మొత్తంగా 31వేల పోలింగ్ సిబ్బంది, 25వేల కేంద్ర భద్రతా బలగాలు, 31వేల రాష్ట్ర పోలీసు బలగాలు విధుల్లో కొనసాగనున్నాయి’ అని సీఈఓ చెప్పారు. ముందస్తు చర్యల్లో భాగంగా 17వ తేదీ ఉదయం దాకా నిషేధాజ్ఞలు అమల్లోకి తెచ్చాం. అంతరాష్ట్ర, అంతర్జాతీయ సరిహద్దులను మూసేశాం’ అని సీనియర్ పోలీస్ ఉన్నతాధికారి చెప్పారు.

55 చోట్ల బీజేపీ, 42 చోట్ల తిప్రామోతా

ముఖ్యమంత్రి, బీజేపీ అభ్యర్థి మాణిక్ సాహా ఈసారి బర్దోవాలీ నుంచి బరిలో నిలిచారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి సాబ్రూమ్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నారు. తిప్రా మోతా చైర్మన్ ప్రద్యోత్ దేబ్ బర్మన్ ఈసారి పోటీచేయడంలేదు. బీజేపీ 55 చోట్ల తన అభ్యర్థులను బరిలో నిలిపింది. బీజేపీ కూటమి పార్టీ ఐపీఎఫ్‌టీ ఆరు స్థానాల్లో పోటీచేస్తోంది. ఈ రెండు పార్టీలూ ఒక స్థానంలో స్నేహపూర్వక పోటీకి సిద్ధమయ్యాయి. సీపీఎం 47 చోట్ల, కాంగ్రెస్ 13 చోట్ల, తిప్రా మోతా 42 చోట్ల అభ్యర్థులను నిలబెట్టాయి. గత ఐదేళ్లపాలనలో తాము చేసిన అభివృద్ధినే ఎన్నికల అజెండాగా బీజేపీ ప్రచారం చేయగా, దుష్పరిపాలన అంటూ లెఫ్ట్ ఫ్రంట్, కాంగ్రెస్‌లు విమర్శిస్తూ ప్రచారంచేయడం తెల్సిందే. గ్రేటర్ తిప్రాల్యాండ్ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా పనిచేస్తూ తిప్రా మోతా ఎన్నికల పర్వంలో మునిగిపోవడం విదితమే.

రెండో రోజూ ‘సర్వే’



ఢిల్లీలోని బీబీసీ ఆఫీస్ వద్ద పోలీసులు, మీడియా ప్రతినిధులు

- బీబీసీ కార్యాలయాల్లోనే ఐటీ అధికారులు
- ఆర్థిక డేటా సేకరణ, కంప్యూటర్లు, ఫోన్ల క్లోనింగ్
- సోదాలపై కొనసాగిన విపక్షాల విమర్శలు

న్యూఢిల్లీ: ముంబై, ఢిల్లీల్లోని బీబీసీ కార్యాలయాల్లో మంగళవారం మొదలైన ఆదాయ పన్ను శాఖ ‘సర్వే’ బుధవారం కూడా కొనసాగింది. అధికారులు మంగళవారం నుంచీ బీబీసీ ఆఫీసుల్లోనే ఉండి సోదాలు జరుపుతున్నారు. వాటిలో భాగంగా సంస్థ ఆర్థిక కార్యకలాపాల డేటా తాలూకు నకళ్లు తీసుకున్నారు. కొన్ని కంప్యూటర్లను, ఫోన్లను క్లోన్ కూడా చేసినట్టు సమాచారం. ఆర్థిక తదితర విభాగాలకు చెందిన సిబ్బందిని పలు అంశాలపై ప్రశ్నించారు. జర్నలిస్టులు, ఇతర సిబ్బందిని మంగళవారం రాత్రి కార్యాలయాలు వీడేందుకు అనుమతించారు. పన్ను ఎగవేత తదితర అంశాలపై సర్వే చేస్తున్నట్టు ఐటీ శాఖ మంగళవారం ప్రకటించడం తెలిసిందే. సర్వేలో భాగంగా ఐటీ బృందాలు కంపెనీల వ్యాపార ప్రాంగణాలకే పరిమితమవుతాయి తప్ప ప్రమోటర్లు, డైరెక్టర్లు తదితరుల నివాసాల జోలికి వెళ్లవు.

పత్రికా స్వేచ్ఛ ముఖ్యం: అమెరికా

బీబీసీ కార్యాలయాల్లో సోదాలపై అమెరికా స్పందించింది. దీనిపై తమకూ సమాచరముందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి నెడ్ ప్రైస్ అన్నారు. ఈ సోదాలు ప్రజాస్వామిక విలువలకు విరుద్ధమా అని ప్రశ్నించగా దానిపై తానేమీ చెప్పలేనన్నారు. ‘‘అయితే పత్రికా స్వేచ్ఛకు మేమెప్పుడూ మద్దతిస్తాం. అది, మత స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలు’’ అన్నారు.

హిట్లర్‌ను మించారు: మమత

బీబీసీ ఆఫీసుల్లో ఐటీ సోదాలపై విపక్షాల మాటల దాడి బుధవారమూ కొనసాగింది. ఇది మోదీ సర్కారు ప్రతీకార చర్యేనని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. ‘‘పత్రికా స్వేచ్ఛకు ఇది గొడ్డలిపెట్టు. ఇలాంటి పరిస్థితులను అడ్డుకోగల న్యాయవ్యవస్థను కూడా గుప్పిట పట్టేందుకు కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తుండటం మరింత ఆందోళనకరం’’ అన్నారు. ‘‘వాళ్లు (బీజేపీ) హిట్లర్ తదితరులను కూడా మించిపోయారు. అధికారం చేతిలో ఉన్నందున ఏమైనా చేయగలమని బీజేపీ అనుకుంటోంది. కానీ ఇదెంతో కాలం సాగదు’’ అంటూ మండిపడ్డారు. బీబీసీపై ఐటీ దాడులతో ప్రపంచం దృష్టిలో భారత ప్రతిష్ట బాగా దెబ్బ తింటోందని కాంగ్రెస్ అభిప్రాయపడింది. జీ-20 శిఖరాగ్రానికి సారథ్యం వహిస్తున్న వేళ ఇలాంటి మతిలేని పనులతో మోదీ సర్కారు ఎలాంటి సందేశమిస్తోందని పార్టీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యం గొంతు గొంతు నొక్కడమేనని ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వెంటనే సీబీఐ, ఈడీ, ఐటీ వారి వెంట పడతాయని ఎద్దేవా చేశారు.



తుర్కియేలోని హతాయ్‌లో శిథిలాల్లోంచి ఏకంగా 210 గంటల తర్వాత సజీవంగా బయటికొచ్చిన ఫయేజ్ అనే సిరియా వాసి!

దేశీయ ఆయుధాలకే ప్రాధాన్యం: రాజ్‌నాథ్

బెంగళూరు: దేశీయంగా ఉత్పత్తి చేసిన ఆయుధాలు, పరికరాలకే రక్షణ రంగంలో ప్రాధాన్యమిస్తున్నట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. 2023-24లో రక్షణ శాఖ పెట్టుబడి వ్యయంలో 75 శాతం నిధులను వాటి కొనుగోలుకే వెచ్చించనున్నట్లు తెలిపారు. బుధవారం బెంగళూరులో ఏరో ఇండియా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమ వర్గాలు ఒక్క అడుగు ముందుకేస్తే ప్రభుత్వం 10 అడుగులు వేస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వం, పరిశ్రమ వర్గాల మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి.

84 వేల వ్యాగన్లకు ఆర్డర్ ఇచ్చాం: మంత్రి దర్శన

న్యూఢిల్లీ: సరకు రవాణా రంగంలో రైల్వేల వాటా పెంచేందుకు కేంద్రం కృతనిశ్చయంతో ఉందని రైల్వే శాఖ సహాయ మంత్రి దర్శనా జర్దోశ్ అన్నారు. ప్రస్తుత 27 శాతం నుంచి 2030కల్లా 45 శాతానికి పెంచేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. అందుకే ఒకేసారి ఏకంగా 84,000 వ్యాగన్ల కోసం ఆర్డర్ ఇచ్చామని బుధవారం అసోచామ్ కార్యక్రమంలో చెప్పారు. ‘‘ఈ ఏడాది 150 కోట్ల టన్నుల లోడింగ్ సామర్థ్యాన్ని సంతరించుకోవడమే రైల్వే శాఖ లక్ష్యం. డెడికేటెడ్ ఫ్రీట్ కారిడార్‌లు 61 శాతం పూర్తయ్యాయి. సంపూర్ణంగా అందుబాటులోకి వస్తే సరకు రవాణా రైళ్ల వేగమూ పెరుగుతుంది. వచ్చే ఆర్థికసంవత్సరంలో రైల్వే విద్యుదీకరణ 100 శాతం పూర్తి అవుతుందని భావిస్తున్నా’ అని అన్నారు.

కెనడాలో హిందూ ఆలయంపై విద్వేష రాతలు

టొరంటో: ఖలిస్తాన్ తీవ్రవాదులు కెనడాలోని హిందూ దేవాలయ గోడలపై భారత వ్యతిరేక రాతలు రాశారు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఒంటారియో రాష్ట్రంలోని మిస్సీసాగా సిటీలోని ప్రముఖ రామమందిరం గోడలపై ‘ మోదీని ఉగ్రవాదిగా ప్రకటించండి(బీబీసీ)’, ‘హిందుస్తాన్ ముర్దాబాద్’, ‘సంత్ బింద్రావాలా అమరుడు’ అంటూ నలుపు రంగు పెయింట్‌తో రాతలు రాశారు. ఈ ఘటనపై కెనడాలోని ఇండియన్ మిషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ‘ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించిన ఆగంతకులపై కెనడా ప్రభుత్వం తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలి’ అని భారత కాన్సులేట్ మంగళవారం ట్వీట్‌చేసింది.

సహకారోద్యమం బలోపేతం!

- ఐదేళ్లలో 2 లక్షల పీఏసీలు, సహకార సంఘాలు
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు



న్యూఢిల్లీ: దేశంలో సహకార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాబోయే ఐదేళ్లలో గ్రామ పంచాయతీల్లో 2 లక్షల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీలు), పాడి-మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. కేంద్ర కేబినెట్ బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైంది. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశవ్యాప్తంగా దాదాపు 99,000 పీఏసీలు ఉండగా, 63,000 మాత్రమే చురుగ్గా ఉన్నాయి. 1.6 లక్షల పంచాయతీల్లో పీఏసీలు లేవు. 2 లక్షల గ్రామాల్లో పాడి-మత్స్య సహకార సంఘాల్లేవు. అక్కడ వాటిని, తీర గ్రామాల్లో మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేస్తారు. ఐదేళ్లలో 2 లక్షల బహుళ ప్రయోజనకర పీఏసీలు, పాడి-మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. దీంతో రైతుల ఆదాయం పెరగడంతోపాటు గ్రామాల్లో నూతన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఉత్తర సరిహద్దుల్లో ‘భవ్య గ్రామాలు’

దేశ ఉత్తర సరిహద్దుల్లో ఉన్న గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం వైబ్రాంట్ విలేజెస్ ప్రోగ్రామ్(వీవీపీ) పేరిట నూతన పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2022-23 నుంచి 2025-26 దాకా మూడేళ్ల వ్యవధిలో రూ.4,800 కోట్లతో వీవీపీ పథకాన్ని అమలు చేయనున్నారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం. ఇందులో రూ.2,200 కోట్లను రోడ్ల నిర్మాణం కోసం ఖర్చు చేస్తారు. ఈ పథకంతో సరిహద్దు గ్రామాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆశిస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. వీవీపీ స్కీమ్‌తో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రం పాలిత ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలియజేసింది.


షింకున్ లా సొరంగం

కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లోని సరిహద్దు ప్రాంతాలను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించడానికి 4.1 కిలోమీటర్ల పొడవైన షింకున్ లా సొరంగం నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. నిమూ-పదామ్-దార్చా రోడ్డు లింక్‌లో రూ.1,681 కోట్లతో ఈ సొరంగం నిర్మిస్తారు. 2025 డిసెంబర్ నాటికల్లా నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో లద్దాఖ్‌కు సులువుగా చేరుకోవడానికి ఈ టన్నెల్ ఉపయోగపడుతుందని వివరించారు. దేశ భద్రతకు సైతం ఈ ప్రాజెక్టు చాలా కీలకమని చెప్పారు. శ్రీనగర్-కార్గిల్-లేహ్ టన్నెల్ నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామన్నారు.



బుధవారం కశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్కీయింగ్

పెరిగే సముద్ర మట్టాలతో కొన్ని దేశాలు జలసమాధి: గుటెరస్



ఐరాస: భూతాప పెరుగుదలను 1.5 డిగ్రీ సెల్సియస్‌కు కట్టడి చేయకపోతే సముద్ర మట్టాలు అనూహ్యంగా పెరిగి పలు దేశాలను ముంచేస్తాయని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తంచేశారు. ‘పెరుగుతున్న సముద్ర మట్టాలు’ అంశంపై ఐరాస భద్రతా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘‘‘సముద్ర మట్టాలు పెరిగితే భారత్, బంగ్లాదేశ్, చైనా, నెదర్లాండ్స్ వంటి దేశాలకు చాలా ప్రమాదం. కైరో, లాగోస్, మపుటో, బ్యాంకాక్, ఢాకా, జకార్తా, ముంబై, షాంఘై, కోపెన్‌హాగెన్, లండన్, లాస్ ఏంజెలెస్, న్యూయార్క్, బ్యూనస్ ఏరిస్, శాంటియాగో వంటి నగరాలకు ముప్పు. భూతాపం 2 డిగ్రీలు పెరిగితే సముద్రమట్టాలు ఆరు మీటర్లు, 5 డిగ్రీలు పెరిగితే ఏకంగా 22 మీటర్లు పైకెగసి ఆయా దేశాలను జలసమాధి చేస్తాయి’’ అని హెచ్చరించారు.

సాక్షి
కరీంనగర్
గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు.



రైతుబీమాలో మార్పు

అన్నదాత కుటుంబాలకు సత్వర సేవలు అందించే ప్రభుత్వం రైతుబీమా పథకంలో పలు మార్పులు తీసుకొచ్చింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
33.0/16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటి పూట ఎండగా ఉంటుంది. సాయంత్రం చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం



కరీంనగర్‌క్రైం: ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా అదనపు అభ్యర్థులకు బుధవారం శారీరక సామర్థ్య, దేహదారుఢ్య పరీక్షలు సిటీ పోలీస్ శిక్షణ కేంద్రంలో ప్రారంభమయ్యాయి. పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు ఈ పరీక్షలను ప్రారంభించారు. ఉదయం 5 గంటలకు 1600మీటర్ల పరుగు ప్రారంభమైంది. తొలుత అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీల, రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్, రిస్ట్ బ్యాండ్ టాగింగ్, ఆర్‌ఎఫ్‌ఐడీ బిబ్ జాకెట్లు ధరింపజేశారు. పరుగులో అర్హత సాధించినవారికి లాంగ్‌జంప్, షాట్‌పుట్ విభాగాల్లో పరీక్ష నిర్వహించారు. పరీక్షలకు 600మంది హాజరుకావాల్సి ఉండగా 123మంది గైర్హాజరయ్యారు. హాజరైన 442మందిలో 129మంది అర్హత సాధించారు. 313 మంది అర్హత సాధించలేకపోయారు. మరో 35మంది అనారోగ్యకారణాలు చూపుతూ ధ్రువపత్రాలు సమర్పించారు. అడిషనల్ డీసీపీ(పరిపాలన) జి.చంద్రమోహన్, ఏసీపీలు తుల శ్రీనివాస రావు, సత్యనారాయణ, కాశయ్య, సీహెచ్ మల్లికార్జున్, సి.ప్రతాప్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ముని రామయ్య, సూపరింటెండెంట్ ఏవీఎస్ చారి, ఎస్‌బీఐ జి.వెంకటేశ్వర్లు, సీఐలు మాధవి, సంతోశ్‌కుమార్, క్రిష్టారెడ్డి, రవీందర్, ఆర్‌ఐలు సురేశ్, జానీమియా, రమేష్, మురళి, మల్లేశం పాల్గొన్నారు.

జిల్లాలో నేడు నిర్వహించే కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో గురువారం 48 కంటి వెలుగు శిబిరాలను నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జువేరియా తెలిపారు. కరీంనగర్ పట్టణంలో 4,10,13,16,28,30,31,32, 36,40,44,55వ డివిజన్‌లలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. హుజూరాబాద్ పట్టణంలో 10, 29వ వార్డులు, అదే మండలం చెల్పూరు, కందుగుల గ్రామాల్లో, జమ్మికుంట పట్టణంలోని 5,21,27వ వార్డులు, అదే మండలంలో పాపక్కపల్లి గ్రామం, వీణవంక మండలం ఇప్పలపల్లి, రెడ్డిపల్లి, చిగురుమామిడి మండలం లంబాడిపల్లి, రామంచ, చొప్పదండి పట్టణంలో 6వ వార్డు, అదే మండలంలోని చాకుంట గ్రామం కంటి పరీక్షలు చేస్తారని వివరించారు. అలాగే ఇల్లందకుంట మండలం బుజునూరు, కనపర్తి, గంగాధర మండలం చిన్న అచ్చంపల్లి, మల్లాపూర్, లింగంపల్లి, రామడుగు మండలం, కిష్టాపూర్, మోతే, తిరుమలాపూర్, కొత్తపల్లి పట్టణం 2వ వార్డు, అదే మండలంలోని ఆసిఫ్‌నగర్, కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారం, జూబ్లీనగర్, మానకొండూరు మండల కేంద్రంతోపాటు గంగిపల్లి, ఊటూర్, సైదాపూర్ మండలం లస్మన్నపల్లి, ఎల్లంపల్లి, కేశవపట్నం మండలం తాడికల్, మెట్‌పల్లి, తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్, పోరండ్ల, గన్నేరువరం మండలం చాకలివానిపల్లి గ్రామంలో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని తెలిపారు. 18 ఏళ్ల పైబడిన వారందరూ దృష్టిని పరీక్షించుకొనుటకు దగ్గరలోని కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎంకు ఘనస్వాగతం.. సన్మానం

- నాచుపల్లి జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో సీఎం దిగగానే.. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు ఘనస్వాగతం పలికారు.
- బస్సు నుంచి దిగాక.. ప్రధాన ఆలయంలోకి ప్రధాన పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.
- అనంతరం ఆలయ పరిసరాలను సీఎం కలియ తిరిగారు. ప్రతీ నిర్మాణం గురించి వాస్తు నిపుణులను అడిగారు.
- ఇక ఆలయ మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించి మ్యాపులను స్వయంగా పరిశీలించారు. అందులోని పలు నిర్మాణాల విషయంలో సూచనలు చేశారు.
- దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సుంకెరవిశంకర్ ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించారు. కొండగట్టు ఆలయ చిత్రాన్ని బహూకరించారు.



సీఎం కేసీఆర్‌కు అంజన్న చిత్రపటం అందిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ఇక అంజనాద్రిగా కొండగట్టు

యాదాద్రి తరహాలో అభివృద్ధి, పునర్నిర్మాణం



అంజన్నకు మొక్కులు చెల్లించుకుని బయటకు వస్తున్న సీఎం కేసీఆర్

- ఆలయాభివృద్ధి ఖర్చుకు వెనకాడనన్న సీఎం
- పనులు పూర్తయ్యే వరకు వస్తూనే ఉంటా
- భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగవద్దు
- మాల విరమణ దీక్షాపరులకు ప్రత్యేక సదుపాయాలు
- కాటేజీల నిర్మాణానికి ముందుకు వచ్చిన మంత్రి గంగుల
- రెండుగంటలు ఆలయాభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్ష

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కొండగట్టు: యాదాద్రి తరహాలో కొండగట్టు పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం కేసీఆర్ అన్నారు. బుధవారం కొండగట్టు ఆలయం అభివృద్ధి, విస్తరణ మాస్టర్‌ప్లాన్ తదితరాలపై నిర్వహించిన సుదీర్ఘ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని పలు సూచనలు చేశారు. ఉదయం 11 గంటల సమయంలో హెలీక్యాప్టర్‌లో కొండగట్టుకు వచ్చిన సీఎం.. జేఎన్టీయూ హెలీప్యాడ్ నుంచి నేరుగా బస్సులో నేరుగా ప్రధానాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- ఉదయం 11.25 నుంచి 12.05 గంటల వరకు జరిగిన పూజల్లో పాల్గొన్నారు.
- మ.12.15 గంటల నుంచి మ.2.20 నిమిషాల వరకు ఆలయం, పరిసరాల్లో భక్తుల కోసం కల్పించాల్సిన సౌకర్యాలపై పండితులు, వాస్తు, ఇంజినీరింగ్ నిపుణులు, మిషన్‌భగీరథ, అటవీ, పర్యాటక శాఖ, దేవాదాయ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.
- ఆలయ అభివృద్ధికి ఖర్చు విషయంలో వెనకాడేది లేదని, ఇప్పుడు విడుదల చేసిన రూ.100 కోట్లకు మరో రూ.1000 కోట్లయినా ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని సీఎం స్పష్టంచేశారు. ఆగమశాస్త్రం ప్రకారం.. వాస్తు నియమాలకు అనుగుణంగా యాదాద్రి తరహాలో అంజనాద్రిగా తీర్చిదిద్దడమే ధ్యేయమని స్పష్టం చేశారు.

క్యూలైన్లు విస్తరించాలి..

సమావేశం ప్రారంభంలోనే.. దేవాలయాన్ని భక్తుల అవసరాలకు అనుగుణంగా విస్తరించడానికి సేకరించాల్సిన భూములు, సంబంధించిన అంశాలపై లొకేషన్ మ్యాపులను సీఎం పరిశీలించారు. వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధిని చేపట్టనున్నట్లు స్పష్టంచేశారు. శని, మంగళ వారాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు విస్తరించాలన్నారు.

- భక్తుల కోసం గుట్ట మీద కాటేజీల నిర్మాణానికి దాతలను ఆహ్వానించాలన్నారు. ఇప్పటికే శ్వేత గ్రానైట్స్ వారు నిర్మించిన కాటేజ్.. విస్తరణలో పోతున్నందున దాన్ని తిరిగి నిర్మిస్తామని మంత్రి గంగుల కమలాకర్ ముందుకు వచ్చారు. అందుకు తగిన స్థలాన్ని కేటాయించాలని కోరారు. మంత్రి చొరవను సీఎం అభినందించారు. కళ్యాణ కట్ట దగ్గర పుష్కరిణీలు ఏర్పాటు చేయాలన్నారు. కల్యాణ కట్ట పుష్కరిణి పక్కపక్కన ఉండటంతోపాటు స్త్రీలు, పురుషులకు ప్రత్యేక పుష్కరిణులు ఏర్పాటు చేయాలన్నారు. కొండగట్టులోని అటవీ సంపదను పరిరక్షించేలా బందీపూర్ అభయారణ్యం తరహాలో గుట్టపై అడవిని వృద్ధి చేయాలన్నారు. ఆలయ స్థల పురాణం పుస్తకాలను ముద్రించాలని, రాష్ట్రంలోని అన్ని ఆలయాల స్థల పురాణ పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో కొండపైకి వచ్చే వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఘాట్‌రోడ్డును విస్తరించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.
- సమీక్ష సమావేశంలో మంత్రులు, కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ దివకొండ దామోదర్ రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, బాల్క సుమన్, జీవన్ రెడ్డి, సంజయ్, కె.విద్యాసాగర్ రావు, కోరుకంటి చందర్, మండలి చీఫ్ విప్ భాను ప్రసాద రావు, ఎమ్మెల్సీ ఎల్.రమణ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్, కలెక్టర్ యాస్మిన్ భాషా, ఆలయ స్థపతి ఆనందర్ సాయి, వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ, ఆలయ ఈఓ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మీడియాకు, భక్తులకు నో ఎంట్రీ..!

సీఎం పర్యటన సందర్భంగా గుట్టపైన భద్రత కట్టుదిట్టం చేశారు. కేవలం కొండగట్టులో పనిచేసే దేవాదాయ, శానిటేషన్ సిబ్బంది మినహా గుట్టపై వ్యాపారులను సైతం అనుమతించలేదు. భక్తులకు గుట్ట మీదకు ప్రవేశం లేదన్న సంగతి తెలియక మధ్యాహ్నం వరకు కిందనే ఇబ్బందులు పడ్డారు. చివరికి మీడియాకు సైతం ప్రవేశం లేకపోవడం గమనార్హం. మంగళవారం సాయంత్రమే గుట్టపై ఉన్న వారిని ఖాళీ చేయించారు. రాత్రి నుంచి గుట్టను పోలీసులు పూర్తిగా స్వాధీనంలోకి తీసుకున్నారు. ఎస్పీ భాస్కర్ నేతృత్వంలో దాదాపు 2,000 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఐజీ రమేశ్‌నాయుడు, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, మరో ఇద్దరు ఎస్పీలు, 20 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 150 మంది ఎస్సైలు ఇతర అధికారులు పాల్గొన్నారు. ముందు రోజు అర్ధరాత్రి వరకు సీఎం కార్యదర్శి స్మితాసబర్వాల్, కలెక్టర్ యాస్మిన్ భాషా కొండపై సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

అంజన్న ఆలయ అభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయం

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



సుంకె రవిశంకర్

కొండగట్టుకు సీఎం కేసీఆర్ వచ్చి వెళ్లడం చాలా సంతోషమని.. సూర్యచంద్రులు ఉన్నంత వరకు చంద్రశేఖరుడుంటాడని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. 600 నుంచి వెయ్యి కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కొండగట్టు ఆలయం చరిత్రలో నిలిచిపోయేలా చేయడం ఆనందంగా ఉందన్నారు. పదిరోజుల్లో కరీంనగర్ వచ్చి ఆలయానికి మరోసారి కేసీఆర్ రానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సీఎం సారొచ్చారని..

- భక్తులకు కొండపైకి అనుమతి ఇవ్వని అధికారులు
- దిగువ కొండగట్టులో హనుమాన్ విగ్రహానికి మొక్కులు

ముఖ్యమంత్రి కేసీఆర్ కొండగట్టు పర్యటన సందర్భంగా పోలీసుల, అధికారుల ఆంక్షలతో సాధారణ భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. బుధవారం ఉదయం నుంచే పోలీసులు కొండగట్టును మొత్తం తమ ఆధీనంలోకి తీసుకోగా.. కొండపైకి ఇతరులను, భక్తులను అనుమతించలేదు. దిగువ కొండగట్టులో బారికేడ్లు ఏర్పాటు చేసి కొండపైకి వెళ్లేవారిని అడ్డుకున్నారు. సీఎం పర్యటన విషయం తెలియక అంజన్న దర్శనానికి కొండగట్టు వచ్చిన భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నపిల్లలు ఎండకు అలమటించారు. అంజన్న దర్శనానికి అవకాశం లేకపోవడంతో దిగువ కొండగట్టు బస్టాండు వద్ద ఉన్న హనుమాన్ విగ్రహానికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించి.. వెనుదిరిగారు.



భక్తులు కొండపైకి వెళ్లకుండా పోలీసు బందోబస్తు



హనుమాన్ విగ్రహానికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

తీగల వంతెనకు తళుకులు

- నేడు డైనమిక్ లైటింగ్ పనులను ప్రారంభించనున్న మంత్రి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మానేరు నదిలో రూపుదిద్దుకున్న తీగల వంతెన త్వరలో కొత్త సొబగులు అద్దుకోనుంది. ఈ వంతెనకు సంబంధించి పనులన్నీ పూర్తయ్యాయి. చివరగా అప్రోచ్ పనులు కూడా తుది అంకానికి చేరుకున్నాయి. వంతెనను మార్చి 15 తరువాత ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం మంత్రి గంగుల కమలాకర్ కేబుల్ వంతెనపై లైటింగ్ పనులను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్ హాజరవ్వాల్సి ఉండగా.. అనివార్య కారణాలతో రావడం లేదు. రూ.180 కోట్ల బడ్జెట్‌తో పూర్తిగా అధునాతన ఇంజినీరింగ్ టెక్నాలజీతో ఈ వంతెన రూపుదిద్దుకుంది. రూ.8 కోట్లతో చైనా డైనమిక్ లైటింగ్ సిస్టమ్‌తో ఈ వంతెన తళుకులీననుంది. త్వరలోనే పూర్తిస్థాయి రాకపోకలు ప్రారంభించనున్న నేపథ్యంలో నెలాఖరున లేదా మార్చినెలలో వంతెనను ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. నెలరోజుల్లోపు లైటింగ్ పనులు పూర్తవుతాయని, ఆ వెంటనే వంతెన ప్రారంభోత్సవం ఉంటుందని వివరించారు. అదే విధంగా మానేరు రివర్ ఫ్రంట్‌లో భాగంగా కొరియన్ టెక్నాలజీతో ఏర్పాటు చేయనున్న ఫౌంటేన్ పనులు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని అధికారులు స్పష్టంచేశారు.

ఎనిమిది వేలకు చేరిన పత్తి ధర



జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట మార్కెట్‌లో బుధవారం క్వింటాల్ పత్తి ధర రూ.8,000 చేరింది. మార్కెట్‌కు 107 వాహనాల్లో 1,613 క్వింటాళ్ల పత్తి ని రైతులు అమ్మకానికి తీసుకురాగా గరిష్ట ధర రూ.8,000, మోడల్ ధర రూ.7,800, కనిష్ట ధర రూ.7,300 చెల్లించారు. గన్నీ సంచుల్లో 8 మంది రైతులు 23 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,500, మోడల్ ధర రూ.7,000, కనిష్ట ధర రూ.6,000 పలికింది.

మార్చి 31 నుంచి స్మార్ట్‌కార్డుల నిలిపివేత

మానకొండూర్: రేణికుంట టోల్‌గేట్ ద్వారా జారీ చేసిన స్మార్ట్ కార్డు సేవలను మార్చి 31 నుంచి నిలిపివేస్తున్నట్లు రహదారి నిర్వహణ సంస్థ హెచ్‌కేఆర్ ప్రతినిధులు తెలిపారు. స్మార్ట్ కార్డుకు బదులుగా ఫాస్ట్ ట్రాక్‌ను ప్రతి ఒక్కరూ మార్చుకోవాలని సూచించారు. ఈ సేవలు టోల్‌గేట్‌కు 20 కిలోమీటర్ల లోపు ఉన్న వారికే వర్తిస్తాయని తెలిపారు. ఫ్రీ ఫాస్ట్ ట్రాక్ కోసం హెచ్‌కేఆర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

జాడలేని ఫీజు నియంత్రణ చట్టం

- ప్రైవేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యం
- అధిక ఫీజుల వసూలుపై చర్యలు శూన్యం
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ



‘పాఠశాల స్థాయిలో ఫీజు నియంత్రణ చట్టం ఉన్నా అమలుకు నోచుకోకుండా ఏళ్లు గడిచిపోతున్నాయి. చట్టం తమ చుట్టం అన్నట్లుగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులను దోచుకుంటున్నాయి. తల్లిదండ్రుల అమాయకత్వం, అవసరాలను ఆసరాగా చేసుకుని అందినకాడికి దండుకుంటున్నాయి. విద్యాసంస్థల నిర్వాహకులు కొద్దిమంది ఆయా పార్టీల్లో చలామణి అవుతుండడంతో వారు అడిందే ఆట.. పాడిందే పాటగా తయారైందని చెప్పవచ్చు. మరికొంత మందికి రాజకీయ, ధనబలం అండగా ఉండడంతో ఫీజు నియంత్రణపై సంబంధిత విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేయడంపై తల్లిదండ్రులు, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నుంచి సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.’

కరీంనగర్: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతీ విద్యార్థికి విద్యనందించాలి. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించి ఉచితంగా నిర్బంధ విద్య అమలు చేయాలి. ప్రభుత్వ స్కూళ్లలో ఉచితంగా చదువుతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు ఉన్నాయి. ఉన్నత చదువులైన ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులకు ప్రభుత్వమే ఫీజులు నిర్ణయిస్తుంది. అయితే పాఠశాల స్థాయిలో ఫీజు నియంత్రణ లేక ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని 1,100 పైగా ఉన్న ప్రైవేట్ స్కూళ్లలో దాదాపు 3 లక్షలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. చట్టం అమలు కాకపోవడంతో నిర్వాహకులు సూచించిన విధంగానే తల్లిదండ్రులు ఫీజులు కడుతూ తమ జేబులను గుల్ల చేసుకుంటున్నారు.

ఊసేలేని గవర్నింగ్ బాడీ..

- ట్రస్టు పేరుతో పాఠశాలను ఏర్పాటు చేస్తేనే ఆ విద్యాసంస్థకు ప్రభుత్వ గుర్తింపు లభిస్తుంది. అలా ఏర్పాటైన పాఠశాలకు తప్పనిసరిగా గవర్నింగ్‌బాడీని ఏర్పాటు చేయాలి.
- ట్రస్టు చైర్మన్, కరస్పాండెంట్, హెచ్‌ఎం, టీచర్, పేరెంట్‌తో గవర్నింగ్ బాడీని నియమించి, ఏయే తరగతులకు ఎంత ఫీజు తీసుకోవాలి. అర్హత మేరకు ఉపాధ్యాయులకు జీతం ఎంత చెల్లించాలనే నిర్ణయించాలి. దీని ప్రకారం ఉపాధ్యాయుల జీతభత్యాల చెల్లింపు, ఫీజుల వసూలు జరగాలి.
- అయితే ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. ఒక్క కరీంనగర్ పట్టణంలోనే ప్రైవేట్, కార్పొరేట్ కలిపి దాదాపు 200 వరకు పాఠశాలలున్నాయి.
- కొన్ని స్కూళ్లలో పేపర్‌పై మాత్రమే గవర్నింగ్ బాడీని చూపించి, మిగిలిన అన్ని పనులను యాజమాన్యమే చక్కదిద్దుకుంటోంది. అలాగే ప్రతీ స్కూల్‌లో తరగతి వారీగా ఫీజు వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలి. ఉపాధ్యాయుల అర్హతలు కూడా పొందుపరచాలి.
- కాగా చాలా స్కూళ్లలో ఫీజు పట్టిక ఏర్పాటు చేయడం లేదు. ఫీజు నియంత్రణ బాధ్యత అధికారులదేనన్న భావన తల్లిదండ్రుల్లో నెలకొంది.
- విద్యార్థుల తల్లిదండ్రులు బాధ్యతగా ప్రశ్నించడం మొదలు పెడితే అధిక ఫీజులను నియంత్రించవచ్చని విద్యావేత్తలు చెబుతున్నారు.
- జిల్లాస్థాయి ఉన్నతాధికారుల నుంచి అటెండర్ వరకు, అన్ని విభాగాల అధికారులు అత్యధిక శాతం వారి పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. ఫీజు నియంత్రణ అంశంపై సాధారణ ప్రజలకు తెలియకపోవడం సాధారణం.
- కాగా విద్యావంతులైన అధికారులకు ఫీజు నియంత్రణ చట్టంపై కొంత వరకైనా అవగాహన ఉంటుంది. అయినా వారు నోరు మెదపకపోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ధారాదత్తం చేయడానికే...

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో అత్యధిక భాగం రాజకీయ నాయకులు, ప్రముఖులవే కావడంతో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయడం లేదంటూ విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. పైగా విద్యారంగాన్ని కార్పొరేట్‌కు ధారాదత్తం చేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వం వీటిపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న పవిమర్శలున్నాయి. ఈ నేపథ్యంలోనే అధికారులు సైతం చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. గుర్తింపు, ఇతరత్రా సర్టిఫికెట్లు, వసతులు లేకున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

చట్టాన్ని అమలు చేయాలి



ఫీజు నియంత్రణ చట్టం ఉందన్న విషయం చాలా మందికి తెలియదు. రాజకీయ, ధన బలంతో చట్టాన్ని అమలు చేయడం లేదు. అమలు చేయాలని పోరాడుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదు. ఫీజు నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తారన్న నమ్మకం కలిగేలా జిల్లా విద్యాశాఖ యంత్రాంగం చర్యలు చేపట్టాలి. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న పాలకుల వైఫల్యం వల్లే విద్యావ్యవస్థ చిన్నాభిన్నమవుతుంది.
– మల్యాల రాకేష్,
ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్

మార్కెట్‌ను బట్టి జీవనోపాధి మెరుగు

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



మాట్లాడుతున్న గరిమా అగర్వాల్

కరీంనగర్ అర్బన్: మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి గ్రామీణ ప్రాంత మహిళల వ్యాపారాలుండాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని స్వశక్తి సంఘ సభ్యులు వారి జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలని సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వశక్తి సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. డీఆర్డీఏ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న స్వశక్తి సంఘ సభ్యులు వారి జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలని, ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఎంటర్ ప్రైజేస్ ద్వారా యూనిట్లను గ్రౌండింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. అంతే కాకుండా న్యూ ఎంటర్ ప్రైజేస్‌ల ద్వారా వారి ఆదాయాలను పెంచడం జరుగుతుందన్నారు. కొత్త కొత్త జీవనోపాధులను గుర్తించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో మార్పులు తీసుకురావాలన్నారు. సమావేశంలో డీఆర్డీఓ శ్రీలతారెడ్డి, పరిశ్రమల అభివృద్ధి అధికారి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూలో వన్ డే వర్క్‌షాప్



మాట్లాడుతున్న వీసీ మల్లేశ్

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): శాతవాహన విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బుధవారం వన్‌డే వర్క్‌షాప్ ఆన్ ప్రాజెక్టు రిపోర్టు ప్రిపరేషన్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ మల్లేశ్ హాజరై మాట్లాడారు. గ్రాడ్యుయేషన్ స్థాయిలో బీకాం విద్యార్థులకు పరిశోధనకు సంబంధించిన ప్రాథమిక అంశాల బోధనలో మెలకువలు, ప్రాజెక్టు రిపోర్టు ప్రిపరేషన్ యొక్క ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు ఈ ప్రాజెక్టుల వల్ల సమాజ పరిస్థితులు ముఖ్యంగా మార్కెట్ పరిస్థితులను సులువుగా అర్థం చేసుకుంటారని, కాబట్టి అధ్యాపకులు మార్గనిర్దేశకులుగా విద్యార్థులకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులందరికీ పరిశోధన, రిపోర్టు ప్రిపరేషన్‌కు సంబంధించి ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీరంగప్రసాద్, హరికాంత్, అమ్లక్‌సింగ్, వన్నాల రమేష్, పురుషోత్తం, తిరుపతి, మనోహర్, అనూష, మనోజ్ కుమార్, నరేష్, క్రిష్ణకుమార్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాలో మార్పులు

- వారం రోజుల వ్యవధి
- అన్నదాతలకు సత్వర ప్రయోజనం

కరీంనగర్ అర్బన్: అన్నదాత కుటుంబానికి సత్వర సేవలందేలా ప్రభుత్వం రైతు బీమా నిబంధనలను మార్చింది. రైతు కుటుంబాలను ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన బీమా పథకంలో వ్యవసాయశాఖ పలు మార్పులు చేపట్టింది. పరిహారం చెల్లింపులో పారదర్శకత పాటించేందుకు మార్పులు అవసరమని వస్తున్న విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అధికారులు వెల్లడించారు. మరింత వేగంగా బాధిత కుటుంబాలకు బీమా సొమ్ము అందించేందుకు ‘ఆన్లైన్ డెత్ సీస్ రికార్డర్’ పద్ధతిని ప్రవేశపెట్టింది. మారిన నిబంధనలతో బాధిత రైతు కుటుంబాలకు స్వాంతన చేకూరే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో రైతు బీమా పరిధిలో 1,28,940 మందిని గుర్తించారు.

RYTHU BIMA

గత మూడు నెలల్లో 20 మంది రైతులు మృతి చెందితే బాధిత కుటుంబాలకు బీమా పరిహారం అందజేశారు.

జాప్యం చేస్తే కఠినచర్యలు

18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న రైతులు పథకానికి అర్హులు. బీమా పరిహారం కోసం రైతుల తరఫున ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుంది. రైతు ప్రమాదవశాత్తు లేదా అనారోగ్యం తదితర కారణాలతో మృతిచెందితే రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల బీమా ఆర్థికసాయం అందిస్తోంది. ప్రస్తుతం మారిన నిబంధనల ప్రకారం రైతు మరణిస్తే అందుకు సంబంధించి అదే రోజు లేదా మరుసటి రోజు గ్రామ, మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారుల వద్ద రైతు బీమా దరఖాస్తులను పూర్తి చేసి ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో పాటు మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్ నకలు, నామినీ వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు డెత్ సీస్ రికార్డులో లోడ్ చేయాలి. బాధిత కుటుంబాల ద్వారా ఈ వివరాలన్నింటినీ అధికారులే సేకరించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కేవలం వారం రోజుల వ్యవధిగా నిర్ణయించారు. లేని పక్షంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఏవో, ఏఈవోలు రాష్ట్ర కమిషనరేట్‌కు సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుంది. కాగా కర్షకుడు మృతి చెందితే రైతు బీమా పరిహారం చెల్లింపుల్లో మార్పులు చేశారు. గ్రామాల్లోని వ్యవసాయ శాఖ అధికారి ఏవో, ఏఈవో అధికారులు వారి పరిధిలో రైతు మరణిస్తే వారి వివరాలు సేకరించి వారంలోగా పరిహారం అందించే ఏర్పాట్లు చేస్తారని అధికారులు వివరించారు.

క్లుప్తంగా

తిమ్మాపూర్ సీఐగా రమేశ్ బాధ్యతల స్వీకరణ


సీఐ రమేశ్‌కు స్వాగతం పలుకుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

మానకొండూర్: తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వర్ష రమేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన శశిధర్‌రెడ్డి ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. నిర్మల్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న రమేశ్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. నూతన సీఐకి సీఐ శశిధర్ రెడ్డి తో పాటు ఎల్ఎండీ, గన్నేరువరం ఎస్సైలు ప్రమోద్‌రెడ్డి, సురేందర్, సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

కేంద్రం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

కరీంనగర్: గుజరాత్ అల్లర్లపై సంచలనాత్మక డాక్యుమెంటరీ రూపొందించిన బ్రిటిష్ బ్రాడ్కాస్టింగ్ కంపెనీ (బీబీసీ)పై మోదీ సర్కార్ ప్రతీకార చర్యలకు దిగడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి ప్రకటనలో అన్నారు. బీబీసీలో పనిచేస్తున్న సిబ్బంది ఫోన్లను, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకోవడం అంటే పత్రికా స్వేచ్ఛను, రాజ్యాంగ హక్కులను కాలరాయడమే అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల్ని విమర్శిస్తే ప్రతీకార ధోరణితో కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలు దాడులకు దిగడం శోచనీయమన్నారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. జర్నలిస్టులు, మీడియా సంస్థల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. స్వతంత్ర మీడియాను బెదిరించే సాధనాలుగా కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నదని దీనిని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ఇలాగే ప్రతీకార దాడులు జరిగితే రాబోయే ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


మానస

చొప్పదండి: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయానికి చెందిన విద్యార్థిని జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. గురుకులానికి చెదిన తమ్మడి మానస బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో భాగంగా నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ స్వాతి తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో మానసను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ శారద, కమిటీ చైర్మన్ సంబోజి శేఖర్, విజయ్, అజయ్, కుమార్, సత్తయ్య, వెంకటేశ్, శంకర్, లిఖిత, సంపత్, సదానందం, లచ్చయ్య పాల్గొన్నారు.

మనఊరు– మనబడి పనులు త్వరగా పూర్తిచేయండి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలంలోని మల్యాల ప్రాథమిక పాఠశాలను బుధవారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సందర్శించారు. పాఠశాలలో కొనసాగుతున్న మన ఊరు– మన బడి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావును ఆదేశించారు. పాఠశాలలో బోధన అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కాగా అదనపు కలెక్టర్ స్వయంగా కాలమానిని గుర్చి బోర్డుపై రాసి సమయాన్ని ఎలా చెప్పాలో విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆయిల్ పామ్ తోటలు, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురకుంట్ల సాంబయ్య, మండల ఇన్‌చార్జి విద్యాధికారి శ్రీనివాస్, జిల్లా సెక్టోరల్ అధికారి ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయులు విజేందర్‌రెడ్డి, రవీందర్, ఏఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఎదుర్కొనేందుకు శక్తులన్నీ ఏకం

- పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్


మాట్లాడుతున్న ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్

కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయని, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఎంఐఎం పార్టీలు ఓకే గూటి పక్షులని అర్థమవుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బలమైన శక్తిగా అవతరించిన బీజేపీని ఎదుర్కోవడానికి ఈ శక్తులన్నీ ఏకమవుతున్నట్లు స్పష్టంగా కనబడుతుందన్నారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సందర్భంగా వ్యవహరించిన తీరు, శాసనమండలి ఎన్నికల సందర్భంగా వ్యవహరిస్తున్న తీరు చూస్తే రాజకీయాలు ఏ విధంగా నడుస్తున్నాయో అందరూ గ్రహించారన్నారు. శాసనసభలో కేటీఆర్, ఎంఐఎం ఓవైసీల కుస్తీలు, బయట దోస్తానాలు ఏంటో అందరికీ తెలిసిన విషయమే అన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేయడానికి, ప్రజల్లోకి విస్తృతంగా పార్టీని తీసుకెళ్లడానికి, కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలు, మోదీ ప్రభుత్వం పనితీరును, పథకాలను విజయాలను ప్రజలకు వివరించడానికి తలపెట్టిన శక్తి కేంద్ర స్ట్రీట్ కార్నర్ సమావేశాలకు అపూర్వ స్పందన లభిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని శక్తి కేంద్రాల్లో ఈ ప్రోగ్రాం విజయవంతం చేయడానికి బీజేపీ శ్రేణులందరూ సమష్టి కృషి చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కొరటాల శివరామకృష్ణయ్య, బోయినపల్లి ప్రవీణ్‌రావు, మేకల ప్రభాకర్‌యాదవ్, ఎర్రబెల్లి సంపత్‌రావు, మాడ వెంకట్‌రెడ్డి, రంగు భాస్కరాచారి, మాడుగుల ప్రవీణ్, పుప్పాల రఘు, జాడి బాల్‌రెడ్డి, ఎడమ సత్యనారాయణరెడ్డి, దుబాల శ్రీనివాస్, ముత్యాల జగన్, వరాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సదస్సును జయప్రదం చేయండి

కరీంనగర్: జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19న స్థానిక వాగేశ్వరీ డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటలకు నూతన జాతీయ విద్యావిధానం అంశంపై జరిగే విద్యాసదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు పోరెడ్డి దామోదర్ రెడ్డి, యాంసాని ఉమారాణి, చంద్రశేఖర్, తూముల తిరుపతి ప్రకటనలో పిలుపునిచ్చారు. సదస్సులో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్, విద్యాపరిరక్షణ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. అలాగే భాగస్వామ్య సంఘాలు డీటీఎఫ్, టీపీటీఎఫ్, విద్యార్థి సంఘాల జిల్లా, రాష్ట్ర ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన భాగస్వామ్య సంఘం, ఉపాధ్యాయ మిత్రులు, విద్యార్థులు, విద్యాభిలాషులు అధిక సంఖ్యలో హాజరై సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పాలిటెక్నిక్ స్పోర్ట్స్‌మీట్‌లో ‘వాగేశ్వరి’ విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మానకొండూర్: మండలంలోని రామకృష్ణ కాలనీలో గల వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు సూర్యపేట జిల్లా కోదాడలోని ఎస్‌బీటీఈటీ కళాశాలలో నిర్వహించిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబర్చారని కళాశాల ప్రధాన కార్యదర్శి గంద్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సెకండియర్ చదువుతున్న శివాని డిస్కస్‌త్రోలో ద్వితీయ బహుమతి గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయి స్పోర్ట్స్‌మీట్‌కు ఎంపికైనట్లు వెల్లడించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివానిని అభినందించారు. జాతీయ పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు విశ్వనాథ్, సీహెచ్.ప్రకాశ్‌రెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం


అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రం శివారులోని రైస్ మిల్ ఆవరణలో బుధవారం రుద్రంగి నుంచి మానాలకు వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. పక్కనే ఉన్న మట్టిలో దిగబడి ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. సమీపంలోని శివస్వాములు కారును రోడ్డుపైకి లాగారు.

రామంచ విద్యార్థుల సాహసయాత్ర


హర్యానా విద్యార్థులతో రామంచ విద్యార్థులు

చిగురుమామిడి(హుస్నాబాద్): మండలంలోని రామంచ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు మూడురోజులుగా హర్యానా రాష్ట్రంలో సాహస యాత్ర చేస్తున్నారు. విద్యార్థి బృందానికి హిందీ ఉపాధ్యాయుడు షరీఫ్ అహ్మద్ నేతృత్వం వహించారు. ఇందులో భాగంగా బుధవారం హర్యానాలోని పల్వాల్ జిల్లా ఘడుపురి ప్రాథమిక పాఠశాల, సీనియర్ సెకండరీ పాఠశాలను సందర్శించారు. అక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, జీవన స్థితిగతులు, విద్యావిధానం అడిగి తెలుసుకున్నారు. అక్కడి విద్యార్థులతో రామంచ విద్యార్థులు విష్ణువర్ధన్‌రెడ్డి (7వ తరగతి), శ్రీరామ్‌రెడ్డి, రిషిత్‌రెడ్డి, చరణ్‌తేజ్, విష్ణు, మణిదీప్ (8వ తరగతి) ఆడిపాడారు. హర్యానా భాష నేర్చుకునే ప్రయత్నం చేశారు. అలాగే ఇక్కడి విద్యార్థులు వారికి తెలుగుభాష నేర్పించే ప్రయత్నం చేయడం అభినందనీయం.

దళితబంధుతో ఆర్థికంగా బలోపేతం


సాంబారి కొమురయ్య

చిగురుమామిడి(హుస్నాబాద్): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని, అదే స్ఫూర్తితో దళితుల బతుకులను ఉద్ధరించేందుకు దళితబంధు పథకాన్ని అమలు చేసి చూపించిన ఘనత సీఎంకే దక్కిందని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడు సాంబారి కొమురయ్య అన్నారు. బుధవారం చిగురుమామిడిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో దళితుల బతుకులు కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. దళితబంధు పథకాన్ని హుజురాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా అమలు చేసి చూపించారని, దళితుల గుండెల్లో సీఎం కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అలాగే రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఇప్పటికే ప్రతీ గ్రామానికి 100 కుటుంబాలకు దళితబంధు పథకం అమలయిందని పేర్కొన్నారు. సీఎం పాలనపై ప్రతి పక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో దాదాపు కోటి ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ నేతృత్వంలో నియోజకవర్గం కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తోందని, త్వరలో గౌరవెల్లి ప్రాజెక్టు ప్రారంభం కానుందని పేర్కొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

జమ్మికుంట(హుజూరాబాద్): మండలంలోని వావిలాల గ్రామంలో కులం పేరుతో దుషించాడని బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రామచందర్‌రావు తెలిపారు. పోలీసుల వివరాలు.. వావిలాల గ్రామానికి చెందిన దార అనిల్‌ను అదే గ్రామానికి చెందిన మామిడి లచ్చయ్య ఈ నెల 13న రాత్రి కులం పేరుతో దుషించి, దాడి చేశాడని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

జాతీయస్థాయి జూడో పోటీల్లో సత్తా చాటాలి


క్రీడాకారులతో వైద్యుడు బంగారుస్వామి తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: తమిళనాడులో జరుగనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్స్, కెడెట్ బాలబాలికల జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్లు సత్తాచాటి బంగారు పతకాలు సాధించాలని రెనే హాస్పిటల్స్ చైర్మన్, ప్రముఖ వైద్యుడు బంగారుస్వామి అన్నారు. జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జూడో జట్ల క్రీడాకారులకు బుధవారం కరీంనగర్‌లోని రెనే హాస్పిటల్స్ ఆవరణలో జెర్సీలు అందజేసి మాట్లాడారు. తాను స్వతహాగా జాతీయ క్రీడారుడని క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జూడో జట్లకు క్రీడా దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడా హబ్‌గా మారిందని భవిష్యత్‌లో క్రీడారంగానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. క్రీడలతో పాటు విద్యలోనూ రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, జాతీయ పోటీల్లో పాల్గొనే 45 మంది క్రీడాకారులకు, కోచ్‌లకు, మేనేజర్‌లకు జెర్సీలు అందజేసినందుకు బంగారిస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల రమేష్‌రెడ్డి, నిరంజనాచారి, రెనే హాస్పిటల్స్ నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


మాట్లాడుతున్న వీసీ మల్లేశ్

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): శాతవాహన యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మల్లేశ్ హాజరై మాట్లాడారు. సంత్ సేవాలాల్ తన జీవితాన్ని బంజారాలకు అంకితం చేశారని, బంజారాలు క్రమశిక్షణ, ఆధ్యాత్మిక భావాలు, పరస్పర సహకారంతో కలిసి మెలిసి ఉండడానికి కొన్ని సూత్రాలను సూచించారన్నారు. ఆయన పాటించిన విధానాలను నేటి సమాజంలోని ప్రజలంతా అవలంబిస్తే వారి జీవితం సమర్థవంతంగా ముందుకు సాగుతుందని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ, ప్రజలంతా సేవా దృక్పథంతో, మంచి అలవాట్లు కలిగి ఉండాలన్నారు. సేవాలాల్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను విద్యార్థులకు వివరించారు. సభకు అధ్యక్షత వహించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ జాఫర్ మాట్లాడుతూ, సమాజం కోసం, బంజారాల జీవితం కోసం సేవాలాల్ చేసిన కృషి వల్లే నేడు వారి హక్కులను కాపాడుకోవడంలో సఫలీకృతులవుతున్నారని, విద్యార్థులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సమన్వయ అధికారి డాక్టర్ శ్రీవాణి, సైన్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ సరసుజా, డాక్టర్ నమ్రత, డాక్టర్ వందన, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పొలిటికల్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న పోలీసులు

- కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు


సమావేశంలో మాట్లాడుతున్న సునీతారావు

కరీంనగర్‌టౌన్: బీఆర్‌ఎస్ పాలనతో పోలీసులు పొలిటికల్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నా పోలీసులు, ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, రూ.500 కే వంట గ్యాస్ సిలిండర్, స్థలం ఉన్న నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు, తొమ్మిది రకాల నిత్యావసర సరుకులతో పాటు వడ్డీ లేని రుణాలు అందజేస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పదని ఇందుకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే నిదర్శనమన్నారు. మొదట హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా నగరంలోని పద్మనగర్ ఇండస్ట్రియల్ కాలనీలో గృహిణులకు రాహుల్‌గాంధీ సందేశాన్ని వివరించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, అందించిన ఫలాలను ప్రజలకు గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ వేల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై మోపుతున్నారని, దీని ప్రభావం మహిళలపై ఎక్కువగా ఉండటం వల్ల వారు మానసిక ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నీలం పద్మ, భారతమ్మ, సుశీల, పద్మ, లావణ్య, నేరెళ్ల కవిత, జక్కు సత్యలక్ష్మి, సునీత, శకుంతల, పూదరి రేణుక, అనూష, వేముల పుష్పలత, జ్యోతి, పద్మ, భవాని, స్వప్న, సుజాత, మల్లిక పాల్గొన్నారు.

డ్రోన్‌తో నానో యూరియా పిచికారీపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్నన శాస్త్రవేత్తలు

శంకరపట్నం(మానకొండూర్): డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ చేసుకోవాలని కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్ అన్నారు. మండలంలోని కొత్తగట్టు గ్రామంలో బుధవారం వరిపొలంలో డ్రోన్‌తో యూరియా పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ వినియోగంతో వరిలో ఎరువులు చల్లుకునేందుకు కూలీల ఖర్చు తక్కువ అవుతుందన్నారు. 25 ఎకరాల వరిపొలంలో డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఏఈవో శ్రావణి, కో ఆర్డినేటర్ తీగల రమేశ్, రైతులు పాల్గొన్నారు.

గన్నేరువరం మండలంలో..

గన్నేరువరం(మానకొండూర్): వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఖాసీంపేట గ్రామంలో అవగహన కార్యక్రమం నిర్వహించారు. 25 ఎకరాల్లో డ్రోన్ల సాయంతో నానో యూరియా పిచికారీ చేయడంపై ప్రదర్శన చేపట్టారు. శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ మహేష్, ఏవో కిరణ్మయి, ఆర్‌ఎస్‌ఎస్ మండల కోఆర్డినేటర్ బద్దం తిరుపతిరెడ్డి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, మానసాదేవి ఆలయ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, గ్రామ కోఆర్డినేటర్ జీల తిరుపతి, ఏఈవో అంజలి, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల ఆందోళన

కరీంనగర్‌టౌన్: జిల్లా ఆసుపత్రి సమీపంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందగా.. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి బంధువులు ఆందోళన చేపట్టిన ఘటన బుధవారం జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామానికి చెందిన ఎం. రాజేశ్ (32) ఈనెల 13న పాయిజన్ తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఏసియన్ ఆసుపత్రిలో చేర్పించారు. పేషెంట్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని చెబుతూ వైద్యులు రెండు రోజుల పాటు చికిత్స అందించారు. బాగానే ఉన్న వ్యక్తికి బుధవారం మధ్యాహ్నం హార్ట్ ఎటాక్ వచ్చిందని చెప్పి వెంటిలేటర్ అమర్చారని, డబ్బులు కట్టాలని ఒత్తిడి పెంచారన్నారు. ఆ తర్వాత చనిపోయాడని చెప్పారని వెల్లడించారు. చనిపోయిన తర్వాతే డబ్బుల వసూళ్లకు ప్రయత్నించారని మండిపడ్డారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే రాజేశ్ చనిపోయాడని ఆరోపిస్తూ ఆసుపత్రి ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఇదే విషయమై ఆసుపత్రి ఫిజీషియన్ డాక్టర్ శ్రీకర్‌ను వివరణ కోరగా.. పాయిజన్ తాగి ఆసుపత్రికి వచ్చిన రాజేశ్‌కు అప్పటికే మెదడుపై ప్రభావం పడిందన్నారు. మరుసటి రోజు ఊపిరితిత్తులపై ప్రభావం చూపించగా వెంటిలేటర్ అమర్చామని, విష ప్రభావం వల్లే బుధవారం మధ్యాహ్నం కార్డియాక్ అరెస్ట్ అయి మృతిచెందినట్లు తెలిపారు. వైద్యంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి


చంద్రయ్య(ఫైల్)


బోల్తాపడిన ఆటో

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కాచాపూర్ గ్రామశివారులో ఆటో బోల్తాపడి డ్రైవర్ నామని చంద్రయ్య అలియాస్ చందు (42) మృతిచెందాడు. ఎస్సై చంద్రశేఖర్ వివరాల ప్రకారం.. వీణవంక మండలం మల్లన్నపల్లి గ్రామానికి చెందిన నామని చంద్రయ్య ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గాజుల కుమార్ అలియాస్ బుజ్జికి ఆటో కొనుగోలు చేసేందుకు మంగళవారం వీణవంకకు చెందిన ఎస్‌కే అహ్మద్‌తో కలిసి కరీంనగర్ వెళ్లారు. తిరిగి రాత్రి స్వగ్రామం వస్తుండగా శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామశివారులో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చంద్రయ్యకు తీవ్రగాయాలైనాయి. వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించడంతో 108లో హుజురాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్‌ను విమర్శించే స్థాయి ఎంఐఎంకు లేదు


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్: బీఆర్ఎస్‌ను, ఎమ్మెల్యేలను విమర్శిస్తే ఊరుకోబోమని ఆ పార్టీ మైనారిటీ సెల్ నాయకులు హెచ్చరించారు. ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ దిష్టిబొమ్మను బుధవారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో యూసుఫ్ ఆధ్వర్యంలో దహనం చేశారు. బీఆర్ఎస్‌ను విమర్శించే స్థాయి ఎంఐఎంకు లేదని, గులాం అహ్మద్ హద్దుమీరి మాట్లాడటం మానుకోవాలన్నారు. కరీంనగర్ పట్టణంలో బీఆర్ఎస్‌పై విమర్శలు చేసి, అధిష్ఠానం వద్ద మార్కులు కొట్టేయాలని చూస్తున్న గులాం అహ్మద్ తన తీరు మార్చుకోవాలని సూచించారు. లేకపోతే కరీంనగర్‌లో తిరగనివ్వబోమన్నారు. నాయకులు సయ్యద్ అమ్జద్, అక్బర్‌హుస్సేన్, ఫాహద్, మీరజ్ అస్మద్, షౌకత్ అలీ, నవాజ్, నవాజ్ హుస్సేన్, ఇంతియాజ్, మున్నా, నయీమ్, మాజిద్, అఫ్జల్, ఆరిఫ్, సలీం, హసీఫ్, మాజిద్, జమీల్ పాల్గొన్నారు.

దారుస్సలాం చలువతోనే గంగులకు పదవి


మాట్లాడుతున్న ఎంఐఎం నాయకులు

విద్యానగర్: కరీంనగర్ దారుస్సలాం చలువతోనే గంగుల కమలాకర్ గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి పదవి పొందారని ఎంఐఎం నాయకులు అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ఎంఐఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 50 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తామని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన ప్రకటనతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కరీంనగర్ బీఆర్ఎస్ నేతల్లో అలజడి మొదలైందని పేర్కొన్నారు. ఎంఐఎంను కరీంనగర్‌లో బలోపేతం చేసేందుకు తమ పార్టీ కరీంనగర్ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో డివిజన్ సందర్శన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. దీనికి వస్తున్న ప్రజాదరణను చూసి, బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. నాయకులు అన్నేమల్ల సురేష్, కల్లేపల్లి బాలరాజు, సాజిద్ మాజిద్, ఎండీ సాజిద్ తదితరులున్నారు.

బీజేపీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి


మాట్లాడుతున్న కల్యాణ్

కరీంనగర్‌టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి, ప్రపంచంలోనే బలమైన శక్తిగా ఎదిగిందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కల్యాణ్ అన్నారు. బీజేపీ పశ్చిమ జోన్ 17వ డివిజన్‌లోని విద్యానగర్ కొత్త యాస్వాడలో శక్తి కేంద్రం అధ్యక్షుడు ధర్మారం వెంకటస్వామి అధ్యక్షతన బుధవారం స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అన్ని తెలంగాణగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలను కోరారు. బీజేపీ సర్కారు వస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. జోన్ అధ్యక్షుడు నరహరి, నాయకులు కొరటాల శివరామకృష్ణ, జానపట్ల స్వామి, శీతాల రమేశ్ చంద్ర, బండ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేవంత్ రెడ్డి పాదయాత్రలో జిల్లా నేతలు


రేవంత్‌రెడ్డితో నడుస్తున్న పొన్నం ప్రభాకర్, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, సత్యం

కరీంనగర్‌టౌన్: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సందేశాన్ని ప్రజలకు వివరిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి చేస్తున్న హాథ్ సే హాథ్ జోడో యాత్ర పాలకుర్తి నియోజకవర్గానికి చేరింది. బుధవారం కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి, పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం తదితరులు ఆయనతో పాదయాత్రలో పాల్గొన్నారు.

కురుమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మల్లేశం


కరీంనగర్ కల్చరల్: కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా కురుమ విద్యార్థి హాస్టల్ భవనానికి రూ.50 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మీస భీరయ్య, ప్రధాన కార్యదర్శి కడారి అయిలయ్య, నాయకులు ఎలుకపెల్లి లచ్చయ్య, కర్రె రాజు, రఘునందన్, పెద్ది ధర్మయ్య, దయ్యాల వీరయ్య, అజయ్‌కుమార్, కురుమగుంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఏఐఎఫ్‌బీ నాయకులు


సీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: పోలీసు కమిషనర్ సుబ్బారాయుడును ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి, నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజా సమస్యల పరిష్కారంలో తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోమటిరెడ్డి తేజదీప్ రెడ్డి, బండారి శేఖర్, ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్ రెడ్డి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పులిమాటి సంతోష్, కురువెళ్లి శంకర్, గొల్లపల్లి ప్రశాంత్, చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెద్దెల్లి శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

'పారమిత ఐరిస్' విద్యార్థుల ఔదార్యం



కరీంనగర్: అల్గునూర్‌లోని పారమిత ఐరిస్ స్కూల్ విద్యార్థులు వృద్ధులకు నెలకు సరిపడా సరుకులు అందించి, తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. తెలుగు పాఠ్యాంశంలో భాగంగా 9వ తరగతి విద్యార్థులు నగరంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో 15 కిలోల నూనె, సబ్బులు, అల్లం, వెల్లుల్లి, సర్ఫ్, పప్పులు, చింతపండు, చాయిపత్తి, పంచదార, పేస్టులు తదితరాలను అందజేశారు. విద్యార్థులను పారమిత విద్యాసంస్థల అధినేత ఈ.ప్రసాదరావు అభినందించారు. పాఠశాల డైరెక్టర్ ప్రసాద్, ప్రిన్సిపాల్ శ్రీకర్, సమన్వయకర్త నాగరాజు, ఆశ్రమ నిర్వాహకుడు వీరమాధవ్, తెలుగు ఉపాధ్యాయుడు జి.నాగరాజు, పీఈటీ తిరుపతి, టీచర్లు పాల్గొన్నారు.

ఫ్రీజింగ్‌లో ఖాతాలు | సర్పంచులు అప్పులపాలు

- ఏడు నెలలుగా అందని బిల్లులు
- పలు గ్రామాల్లో అర్ధంతరంగా నిలిచిన అభివృద్ధి పనులు
- కరీంనగర్ మండలానికి రావాల్సిన మొత్తం రూ.79.13 లక్షలు


బిల్లులు పెండింగ్ ఉన్న మొగ్దుంపూర్ గ్రామ సంత

కరీంనగర్‌రూరల్: గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాలపై రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీజింగ్ విధించడంతో సర్పంచులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు తెచ్చి, అభివృద్ధి పనులు చేస్తే బిల్లులు రాకపోవడంతో వడ్డీలు చెల్లించాల్సి పరిస్థితి నెలకొంది. పలు పల్లెల్లో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

పంచాయతీల పేరిట ఖాతాలు..

కరీంనగర్ మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటికి సంబంధించి గతంలో తీసిన బ్యాంకు ఖాతాల్లోనే రాష్ట్ర ఆర్థిక సంఘం, 15వ ఆర్థిక సంఘం నిధులు జమయ్యేవి. కేంద్ర ప్రభుత్వం ఐదు నెలల క్రితం ప్రత్యేకంగా ప్రతీ గ్రామ పంచాయతీల పేరిట బ్యాంకు ఖాతాలు తీయించి, నిధులు జమ చేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల మంజూరైన నిధులను పంచాయతీ అధికారులు సర్పంచులకు సమాచారం ఇవ్వకుండానే డ్రా చేసుకోవడం వివాదాస్పదంగా మారింది.

గతేడాది ఆగస్టు నుంచి ఇదే పరిస్థితి

ఇల్లు, నల్లా, ఇతర పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రతినెలా కార్యదర్శులు గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంటారు. ప్రభుత్వం గతేడాది ఆగస్టు నుంచి ఈ ఖాతాలపై ఫ్రీజింగ్ అమలు చేస్తోంది. దీంతో పలు గ్రామాల్లో చేపట్టిన సీసీరోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు బిల్లులు రాకపోవడంతో సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. పనులు పూర్తి చేసి, నెలలు గడుస్తున్నా తమ చేతికి రూపాయి అందలేదని, ఫలితంగా అప్పులపాలయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తెచ్చి, పనులు చేసి, వడ్డీ చెల్లిస్తున్నామని మరికొందరు వాపోతున్నారు. ఎస్టీవోకు పంపించిన చెక్కుల కాలపరిమితి మూడు నెలలు దాటడంతో తిరిగి పంపిస్తున్నారు. మొత్తం 17 గ్రామాలకు సంబంధించి ఇప్పటివరకు రూ.79.13 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, పంచాయతీ ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలని సర్పంచులు కోరుతున్నారు.

రూ.20 లక్షలు రావాలి

గ్రామంలో అభివృద్ధి పనులకు సంబంధించి రూ.20 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. సకాలంలో రాకపోవడంతో ఇతర పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం పంచాయతీల ఖాతాలపై ఫ్రీజింగ్ విధించడంతో చెక్కులు డ్రా కావడం లేదు. ఫ్రీజింగ్‌ను వెంటనే ఎత్తివేయాలి.

– ఉప్పుల శ్రీధర్, సర్పంచు, నగునూరు

కొన్నింటికి మంజూరయ్యాయి

గ్రామ పంచాయతీ, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులపై గతేడాది ఆగస్టు నుంచి ప్రభుత్వం ఫ్రీజింగ్ అమలు చేస్తోంది. ఇటీవల కొన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించి నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే అన్ని పంచాయతీలకు నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది.

– సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో, కరీంనగర్‌రూరల్

వాటర్ ప్లాంట్.. రెండేళ్లకే ఫట్



తాళం వేసిన వాటర్ ప్లాంట్, తాగునీటి నల్లాల వద్ద కూరగాయల ముల్లెలు

శనివారం మార్కెట్ వద్ద గల రైతు బజార్ అసౌకర్యాలకు నెలవుగా మారుతోంది. 2016లో అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావు వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. రెండేళ్లు దాని సేవలందగా తర్వాత మరమ్మతుకు గురైంది. అప్పటినుంచి ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా ఉంటోంది. ఫలితంగా నిత్యం వందలాది మంది విక్రయదారులు, వేలాది మంది వినియోగదారులు దుకాణాలకు వెళ్తూ తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్ అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి, ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. – కరీంనగర్ అర్బన్

నరెడ్ల శ్రీనివాస్ భావితరాలకు స్ఫూర్తి


నివాళి అర్పిస్తున్న సంఘాల బాధ్యులు

కరీంనగర్‌కల్చరల్: లోకసత్తా ఉద్యమ నేత నరెడ్ల శ్రీనివాస్ భావితరాలకు స్ఫూర్తి అని పలు సంఘాల బాధ్యులు అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ కరీంనగర్ వినియోగాదారుల మండలి, ఫిలిం సొసైటీ, సమాచార హక్కు రక్షణ వేదిక, జనవిజ్ఞాన వేదిక, తెలంగాణ రచయితల వేదికల సంయుక్త ఆధ్వర్యంలో నరెడ్ల సంస్మరణ సభ నిర్వహించారు. వినియోగదారుల మండలి ద్వారా ఆయన పేదవారికి సేవలందించారని అన్నారు. కరీంనగర్ ఫిలిం సొసైటీకి నరెడ్ల వెన్నెముక లాంటి వారని, ఆయన మార్గదర్శనం మరిచిపోలేనిదని పేర్కొన్నారు. కఫిసొ ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కార్యవర్గం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్, వివిధ సంఘాల బాధ్యులు ప్రకాశ్ హొల్లా, వెంకటేశ్వరరావు, పొన్నం రవిచంద్ర, గంగాధర్, రామరాజు, వారాల మహేశ్, గాజోజు నాగభూషణం, కోల రామచంద్రారెడ్డి, అన్నవరం దేవేందర్, ముజఫర్, కూకట్ల తిరుపతి, కందుకూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

- కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ రాజు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు కోరారు. కొత్తపల్లి మున్సిపల్ పరిధిలోని 2వ వార్డులో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని కంటి వెలుగు జిల్లా ప్రోగ్రాం అధికారి కేవీ రవీందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తపల్లి పట్టణంలో ఇప్పటివరకు 2,376 మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. వీరిలో 757 మందికి రీడింగ్, మరో 450 మందికి సైట్ కళ్లద్దాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. 143 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించినట్లు చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో వినీత, కంటి వెలుగు క్యాంప్ కో–ఆర్డినేటర్ శంకర్, డాక్టర్ నాషిబా అంజుమ్, మెడికల్ ఆఫీసర్ మౌనిక, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, వైద్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గురువారం నుంచి అంబేడ్కర్ భవనంలో ప్రారంభం కానున్న శిబిరాన్ని చైర్మన్ అధికారులతో కలిసి పరిశీలించారు.

కళ్లద్దాలు పంపిణీ

కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్‌నగర్‌లో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఎంపీపీ పిల్లి శ్రీలత బుధవారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచు కడారి శాంత, ఎంపీటీసీ సభ్యురాలు దావ కమల, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు సాబీర్, డాక్టర్ మౌనిక, ఏఎన్ఎం శ్వేత, వార్డు సభ్యులు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

18న నగునూర్‌లో శివరాత్రి ఉత్సవాలు

విద్యానగర్: కరీంనగర్ మండలంలోని నగునూర్ శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఈ నెల 18న శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్ తెలిపారు. ఉదయం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో గల శ్రీ సుందరేశ్వర స్వామి వారికి పంచామృతాభిషేకం, తర్వాత మధ్యాహ్నం 1 గంట వరకు శివలింగానికి భక్తులచే అభిషేకాలు జరుపుతామన్నారు. వివిధ పూజా కార్యక్రమాలతోపాటు రాత్రి 12 గంటలకు లింగోద్భవం, మహాహారతి, భక్తులకు తీర్థప్రసాదాల వితరణ ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

వృద్ధుడిని ఆశ్రమంలో చేర్పించిన కానిస్టేబుల్

కరీంనగర్ క్రైం: మానేరు డ్యాం పరిసరాల్లో తిరుగుతున్న ఓ వృద్ధుడిని లేక్ పోలీస్ అవుట్ పోస్ట్ కానిస్టేబుల్ ఎండీ.గౌస్ బుధవారం ఆశ్రమంలో చేర్పించారు. నందిలాల్ అనే వ్యక్తి కొన్ని నెలలుగా డ్యాం పరిసరాల్లో తిరుగుతున్నాడని తెలిపారు. వివరాలు అడిగితే తనకు ఎవరూ లేరని చెప్పడంతో స్పందన ఆశ్రమ నిర్వాహకులతో మాట్లాడి, అందులో చేర్పించినట్లు పేర్కొన్నారు. మానవత్వంతో స్పందించి, వృద్ధుడిని ఆశ్రమంలో చేర్పించిన కానిస్టేబుల్ గౌస్‌ను లేక్ ఆర్ఎస్సై సురేష్ అభినందించారు.

సంత్ సేవాలాల్ మహరాజ్‌కు నివాళి


విగ్రహం ఆవిష్కరించిన మంత్రి కమలాకర్


నివాళి అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

కరీంనగర్ కల్చరల్: బీఎస్పీ కరీంనగర్ అసెంబ్లీ కమిటీ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ 284వ జయంతిని నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. సేవాలాల్ బంజారా సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను రూపుమాపారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులను మోసం చేసిందని ఆరోపించారు. గిరిజన బంధు అమలు చేస్తామని చెప్పి, ఇప్పటివరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. పార్టీ అసెంబ్లీ అధ్యక్షుడు గాలి అనిల్, జిల్లా ఇన్‌చార్జి నల్లాల రాజేందర్, ప్రధాన కార్యదర్శి అక్కి బాలకిషన్, టౌన్ అధ్యక్షుడు అస్తపురం మధు తదితరులున్నారు.

సంత్ సేవాలాల్ విగ్రహావిష్కరణ

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని బుధవారం రేకుర్తి శివాలయం ఆవరణలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. బంజారాల కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్ ఎడ్ల రాజశేఖర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై పోరాడాలి

కరీంనగర్: గిరిజనుల సమస్యలపై పోరాటమే సేవాలాల్ మహరాజ్‌కు మనమిచ్చే నిజమైన నివాళి అని గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమా సాహెబ్ అన్నారు. బుధవారం విద్యానగర్‌లో సేవాలాల్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయన గిరిజనులు సంచార జీవనం నుంచి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకునేలా హితబోధ చేసిన మహనీయుడని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గిరిజన బంధు పథకాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. 11 బీసీ కులాలను గిరిజన జాబితాలో చేర్చాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. నాయకులు బాలా నాయక్, మోతిలాల్, రజనీష్, దేవీలాల్, అజయ్, అనసూయ నాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొత్తపల్లి: మండలంలోని చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం షీ టీం, పోలీసు కళాబృందంలచే సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. షీ టీం హెడ్ కానిస్టేబుల్ పర్శరాం మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో నేరాలు, వాటి బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మహిళలు, పిల్లలపై జరుగుతున్న నేరాలు, వాటికి పడే శిక్షలు, బాలల సంరక్షణ, వారి హక్కులపై మాట్లాడారు. అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత విషయాలు పంచుకోవద్దని చెప్పారు. ఆపద సమయంలో 100కు గానీ షీ టీం నంబర్ 94407 95182కి గానీ ఫోన్ చేస్తే రక్షిస్తామని పేర్కొన్నారు. డంకెన్‌డ్రైవ్, ట్రిపుల్ రైడ్, ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దని, హెల్మెట్ ధరించాలని, వాహనాల నంబర్ ప్లేట్లను ట్యాంపరింగ్ చేయవద్దన్నారు. రాంగ్ రూట్లో వెళ్లినా, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించినా జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ స్వప్న, కవిత, పాఠశాల హెచ్ఎం కె.భూమిరెడ్డి, బ్లూకోల్ట్స్ సిబ్బంది కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

'విట్స్'లో సెమినార్


సత్యప్రకాశ్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

కరీంనగర్‌రూరల్: స్థానిక విట్స్ కళాశాలలో బీటెక్, డిప్లొమా విద్యార్థులకు గ్రాఫాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ బి.సత్యప్రకాశ్‌తో 'కెరీర్ బిల్డింగ్' అనే అంశంపై బుధవారం సెమినార్ నిర్వహించారు. మంచి చేతి రాత ద్వారా కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. ఏకాగ్రత ఎలా పెంపొందించుకోవాలో తెలిపారు. విద్యార్థుల సంతకాలను డీకోడ్ చేసి, వారి వ్యక్తిత్వాన్ని తెలియజేయడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ప్రిన్సిపాల్ మురళి, ఏడీ గోవిందరావు, ఏవో సుధాకర్‌రావు, డీన్ ప్రదీప్‌కుమార్, కె.లక్ష్మణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో బంగారు పతకాలు


విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: విద్యార్థులకు ఇంగ్లిష్ భాషపై అవగాహన పెంపొందించాలని, ఇందుకు సంబంధించి పలు పోటీ పరీక్షల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాల విద్యార్థులు ప్రతిష్ఠాత్మక ఎస్‌వోఎఫ్ అంతర్జాతీయ ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో అత్యధిక బంగారు పతకాలు, అత్యుత్తమ ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. విద్యా ప్రణాళికలో ఆంగ్ల భాషకు ప్రత్యేకమైన స్థానం ఉందని, ఇందులో పట్టు సాధించాలని సూచించారు. కె.హవీష్ రెడ్డి 3వ తరగతి, డి.అర్జున్ చంద్ర 4వ తరగతి, ఎం.శ్రీయాన్స్ 5వ తరగతి, ఎం.శివేన్ రెడ్డి 5వ తరగతి, వి.ఆరాధ్య 5వ తరగతి, కె.కీర్తన్ సాయి 5వ తరగతి, సీహెచ్.శ్రీహిత రెడ్డి 6వ తరగతి తదితరులు బంగారు పతకాలు, జోనల్ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. అనంతరం వారికి ప్రశంసాపత్రాలు అందించి, అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెట్ బ్యాక్ లేకుండా షెడ్ల నిర్మాణం


సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న షెడ్లు

విద్యానగర్: కరీంనగర్ విద్యానగర్‌లోని ప్రధాన రహదారిలో కేడీసీసీ బ్యాంక్ పక్కన ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా కమర్షియల్ షెడ్లు నిర్మిస్తున్నారు. కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు నిత్యం ఈ దారిలోనే రాకపోకలు సాగిస్తున్నా అవి వారికి కనిపించడం లేదని పలువురు అంటున్నారు. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా గతంలోనే 5 ఫీట్ల సెట్ బ్యాక్ అమలు చేయాల్సి ఉండగా అలా చేయలేదని, ప్రజలు అభ్యంతరాన్ని పట్టించుకోకుండా డ్రైనేజీ నిర్మించారని చెబుతున్నారు. ఇప్పుడు ఏకంగా సెట్ బ్యాక్ లేకుండా కమర్షియల్ షెడ్లు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'అంబేడ్కర్‌పై విష ప్రచారం సరికాదు'


మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

కరీంనగర్: రాజ్యాంగం, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై విషప్రచారానికి తెరలేపడం సరికాదని ప్రజామిత్ర వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. అందులో భాగమే అమరా ప్రసాద్ వ్యాఖ్యలని పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీని గాడ్సే చంపాడని, ఆనాడు నేను ఉంటే అంబేడ్కర్‌ను చంపేవాడినన్న ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17న కోర్టు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, దళిత, బహుజన శక్తిని చాటాలని పిలుపునిచ్చారు.

'మీడియాపై దాడులు పత్రికా స్వేచ్ఛకు ముప్పు'

విద్యానగర్: మీడియాపై దాడులు పత్రికా స్వేచ్ఛకు ముప్పు అని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మీడియా సంస్థలపై ఫాసిస్టు ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీబీసీ కార్యాలయాలపై ఐటీ దాడులను సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మీడియా సంస్థలను భయపెట్టేందుకు, వేధింపులకు గురి చేసేందుకు ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను వినియోగించడం సరికాదన్నారు. బీబీసీపై దాడులు వెంటనే నిలిపివేయాలన్నారు. లేనిపక్షంలో బీజేపీ ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

క్లుప్తంగా...

పాలకుర్తిలో రూ.25 కోట్లతో పర్యాటక హోటల్

సాక్షి, హైదరాబాద్: పాలకుర్తిలో పర్యాటక హోటల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.25 కోట్లు మంజూరు చేశారు. హోటల్ ఏర్పాటుకు పరిపాలనామోదం తెలుపుతూ.. సాధ్యమైనంత త్వరగా భవనాన్ని నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం జీవో నంబర్ 48 జారీ చేసింది. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. పాలకుర్తిలో పర్యాటక హోటల్ ఏర్పాటు చేయాలని కోరగానే నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ హోటల్ నిర్మిస్తే.. ఆధ్యాత్మిక కేంద్రమైన పాలకుర్తికి వచ్చే పర్యాటకులు, భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేలకు డబ్బులివ్వొద్దు



రైల్వే ఓవర్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న అర్వింద్

ఆర్మూర్: కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జీల నిర్మాణాలు చేసే కాంట్రాక్టర్లు స్థానిక ఎమ్మెల్యేలకు డబ్బులు ఇవ్వవద్దని ఎంపీ ధర్మపురి అర్వింద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ శివారులోని మామిడిపల్లి – గోవింద్‌పేట్ రోడ్డులో ఇటీవల నిర్మాణం పూర్తయిన రైల్వే ఓవర్ బ్రిడ్జిని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మూడు నెలలుగా దక్షిణ మధ్య రైల్వే జీఎంపై ఒత్తిడి చేసి ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయించానన్నారు. త్వరలో మామిడిపల్లి నుంచి హైదరాబాద్ రూట్‌లో, అడవి మామిడిపల్లి నుంచి నిజామాబాద్ రూట్‌లో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జీల నిర్మాణాలు కూడా పూర్తి చేయిస్తామని తెలిపారు.

ప్రత్యామ్నాయ అడవులకు ఫారెస్ట్ బ్లాక్‌లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఫారెస్ట్ బ్లాక్‌లను రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసింది. ప్రభుత్వపరంగా వివిధ ప్రాజెక్ట్‌లు, అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం ఆయా చోట్ల అటవీభూమిని మళ్లించిన నేపథ్యంలో.. ఆయా జిల్లాల్లోని రెవెన్యూ భూమిని ప్రత్యామ్నాయ అటవీ భూములుగా నోటిఫై చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సాకారమవుతున్న స్వప్నం

- జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజలో సీఎం వైఎస్ జగన్
- జిందాల్ ఆధ్వర్యంలో రూ.8,800 కోట్లతో 3 మిలియన్ టన్నుల స్టీల్ ప్లాంట్
- రూ.700 కోట్లతో నీరు, విద్యుత్, ఇతరత్రా మౌలిక వసతుల కల్పన
- జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో 1.75 లక్షల ఉద్యోగాలు



వైఎస్సార్ జిల్లా సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజ చేస్తున్న సీఎం వైఎస్ జగన్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్

సాక్షి ప్రతినిధి, కడప: 'మనందరి చిరకాల స్వప్నం సాకారమౌతోంది. వేలాది మందికి ప్రత్యక్షంగా, లక్షలాది మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు మన ముంగిట్లోకి రానున్నాయి' అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అప్పట్లో నాన్న గారు ఉన్నప్పుడు ఈ ప్రాంతం అభివృద్ధి కోసం కలలుకన్నారని, ఇక్కడ స్టీల్ ప్లాంట్ కావాలని ఆలోచించారని చెప్పారు. ఆయన చనిపోయాక జిల్లాను ఏ నాయకుడూ పట్టించుకోనందున జిల్లా మొత్తం వెనుకబాటుకు గురవ్వడం మన కళ్లతో మనం చూశామన్నారు. దేవుడి ఆశీస్సులతో, మీ అందరి చల్లని దీవెనలతో మీ బిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక.. మళ్లీ ఈ ప్రాంతానికి ఒక్కొక్కటిగా పరిశ్రమలు రావడంతో మంచి రోజులు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

అగ్రగామి జిందాల్ గ్రూపు

- ఇక్కడ నిర్మించబోయే స్టీల్ ప్లాంట్ మరో 24–30 నెలల్లోపు ప్రారంభమవుతుంది. 3 మిలియన్ టన్నుల ప్లాంటును రెండు దశల్లో కట్టడానికి జిందాల్ కార్యాచరణ తయారు చేశారు. రూ.3,300 కోట్లతో మొదటి దశ పూర్తవుతుంది. ఆ తర్వాత రూ.5,500 కోట్లతో సెకండ్ ఫేజ్ మరో ఐదేళ్లలో అందుబాటులోకి వస్తుంది. మొత్తంగా రెండు దశల్లో రూ.8,800 కోట్లతో ఈ ప్రాంతంలో 3 మిలియన్ టన్నుల సామర్థ్యమున్న స్టీల్ ప్లాంట్ వేగంగా నిర్మాణం పూర్తి చేసుకోనుంది.
- జిందాల్ గ్రూపు చైర్మన్ సజ్జన్ జిందాల్ 28.5 మిలియన్‌టన్నుల స్టీల్ సామర్థ్యంతో దాదాపు రూ.1.75 లక్షల కోట్ల పెట్టుబడులతో స్టీల్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రగామిగా ఉన్నారు. అటువంటి వ్యక్తి మన ప్రాంతానికి వచ్చి ఇక్కడ 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణం ప్రారంభించారు. ఈ ప్లాంట్ కోసం దాదాపు 3,500 ఎకరాలు జిందాల్ ఫ్యాక్టరీకి ఇస్తున్నాం.
- ఇక్కడ జిందాల్ స్టీల్ ఫ్యాక్టరీతోపాటు పక్కన అనుబంధ పరిశ్రమల వ్యవస్థ కూడా ఏర్పడుతుంది. ఫలితంగా ఇక్కడో స్టీల్ సిటీ ఆవిర్భవిస్తుందన్న ఉద్దేశంతో గొప్పగా అడుగులు వేస్తున్నాం. మౌలిక సదుపాయాల కోసం దాదాపు రూ.700 కోట్లు ఖర్చు చేస్తున్నాం.

అపారంగా ఉద్యోగావకాశాలు

- జిల్లాలో ఇప్పటికే కొప్పర్తిలో 550 ఎకరాలు కేటాయించి.. ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)ను తీసుకొచ్చాం. ఇక్కడకు దాదాపు రూ.10 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు వస్తున్నాయి. ఆ 550 ఎకరాల్లో మొత్తం పరిశ్రమలు వస్తే.. మొత్తంగా లక్ష మందికి ఉద్యోగాలు వస్తాయి.
- ఇప్పటికే అక్కడ రూ.1,100 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 11,500 మందికి ఉద్యోగాలకు సంబంధించిన కార్యాచరణ కూడా వేగంగా జరుగుతోంది. అదే కొప్పర్తిలో జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్ పేరుతో 3,155 ఎకరాలను కేటాయించి.. అక్కడ రూ.18 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు వచ్చే అవకాశాలు సృష్టిస్తున్నాం. తద్వారా అపారంగా.. 1.75 లక్షల ఉద్యోగాలు వచ్చే పరిస్థితి ఉంది.

15 ఏళ్లకైనా 'సీతారామ' పూర్తవుతుందా?

- ధరణి సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించట్లేదు
- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి ధ్వజం



ఖమ్మం జిల్లా వైరాలో పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసి ఏడేళ్లు గడిచినా ఇంకా ఎందుకు పూర్తి కాలేదని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. గోదావరి నీటితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి రైతన్న కాళ్లు కడుగుతామని సీఎంతోపాటు నాయకులు చెప్పారని... ఆ రోజు ఎప్పుడొస్తుందన్నారు. ఖమ్మం జిల్లా వైరాలో బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రభుత్వ విధానాలపై విరుచుకుపడ్డారు. సీతారామ ప్రాజెక్టుకు అనుసంధానమైన రోళ్లపాడు ప్రాజెక్టుకు 2016 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 19 వేల కోట్లు కాగా గత ఏడేళ్లలో నాబార్డ్ నుంచి రూ. 6 వేల కోట్లు తెచ్చి పనులు చేశారన్నారు. ఇంత తక్కువ నిధులు కేటాయిస్తూ పోతే రాబోయే 15 ఏళ్లకైనా గోదావరి జలాలతో ప్రజల కాళ్లు కడుగుతారా అని ప్రశ్నించారు. ప్రజలు నిత్యం తన నామస్మరణ చేయాలనే తపన తప్ప.. తెలంగాణ బిడ్డల ఇబ్బందులను ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోలేదని పరోక్షంగా విమర్శించారు. గత 15 నెలలుగా 'ధరణి'లో సమస్యలు పరిష్కారమవక రైతులు అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పొంగులేటి దుయ్యబట్టారు. కరోనా కారణంగా రుణమాఫీ చేయలేకపోయినట్లు చెబుతున్న ప్రభుత్వం రూ. వందల కోట్లు వెచ్చించి సెక్రటేరియట్ ఎందుకు నిర్మించాల్సి వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఏదని తాను ప్రశ్నిస్తే తన 40 ఎకరాల మామిడి తోటకు ఉచిత కరెంట్ ఇస్తున్నట్లు ఓ నాయకుడు చెప్పడం గర్హనీయమన్నారు. తన సొంత గ్రామంలో 40 ఎకరాల మామిడితోటే లేదన్నారు. కార్పొరేట్ స్థాయి ఆస్పత్రులతో వైద్య, ఆరోగ్య రంగంలో అభివృద్ధి సాధించామని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో పేదలకు వైద్యం అందడం లేదని పొంగులేటి ఆరోపించారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్లో వచ్చి.. బస్సును ఢీకొని..

- లారీ, బస్సు ఢీకొన్న ప్రమాదంలో కండక్టర్ మృతి
- బస్సు డ్రైవర్‌తో సహా ఎనిమిది మందికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆర్టీసీ బస్సు. (ఇన్‌సెట్‌లో) కండక్టర్ సత్తయ్య

మల్యాల(చొప్పదండి): అతివేగం.. అందులోనూ రాంగ్‌రూట్‌లో వచ్చిన ఓ లారీ.. ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొట్టడంతో కండక్టర్ బొల్లం సత్తయ్య ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట శివారులోని బల్వంతాపూర్ అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఈ ప్రమా దం జరిగింది. జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్ర యాణికులతో వరంగల్ వెళ్తోంది. ఇదే సమయంలో కట్టెల లోడుతో జగిత్యాల వైపు వెళ్తున్న లారీ బల్వంతాపూర్ అడ్డరో డ్డు వద్దకు చేరుకుంది. లారీ డ్రైవర్ అతివేగంగా రాంగ్‌రూట్ లో నడపంతో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. అదే వేగంతో ముందుకు వెళ్లి తాటిచెట్టును ఢీకొని బోల్తాపడింది. లారీ ఢీకొన్న ధాటికి ఆర్టీసీ బస్సు నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కొడిమ్యాల మండలం శ్రీరాములపల్లి గ్రా మానికి చెందిన ఆర్టీసీ బస్ కండక్టర్ బొల్లం సత్తయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ జక్కు రాములకు తీవ్రగాయాలు కాగా, బస్సులో ఉన్న ఎనిమిది మంది ప్రమాణికులు గా యపడ్డారు. వీరిని జగిత్యాల ఏరియా ఆ స్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులకు ఆర్టీసీ డిపో మేనేజర్ సాయం అందజేశారు. ఎక్కువ గాయాలైన ఒకరికి 5వేలు, మిగిలిన ప్రయాణికులకు వెయ్యి చొప్పున అందించారు.

ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించండి

- జిల్లాల విద్యుత్ అధికారులకు ఆదేశం
- విద్యుత్, సాగునీరు వృథా అవుతోందనే భావన
- రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షలకు పైగా వ్యవసాయ కనెక్షన్లు



ఎస్పీడీసీఎల్ ఆపరేషన్స్ సీజీఎం జారీ చేసిన మెమో కాపీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వ్యవసాయ పంపుసెట్ల వద్ద రైతులు పెట్టుకున్న ఆటోమెటిక్ స్టార్టర్లను వెంటనే తొలగించాలని కింది స్థాయి అధికారులకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు.. వెంటనే సంబంధిత జిల్లాల ఎస్‌ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలు ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీడీసీఎల్ సీజీఎం (ఆపరేషన్స్) ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు (మెమో 3817/22- 23) జారీ చేశారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోనూ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

అధిక ధరతో కొన్న విద్యుత్తు వృథా అవుతోందనే

వ్యవసాయ పంపు సెట్ల వద్ద ఆటోమెటిక్ స్టార్టర్లను ఉపయోగించడం వల్ల ప్రభుత్వం అధిక ధరకు కొనుగోలు చేసిన విద్యుత్ వృథా అవుతోందని, దాంతోపాటు సాగు నీరు కూడా వృథా అవుతోందని ట్రాన్స్‌కో అధికారులు భావిస్తున్నారు. దీన్ని అరికట్టేందుకే ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ఇచ్చినా ఆర్వోను నియమించరా?

టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం షెడ్యూల్ ప్రకటించినప్పటికీ ఎన్నికల సంఘం రిటర్నింగ్ అధికారి (ఆర్వో)ను ఎందుకు నియమించలేదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ ప్రశ్నించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి నేరాల సమాచారం తెలిపే నిబంధన ఉందో లేదో తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఓటర్ కార్డుతో ఆధార్ కార్డు లింక్ చేసే ప్రక్రియ అర్బన్ ప్రాంతాల్లో ఎందుకు తక్కువ అయిందో చెప్పాలన్నారు. ఈ అంశాలపై చర్చించేందుకు ఎన్నికల సంఘం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిరంజన్ డిమాండ్ చేశారు.

రెండో విడత దేహదారుఢ్య పరీక్షలు షురూ..

- మొదటిరోజు 685 అభ్యర్థుల హాజరు
- 'తుది' పరీక్షకు 218 మందికి అర్హత
- సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు
- పర్యవేక్షించిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



పరుగు పందెంలో పాల్గొన్న ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు

ఆదిలాబాద్‌టౌన్: ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల రెండో విడత దేహదారుఢ్య పరీక్షలు మొదటిరోజు జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్ మైదానంలో బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటిరోజు 800 మందికి 685 మంది అభ్యర్థులు హాజరు కాగా 115 మంది గైర్హాజరయ్యారు. హాజరైన అభ్యర్థుల్లో 218 మంది అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులై తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఉదయం 4గంటల నుంచి అభ్యర్థులు పరేడ్ మైదానానికి చేరుకున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన, బయోమెట్రిక్, రిస్ట్ బ్యాండ్, ఆర్‌ఎఫ్ ఐడీ, 1600 మీటర్ల పరుగు పూర్తి చేసుకుని ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు ఎత్తు, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ అంశాల్లో పాల్గొంటారని ఎస్పీ పేర్కొన్నారు. అభ్యర్థుల ఎత్తు కొలవడానికి రెండు పరికరాలను నియామక మండలి అందించిందని, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ద్వారా 1600 మీటర్ల పరుగులో విడివిడిగా అభ్యర్థులకు అత్యాధునిక పరికరాల ద్వారా సమయాన్ని కేటాయిస్తామన్నారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా మైదానంలో తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, అత్యవసర సమయంలో వైద్య బృందం, అంబులెన్స్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈవెంట్స్‌ల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఎలాంటి సందేహాలు లేకుండా పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఈవెంట్ల సమాచారం రాష్ట్ర పోలీస్ నియామక మండలి వారికి ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చేరవేస్తుంటారని తెలిపారు. చివరగా అభ్యర్థులకు సందేహాలు లేకుండా పూర్తి వివరాలతో కూడిన ఫలితాల పత్రాన్ని అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్.శ్రీనివాసరావు (పరిపాలన), బీ రాములునాయక్ (ఓఎస్డీ), ఆర్.వెంకటేశ్వర్లు (ఏఆర్), ఏవో యూనుస్ అలీ, డీఎస్పీలు ఉమేందర్, సీహెచ్ నాగేందర్, ఉమామహేశ్వర్‌రావు, పోతారం శ్రీనివాస్, సూపరింటెండెంట్లు జోసెఫిన్, గంగాధర్, సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, రిజర్వేషన్ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది, ఐటీ కోర్, ఫింగర్‌ప్రింట్, కమ్యూనికేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



లాంగ్‌జంప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

19న అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు

కుంటాల: మహాశివరాత్రి పురస్కరించుకుని మండలంలోని సూర్యపూర్ రాజరాజేశ్వరాలయ ఆవరణలో ఈనెల 19న అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బక్కి సునీత, ఉప సర్పంచ్ రాజన్న, ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్, వీడీసీ చైర్మన్ పోతన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలో గెలుపొందిన విజేతకు రూ.5 వేల నగదుతోపాటు శాలువాతో సత్కరిస్తారని పేర్కొన్నారు.

నిర్మల్ చేరిన సైకిల్ యాత్ర



యువతితో సైక్లింగ్ క్లబ్ సభ్యులు

నిర్మల్‌టౌన్: 'అమ్మాయిలు కలలు కనాలి.. వాటిని ధైర్యంగా సాకారం చేసుకోవాలి' అనే నినాదంతో ఓ యువతి చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం జిల్లాకు చేరుకుంది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన ముస్కాన్ రఘువంశీ ఈ యాత్ర చేపడుతోంది. జిల్లాకు చేరుకున్న ఆమెకు నిర్మల్ సైక్లింగ్ క్లబ్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆమె సంకల్పానికి ప్రశంసించారు. వైద్యులు రఘునందన్‌రెడ్డి, బీఎల్‌ఎన్ రెడ్డి, కాసం రాజ్‌కుమార్, ప్రీతం, సాయినందన్, కేఆర్ ప్రసాద్, శరత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతలో రైతుల పాత్ర కీలకం



ఆదర్శ రైతులతో కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

- రేడియో కిసాన్ దివస్‌లో ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఉమ్మడి జిల్లా ఉత్తమ రైతులకు సన్మానం

కైలాస్‌నగర్: దేశ రక్షణలో సైనికులకు ఎంతటి ప్రాధాన్యత ఉందో.. ఆహార భద్రత విషయంలో రైతులకు అంతే ప్రాధాన్యం ఉందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం రేడియో కిసాన్ దివస్ కార్యక్రమాన్ని ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడంలో, వారికి అవసరమై సమాచారం అందించడంలో ఆకాశవాణి కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఆధునిక శాస్త్ర, సాంకేతికతను అందిపుచ్చుకుని అధిక దిగుబడులు ఎలా సాధించవచ్చనే సమాచారాన్ని రైతులకు అందించడంలో ఆకాశవాణి కృషి అభినందనీయమన్నారు. సాగులో వస్తున్న ఆధునాతన సాంకేతికతను అందిపుచుకుని మేలైన సాగు, శాస్త్రీయ పద్ధతులను అవలంభించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉత్పాదక శక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పంటల సాగులో ఆదర్శంగా నిలిచిన 8మంది ఉత్తమ రైతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ నౌసి నాయక్, రిటైర్డు కార్యక్రమ సంచాలకులు సుమనస్పతిరెడ్డి, డీఐసీ మేనేజర్ పద్మభూషణ్ రాజు, వ్యవసాయ శాఖ ఏడీ రమేష్, పశుసంవర్థక శాఖ అధికారి బి.కిషన్, డెయిరీ డీడీలు మధుసూదన్ రావు, శాస్త్రవేత్తలు ప్రవీణ్, సుచిత్ర, రాజాగౌడ్, ఆకాశవాణి ప్రోగ్రాం ఆఫీసర్ రామేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

కడుపు 'కోతలు'!

- నియంత్రణలోకిరాని సిజేరియన్లు
- మూహూర్తాల కోసం కొందరు..
- పౌష్టికాహార లోపంతో మరికొందరు..
- ధనార్జనే ధ్యేయమంగా వైద్యులు
- రెడ్‌జోన్‌లోకి వెళ్లిన జిల్లా

ప్రసవాల సమాచారం

సంవత్సరం	సాధారం	సిజేరియన్	మొత్తం
2019–20	2,631	5,361	7,992
2020–21	2,727	6,350	9,077
2021–22	3,448	8,918	12,366
2022–23 (జనవరి వరకు)	269	821	1,090





సిజేరియన్లపై వైద్యులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లా అధికార యంత్రాంగం ఎన్ని కఠిన చర్యలు తీసుకున్నా సిజేరియన్లు నియంత్రణలోకి రావడంలేదు. సర్కారు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 65.9శాతం శస్త్రచికిత్సలతో పురుడు పోస్తే.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వాటి సంఖ్య 78.4 శాతానికి చేరడం ఆందోళన కలిగిస్తోంది. పౌష్టికార లోపంతో బాధపడే గ్రామీణ, పేద గర్భిణులు ఒక కారణంకాగా, మంచిమూహూర్తాలు అని కొందరు, ధనార్జనే ధ్యయంగా వైద్యులు.. వ్యాపారమయమైన ఆస్పత్రుల నిర్వాహకుల తీరు మరో కారణమని నిపుణులు వివరిస్తున్నారు. కలెక్టర్ యాస్మిన్‌బాషా ఇటీవల జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సిజేరియన్లలో జిల్లా రెడ్ జోన్‌లోకి వెళ్లిందని, వైద్యులు అప్రమత్తంగా ఉంటూ సిజేరియన్లు కాకుండా సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని ఆమె ఆదేశించడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది.

ప్రసవాల సంఖ్యతోపాటే పెరుగుతున్న ఆపరేషన్లు..

- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి జగిత్యాలతోపాటు ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన మహిళలు కూడా డెలివరీ కోసం వస్తున్నారు.
- కేసీఆర్ కిట్లు అమలు చేయడం ద్వారా చాలామంది ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే పురుడు పోసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.
- తద్వారా ఏటా సర్కారు ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతూ వస్తోంది.
- కానీ, అత్యవసరమైతే తప్పశస్త్ర చికిత్స చేయకూడదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆదేశించినా.. కొందరు వైద్యులు, గర్భిణులు ఇదేమీ పట్టించుకోవడంలేదు.
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది.
- గ్రామీణ, పేద మహిళలు గర్భం దాల్చినప్పటి పురుడు పోసుకునే వరకూ వారి ఆరోగ్య పరిస్థిలులు తెలుసుకుని సాధారణ ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాల్సి ఉంది.
- కానీ, అది అమలుకు నోచుకోవడం లేదు.

పౌష్టికాహారం లేకనే..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులను ఐసీడీఎస్ ద్వారా గుర్తించి ఆదినుంచే పౌష్టికాహారం అందించాలని అధికారుల ఆదేశాలు ఉన్నాయి. అయినా, చాలామంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారు. వీరికి పురుడు పోసే సమయంలో పలు సమస్యలు తలెత్తి సిజేరియన్ చేయాల్సి వస్తోందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నా సత్ఫలితాలు రావడంలేదు.

శుభముహూర్తాల కోసం..

ఆస్పత్రిలో చేరిన గర్భిణికి తొలుత అన్నిరకాల వైద్య పరీక్షలు చేయాలని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఆ నివేదికల ఆధారంగా పురిటి నొప్పులు తట్టుకుంటుందా లేదా అని నిర్ధారిస్తారు. ఇవేమీ పట్టించుకోని కొందరు వైద్యులు సిజేరియన్లతో పురుడు పోస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా గర్భస్రావం అయ్యే మహిళలను హైరిస్క్‌గా గుర్తించి ప్రాథమిక స్థాయినుంచి చికిత్స అందించాలి. జిల్లాలో ఇలాంటివేమీ చేపట్టడంలేదు.

సిజేరియన్లతో తలెత్తే ఇబ్బందులు

- శిశువుకు చురుకుదనం తక్కువ. శస్త్రచికిత్సతో సిరల్లో రక్తం గడ్డకడుతుంది. తద్వారా తల్లికి హాని పొంచిఉంటుంది.
- బిడ్డకు తల్లి చనుపాలు ఇవ్వడం ఆలస్యమవుతుంది.
- గర్భాశయ గోడకు నష్టం వాటిల్లుతుంది.
- బాలింత సుదీర్ఘకాలం ఆస్పత్రిలో ఉండాల్సి వస్తుంది.
- శస్త్రచికిత్స మచ్చ ఎప్పటికీ ఉంటుంది.
- రోజూవారి పనులు చేసుకోవడం మహిళలకు ఇబ్బందిగా మారుతూ ఉంటుంది.
- తొలికాన్పు ఆపరేషన్ అయితే.. రెండోకాన్పులోనూ శస్త్రచికిత్స అనివార్యం అవుతుంది.

సాధారణ కాన్పు ద్వారా ప్రయోజనాలు..

- శిశువులో చురుకుదనం ఎక్కువ ఉంటుంది. సిరల్లో రక్తం గడ్డకట్టదు.
- తల్లి చనుపాలు త్వరగా ఇస్తుంది.
- గర్భాశయ గోడకు నష్టం ఉండదు.
- రెండుమూడ్రోజుల్లోనే ఇంటికి వెళ్లవచ్చు.
- శరీరంపై ఎలాంటి మచ్చలు, ఇబ్బందులు ఉండవు.
- సులభంగానే రోజూవారి పనులు త్వరగా చేసుకోవచ్చు.
- ఎన్ని కాన్పులకైనా ఇబ్బందులు ఉండవు.

దేవుని నిర్ణయమే గొప్పది

ప్రసవాల కోసం దేవుడు నిర్ణయించిన ముహూర్తమే గొప్పది. అందుకే ఆ సమయం కోసం.. అందునా సాధారణ ప్రసవం కోసమే ప్రయత్నం చేయాలి. శస్త్రచికిత్సలతో పురుడు పోయడం మంచిది కాదు. మహిళలకు ఆరోగ్యపరమైన అనేక సమస్యలు ఎదురవుతాయి. జిల్లాలో సిజేరియన్ల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల్లోనూ మార్పు రావాలి.
– షేక్ యాస్మిన్ బాషా, కలెక్టర్

గిరిజన విజయం

'మా అమ్మా నాన్నలు ఇకపై నన్ను టీవీలో చూస్తారు' అని సంతోష పడింది మిన్ను మణి. దేశీయంగా ఆమె ఆడిన క్రికెట్ మేచ్‌లు టీవీలో టెలికాస్ట్ కాలేదు. 'విమెన్స్ ప్రీమియర్ లీగ్' కోసం 30 లక్షలకు మిన్ను మణిని ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకున్నాక ఆమె ఆట తప్పక టెలికాస్ట్ కానుంది.

రోజుకు నాలుగు బస్సులు మారి 52 కిలోమీటర్ల దూరంలోని క్రికెట్ స్టేడియంకు వెళ్లి ప్రాక్టీస్ చేసిన మణి కేరళలో ఈస్థాయికి ఎదిగిన తొలి గిరిజన మహిళా క్రికెటర్. మహిళా క్రికెట్ ఇప్పుడు విజయ పరంపరలో ఉంది. నిర్లక్ష్య వర్గాల నుంచి కూడా ఈ ఆటకు చేరొచ్చు అని చెబుతున్న మిన్ను మణిది కూడా ఒక విజయగాథ.



మిన్ను మణి

'ముప్పై లక్షల రూపాయలు. నా జీవితంలో చూస్తానని అనుకోలేదు. మొదట నేనొక స్కూటీ కొనుక్కోవాలి. బస్సుల్లో తిరుగుతూ ప్రాక్టీసుకు ఇకపై వెళ్లను. ఆ తర్వాతే ఆ డబ్బుతో ఏం చేయాలో ఆలోచిస్తాను' అంది మిన్ను మణి.

ఫిబ్రవరి 13న ముంబైలో 'విమెన్స్ ప్రీమియర్ లీగ్' కోసం మహిళా క్రికెటర్ల వేలం జరుగుతున్నప్పుడు మిన్ను మణి హైదరాబాద్‌లో సౌత్ జోన్ తరఫున ఇంటర్ జోన్ టోర్నమెంట్ ఆడుతోంది. ఆ రోజున 91 బాల్స్‌కు 74 కొట్టి నాటౌట్‌గా నిలిచింది. ఆట ఒకవైపు సాగుతూ ఉన్నా మనసంతా ముంబై ఆక్షన్ మీదే ఉంది.

'పెద్ద పెద్ద మహిళా క్రికెటర్లకు కూడా వేలంలో ధర పలకకపోతుండే సరికి నిరాశ కలిగింది. నా బేస్ ప్రైస్ 10 లక్షలు పెట్టారు. ఎవరూ తీసుకోరేమో అనుకున్నాను. కానీ ఢిల్లీ, బెంగళూరు ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. 30 లక్షలకు ఢిల్లీ కేపిటల్స్ నన్ను సొంతం చేసుకుంది. అప్పుడు నాకు కలిగిన ఫీలింగ్ మాటల్లో చెప్పలేను' అంది మిన్ను మణి.

'ఆ విషయం ఫోన్‌లో చెప్తే మా అమ్మా నాన్నలు డబ్బు గురించి కాక నా ఆట గురించి అడిగారు. టీవీలో వస్తుందా అన్నారు. వస్తుంది అని చెప్పాను' అంది సంతోషంగా.

కరూచియ

23 ఏళ్ల మిన్ను మణిది కేరళలోని వయనాడ్ జిల్లాలోని గిరిజన గూడెం. ఇది బ్రహ్మగిరి కొండల అంచున ఉంటుంది. మణిది 'కరూచియ' గిరిజన తెగ. వీళ్లు తమను తాము కొండ బ్రాహ్మణులుగా చెప్పుకుంటారు. తమ ఆచారాలు స్ట్రిక్ట్‌గా పాటిస్తారు. గురి చూసి బాణం వేయడంలో మేటిగా పేరు గడించారు. కాని ఇప్పుడు వారంతా చిన్న చిన్న పనులు చేసుకు బతుకుతున్నారు. మిన్ను మణి తండ్రి మణి రోజు కూలి. తల్లి వసంత గృహిణి. చిన్నప్పటి నుంచి మిన్ను మగపిల్లలతో కలిసి పొలాల్లో టెన్నిస్ బాల్‌తో క్రికెట్ ఆడేది. ఎలిమెంటరీ స్కూల్లో రన్నర్‌గా ప్రతిభ చూపేది. 8 వ తరగతిలో హైస్కూల్లో చేరాక ఆమె ప్రతిభను ఆ స్కూల్లో ఎల్సమ్మ బేబీ అనే పీఇటీ టీచరు గుర్తించింది. 'మిన్ను రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్నర్. రైట్ హ్యాండ్ బ్యాట్స్‌ఉమన్. బౌలింగ్‌లో బ్యాటింగ్‌లో ఆ అమ్మాయి టాలెంట్ చూసి చాలా దూరం వెళుతుందని అనుకున్నాను' అంటుంది ఆ పీఇటీ టీచర్. ఆ పీఇటీ టీచరే పూనుకుని తిరువనంతపురంలోని కేరళ క్రికెట్ అసోసియేషన్ దగ్గరకు తీసుకువెళితే వారు పరీక్షించి ట్రయినింగ్ ఇచ్చారు. దాంతో మిన్ను మణి ముందు వయనాడ్ జిల్లా జట్టుతో ఆటు పిమ్మట అండర్ 16 జట్టుతో ఆ తర్వాత కేరళ రాష్ట్ర మహిళా జట్టుతో ఆడటం మొదలుపెట్టింది.



తల్లి వసంతతో మిన్ను మణి

కష్టే ఫలి

అయితే మిన్ను మణి క్రికెట్ ఆడటానికి మొదట తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. 'కేరళలో అమ్మాయిలు అథ్లెట్లుగా రాణిస్తారు. నన్ను కూడా ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్‌గా చూడాలని మా అమ్మానాన్నలు అనుకున్నారు. క్రికెట్ మగవాళ్ల ఆట అని వారి అభిప్రాయం. కాని మా పీఇటీ టీచరు వారిని ఒప్పించి నన్ను క్రికెట్‌లోకి తీసుకెళ్లింది. నేను క్రికెట్ బాగా ఆడుతున్నానని తెలిశాక వారు మనస్ఫూర్తిగా ప్రోత్సహించసాగారు' అంది మిన్ను.

కానీ క్రికెట్‌లాంటి ఖరీదైన ఆటకు కావలసిన మంచి కిట్ కూడా మిన్ను దగ్గర లేదు. వాళ్ల నాన్న అప్పులు చేసి మిన్ను ఆట కొనసాగేలా చూశాడు. మిన్ను ప్రాక్టీసు చేయాలంటే వారి గూడేనికి 52 కిలోమీటర్ల దూరంలోని కృష్ణగిరి క్రికెట్ స్టేడియమే గతి. అంత దూరం వెళ్లడానికి మిన్ను తెల్లవారు జామునే లేచి ఇంటి పనుల్లో తల్లికి సాయం చేసి నాలుగు బస్సులు మారి స్టేడియంకు చేరుకునేది. తిరిగి ఇల్లు చేరే సరికి సాయంత్రం 7 అయ్యేది. 'అలిసిపోయేదాన్ని. కాని పట్టుదలగా ఆట కొనసాగించాను' అంటుంది మిన్ను.

ఆటలో విజయాలు

మిన్ను మణి కేరళ అండర్ 23లో ఆ తర్వాత భారత్ అండర్ 23 జట్టులో ప్రతిభ చూపింది. ఇండియా ఏ జట్టుకు ఎంపికై ఆడింది. విమెన్స్ ఆల్ ఇండియా ఒన్ డే టోర్నమెంట్‌లో 8 మేచ్‌లు ఆడి 246 పరుగులు చేసి 12 వికెట్లు తీసింది. దాంతో అందరి దృష్టి మిన్ను మీద పడింది. క్రికెట్ ఆడటం మొదలెట్టాక వచ్చిన కొద్ది పాటి డబ్బులో ప్రతి పైసా తన కోసం తండ్రి చేసిన అప్పులు తీర్చడానికి ఉపయోగించింది. మిగిలిన డబ్బుతో చిన్న ఇల్లు కడితే 2018 వరదల్లో ఆ ఇల్లు దెబ్బతింది. క్రికెట్ అభిమానులు ఆదుకుని రిపేర్లు చేయించారు. ఇప్పుడు 30 లక్షల సంపాదన స్థాయికి మిన్ను చేరింది. 'దీని కంటే జాతీయ జట్టులో స్థానం పొందడమే నాకు ఎక్కువ ఆనందం. అదే నా లక్ష్యం' అంటోంది మిన్ను మణి.

సైబర్ టాక్

ఆన్‌లైన్‌లో డబ్బులు పోతే ఏం చేయాలి?!

కూతురు పుట్టినరోజుకు డ్రెస్ కొనుగోలు చేసిన సౌమ్య ఫోన్ యాప్ ద్వారా పేమెంట్ చేసింది. అయితే, పేమెంట్ మోడ్‌కి వచ్చేసరికి డబ్బులు డెబిట్ అయినట్టు బ్యాంక్ నుంచి మెసేజ్ వచ్చింది కానీ, షాప్ యజమాని ఖాతాలో నగదు క్రెడిట్ కాలేదు. దీంతో ఒకటికి రెండు సార్లు పేమెంట్ చేసింది. ఫెయిల్ అయిన ట్రాన్సాక్షన్ అమౌంట్ రిటర్న్ అవుతుందిలే అని ఊరుకుంది. కానీ, అలా రిటర్న్ అయిన మెసేజ్ ఏమీ రాలేదు. ఆ అమౌంట్‌ను తిరిగి ఎలా పొందడం, లేకపోతే అంతమొత్తం ఎలా వదిలేయడం.. ఓ రెండు రోజులు ఆగి చూద్దామా.. ఇలాంటి సందేహాలతోనే సౌమ్యకు ఆ రోజు గడిచిపోయింది.

ఇటీవల స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి వ్యక్తికి ఆన్‌లైన్ పేమెంట్స్ గురించి తెలిసిందే. పండ్లు, కూరగాయల బండి వద్ద కూడా యాప్ ఆధారిత పేమెంట్ ఆప్షన్ కనిపిస్తుంటుంది. ఇందుకు గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎమ్ వంటి వాటి ద్వారా ఆర్థిక లావాదేవీలు జరుపుతుంటాం, ఇలాంటప్పుడు సర్వర్ సరిగ్గా పనిచేయకనో లేదా మరో కారణంగానో ఆన్‌లైన్ లావాదేవీలు నిలిచిపోయినప్పుడు లేదా ఆన్‌లైన్ నగదు మోసాల జరిగినప్పుడు ఏం చేయాలో ప్రతిఒక్కరికీ అవగాహన తప్పక ఉండాలి.

ఫిర్యాదులకు వేదిక

సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (CFCFRM) అనేది భారతదేశంలో పౌరులు ఆర్థిక సైబర్ మోసాలను ఫిర్యాదు చేయడానికి ఒక వేదిక. ఆర్థిక సైబర్ మోసానికి సంబంధించిన సంఘటనలను నివేదించడానికి, నిర్వహించడానికి పౌరులకు అనుకూలమైన, సురక్షితమైన మార్గాన్ని అందించడం ఈ ప్లాట్‌ఫారమ్ లక్ష్యం. మోసానికి సంబంధించిన సంబంధిత పత్రాలు, సాక్ష్యాలను దీనిలో అప్‌లోడ్ చేయచ్చు. ఇది ఆర్థిక సైబర్ మోసాన్ని ఎలా నిరోధించాలనే దానిపై సమాచారం, మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. నివేదిక ఇచ్చాక, విచారణ కోసం సంబంధిత చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీకి పంపిస్తుంది. తగిన చర్య కోసం బ్యాంకింగ్ అధికారులకు పంపుతుంది. మోసగాడి ఖాతాలో బాధితుడి డబ్బు ఇంకా అందుబాటులో ఉంటే, బ్యాంకు దానిని హోల్డ్‌లో ఉంచుతుంది. తర్వాత, ఫిర్యాదుదారు అధికారికంగా కోర్టుకు హాజరు కావాలి. ఆ పై డబ్బు బాధితుడి ఖాతాకు బదిలీ చేయబడుతుంది. ఈ స్థితిని ట్రాక్ చేయడానికి ఒక యంత్రాంగాన్ని అందిస్తుంది.

CFCFRM టోల్ ఫ్రీ నెంబర్: 1930

- వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలి (12 గంటల్లోపు)
- ప్రత్యామ్నాయంగా https://cybercrime.gov.in పోర్టల్‌కు లాగిన్ అయ్యి, ఫిర్యాదు చేయాలి.
- బ్యాంక్ అకౌంట్ నెంబర్, వాలెట్ యుపిఐ, లావాదేవీ ఐడీ, తేదీ, డెబిట్/క్రెడిట్ కార్డ్ నంబర్లు మొదలైనవి ఇవ్వాలి.
- సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, రసీదు సంఖ్యను ఎఫ్ఐఆర్‌గా మార్చవచ్చు.

RBI వన్ నేషన్ వన్ అంబుడ్స్‌మన్ : టోల్ ఫ్రీ నెం. 14448

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా 'వన్ నేషన్ వన్ అంబుడ్స్‌మన్ పథకం' అందుబాటులోకి వచ్చింది. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఇతర ఎలక్ట్రానిక్ చెల్లింపు వ్యవస్థలకు సంబంధించిన వాటితో సహా అన్ని డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడానికి వినియోగదారులకు ఒకే పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ అందించడం ఈ పథకం లక్ష్యం.

ఈ పథకం కింద, వినియోగదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించడానికి, పరిష్కరించడానికి ప్రతి రాష్ట్రంలో ఆర్‌బిఐచే నియమించబడిన అంబుడ్స్‌మన్ ఉంటారు. ఫిర్యాదులను స్వీకరించడం, విషయాన్ని విచారించడం, ఫిర్యాదు సరైనదేనని తేలిన సందర్భాల్లో బాధిత వినియోగదారులకు పరిహారం అందించే అధికారం ఈ అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. అంబుడ్స్‌మన్ స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పని చేస్తారు. వారి నిర్ణయాలకు బ్యాంకింగ్ సంస్థలు కట్టుబడి ఉంటాయి.

దశల వారీగా నివేదించే ప్రక్రియ...

- సంబంధిత యుపిఐ సర్వీస్ ప్రొవైడర్ పేటీఎమ్, గూగుల్ పే, ఫోన్ పె మొదలైన వాటిపై ఫిర్యాదు.
- టోల్ ఫ్రీ నంబర్ 14448కి కాల్ చేయాలి.
- https://cms.rbi.org.in పోర్టల్‌కు లాగిన్ చేసి, ఫిర్యాదు ఇవ్వచ్చు.
- మీ ఫిర్యాదును CRPC@rbi.org కి ఇ-మెయిల్ చేయచ్చు. (బ్యాంక్ స్టేట్‌మెంట్ లావాదేవీ స్క్రీన్ షాట్‌లు / యుపిఐ, యాప్ లావాదేవీ స్క్రీన్ షాట్‌లు/ పంపిన, స్వీకరించిన ఫోన్ నంబర్లు రెండింటినీ జత చేయాలి)
- బాధితుడి డబ్బు ఇంకా అందుబాటులో ఉంటే, బ్యాంక్ దానిని హోల్డ్‌లో ఉంచుతుంది, తర్వాత ఫిర్యాదుదారు ఖాతాకు బదిలీ చేస్తుంది.



ప్రతీకాత్మక చిత్రం

డబ్బులు ఇరుక్కుపోతే..

డబ్బులు బదిలీ చేసినప్పుడు మన అకౌంట్ నుంచి డిడక్ట్ అయినా అవతలి వారికి వెళ్లకపోవడం, లేదా పేమెంట్ ఆగిపోవడం వంటివి జరిగినప్పుడు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా యుపిఐ వివాదానికి పరిష్కారాన్ని తెలుసుకోవచ్చు.

ప్రతి కస్టమర్ PSP యాప్ (పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు) / TPAP యాప్ (థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్లు)లో UPI లావాదేవీకి సంబంధించి NPCI పోర్టల్ https://www.npci.org.in/what-we-do/upi/dispute-redressal-mechanism లో ఫిర్యాదు చేయవచ్చు.

ఈ కింది కారణాల వల్ల మాత్రమే అభ్యర్థనలను ఇవ్వాలి..

(ఎ) ఖాతా నుంచి మొత్తం డెబిట్ అయ్యింది కానీ లబ్ధిదారునికి క్రెడిట్ కాలేదు (బి) ట్రాన్సాక్షన్ ఫెయిల్ అయ్యింది కానీ మొత్తం నగదు డెబిట్ అయ్యింది (సి) చేయాల్సిన ఖాతాకు కాకుండా వేరొక ఖాతాకు తప్పుగా బదిలీ అయ్యింది (డి) లావాదేవీ సమయం ముగిసింది కానీ ఖాతా నుంచి డెబిట్ అయ్యింది (ఇ) మోసపూరితమైన లావాదేవీ జరిగింది (ఎఫ్) నగదు లావాదేవీ పెండింగ్‌లో ఉండిపోయింది (జి) లావాదేవీ అసలు యాక్సెస్ అవలేదు (హెచ్) లావాదేవీ రిజక్ట్ అయ్యింది (ఐ) పరిమితిని మించి పొరపాటున లావాదేవీ జరిగింది.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

బ్యూటిప్స్



మేకప్ ప్యాచ్‌లు కనిపించకుండా...

వయసు పైబడటం వల్ల చర్మం ముడతలు పడుతుంటుంది. మెడ, గొంతు ప్రాంతంలో చర్మం ముడతలు పడడాన్ని, చారికలు రావడాన్ని గమనించవచ్చు. ఈ సమస్య నివారణకు మెడ వ్యాయామం చాలా అవసరం. ఆకాశాన్ని చూస్తున్నట్టుగా తల పైకి ఎత్తి, తిరిగి నెమ్మదిగా కిందకు దింపాలి. ఇలా నాలుగైదు సార్లు చేయాలి. ఇలా రోజులో 5–6 సార్లుచేస్తూ ఉంటే మెడ దగ్గర చర్మం బిగుతుగా మారుతుంది. అలాగే మెడ, గొంతు దగ్గర మేకప్ వేసుకోవడానికి ముందు ఇలా చేయడం వల్ల మేకప్ ప్యాచ్‌లుగా కనిపించకుండా జాగ్రత్తపడవచ్చు.

మోచేతుల నలుపు తగ్గాలంటే...



- రోజూ స్నానానికి ముందు నిమ్మరసం రాసి, పది నిమిషాలు ఉంచాలి.
- టీ స్పూన్ కొబ్బరి నూనె, అర టీ స్పూన్ నిమ్మరసం కలిపి మోచేతులు, మోకాళ్లపై రాసి వేడి టవల్‌తో తుడవాలి.
- రెండు టీ స్పూన్ల ఆలివ్ ఆయిల్, టీ స్పూన్ పంచదార కలిపి మోకాళ్లకు, మోచేతులకు రాసి, రుద్దాలి. ఇలా చేయడం వల్ల నలుపు తగ్గుతుంది.
- రెండు టీ స్పూన్ల పెరుగులో కొద్దిగా బాదం పొడి కలిపి నలుపుగా ఉన్న చోట రాసి, రుద్ది, శుభ్రపరచాలి.
- పాల మీగడలో చిటికెడు పసుపు రాసి, నలుపుగా ఉన్న చోటరాసి, రుద్ది, శుభ్రపరచాలి.
- టొమాటో రసం లేదా దానిమ్మ రసం తేనె లేదా నూనెతో కలిపి మోకాళ్లకు, మోచేతులకు రాసి, రుద్ది, శుభ్రపరుచుకుంటే నలుపు సులువుగా తగ్గుతుంది.
- నువ్వుల నూనెలో చర్మాన్ని మృదువుగా ఉంచే సుగుణాలు పుష్కలంగా ఉన్నాయి. వారానికోసారి స్నానానికి నువ్వుల నూనె ఉపయోగించడం వల్ల చర్మానికి కావల్సిన ఫ్యాటీ యాసిడ్స్ అంది, మృదువుగా అవుతుంది.

కిచెన్‌టిప్స్



- ఇడ్లీ, దోసెల కోసం బియ్యం, మినప్పప్పు నానబెట్టేటప్పుడు ముందే కడగాలి. నానిన తర్వాత గ్రైండ్ చేసేటప్పుడు కడగడం వల్ల విటమిన్లు నీటిలో పోతాయి. అంతే కాకుండా దుకాణాల్లో వాటికి పురుగుపట్టకుండా నిల్వ చేయడానికి కీటక నాశినులను గనుక వాడి ఉంటే కడగకుండా నానబెట్టినప్పుడు ఆ అవశేషాలతో కూడిన నీటినే బియ్యం, మినప్పప్పు పీల్చుకుంటాయి కాబట్టి అవన్నీ శరీరంలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉంటుంది.
- కూరల్లో ఉప్పు ఎక్కువైనప్పుడు అందులో బంగాళాదుంప ముక్కలను వేయాలి. అధికంగా ఉన్న ఉప్పును పొటాటో పది నిమిషాల్లో పీల్చుకుంటుంది.



- గారెల కోసం తయారు చేసుకున్న పిండిలో నీరు ఎక్కువై నూనెలో వేయగానే అంచుల దగ్గర సన్న పలుకులుగా విడిపోతున్నట్లయితే, పిండిలో ఒక టేబుల్‌స్పూను నెయ్యి కలపాలి.
- కూరలు, పులుసులు, సూప్‌లు మరీ పలచగా ఉన్నట్లనిపిస్తే అందులో ఒక టేబుల్‌స్పూను కార్న్‌ఫ్లోర్ కలపాలి. కార్న్‌ఫ్లోర్‌ను అలాగే వేస్తే ఉండలవుతుంది. ముందుగా ఒక కప్పులో వేసి చన్నీటితో కలిపి ఆ మిశ్రమాన్ని కూరల్లో వేస్తే సమంగా కలుస్తుంది.



'స్మార్ట్' వాదనలు అంత స్మార్ట్ కాదు!

● ఫెక్స్‌టింగ్!

భార్యాభర్తలు, జీవిత భాగస్వాముల మధ్య ఏదో అంశం మీద వాదోపవాదనలు, చిన్న చిన్న గొడవలు మామూలే. వాదన జరుగుతుండగా... ఆఫీసుకు వెళ్తూ తన పార్ట్‌నర్ నుంచి దూరంగా వెళ్తే గొడవ సద్దుమణగడం ఖాయం. కానీ మొబైల్ ఫోన్‌లో టెక్ట్స్ మెసేజీల రూపంలో అదే గొడవ అదే పనిగా కొనసాగితే...? ఇలా లైఫ్ పార్ట్‌నర్స్ మధ్య ఫైటింగ్ కాస్తా టెక్ట్స్ మెసేజీల రూపంలో కొనసాగడాన్ని 'ఫెక్స్‌టింగ్' అనే ధోరణిగా అభివర్ణిస్తున్నారు. మొబైల్స్ ఎన్నెన్నో కొత్త కొత్త రకాల ఫీచర్స్‌తో వస్తున్నాయి కాబట్టి వాటిని 'స్మార్ట్' ఫోన్స్ అన్నారు. కానీ 'ఫెక్స్‌టింగ్' అంత స్మార్ట్ కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ప్రతీకాత్మక చిత్రం

'ఫెక్స్‌టింగ్' అంటే కేవలం జీవిత భాగస్వాముల మధ్య ఫైటింగ్ అనే కాదు... పేరెంట్స్, ఫ్రెండ్స్ మధ్య కూడా కావచ్చుకానీ... అత్యధికంగా ప్రభావం చూపేది భార్యాభర్తల మధ్యనే కావడంతో సాధారణంగా దాన్ని లైఫ్‌పార్ట్‌నర్స్‌కే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

అత్యంత ప్రఖ్యాతమైన ఓ సెలబ్రిటీ కేస్‌స్టడీ: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఆయన భార్య, అమెరికన్ ఫస్ట్ లేడీ జిల్ బైడెన్‌ల దాంపత్యం వయసు 45 ఏళ్ల పైమాటే. ఇటీవల ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాము వాదించుకునేందుకు టెక్ట్స్ మెసేజీలు వాడతామని చెప్పారు. అందుకు ఓ వినోదాత్మక కారణం కూడా తెలిపారు. తమ ఘర్షణ, వాదోపవాదాలు అమెరికన్ సీక్రెట్ ఏజెన్సీకి తెలియకుండా ఉండేందుకు ఈ మార్గాన్ని ఉపయోగిస్తుంటామని సరదాగా వెల్లడించారామె. అంటే అందరి గుట్టుమట్లు పసిగట్టే అత్యంత సమర్థమైన ఏజెన్సీనే బురిడీ కొట్టించడానికి ఆమె 'ఫెక్స్‌టింగ్'ను ఎంచుకున్నారన్న మాట.



జోబైడెన్, జిల్ బైడెన్

రెండు రకాల వాదనలు

ఫెక్స్‌టింగ్‌లో పార్ట్‌నర్స్ ఎదురెదురుగా ఉండరు కాబట్టి... ముఖ కవళికలూ. అందులోని ఆవేశాలూ, ఉద్వేగాలూ కనిపించవు. వాదన తాలూకు తీవ్రత అక్షరాల్లో అంతగా ప్రభావ పూర్వకంగా కనిపించదు కాబట్టి అంత హానికరం కాదనీ అనేవాళ్లూ ఉంటారు. అంతే కాదు... ఆ వాదన కొనసాగడానికి ఇష్టపడని వారు... టెక్ట్స్‌కు బదులుగా క్రమంగా 'స్మైల్' లేదా 'షేక్‌హ్యాండ్ ఎమోజీల్లాంటివి ఉపయోగిస్తూ పోతే, ఎదుటివారి నుంచి తగినంత ప్రతిస్పందన లేకపోవడంతో క్రమంగా వాదన సన్నగిల్లిపోతుందనీ, ఎదురుబొదురు ఉన్నప్పటంత హాని జరగకపోవచ్చనీ కొందరు చెబుతుంటారు.

సరిగ్గా దీనికి పూర్తి భిన్నంగా వాదించే వారూ ఉంటారు. మాటలు తడబడవచ్చు. ఏదో మాట సరిగా వ్యక్తం కాకపోవచ్చు. కానీ సరిగ్గా వ్యక్తీకరించగలిగేవాళ్లైతే రాతలోనే ప్రభావం ఎక్కువ అని చెప్పేవాళ్లూ ఉన్నారు.

> ఎప్పుడైనా అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు ఎదురుబొదురుగా ఉండి మాట్లాడుకోవడమే మంచిది. కొన్ని పదాలు, పంక్చువేషన్లు, ఎమోజీల వల్ల దురభిప్రాయాలు వచ్చే అవకాశమూ ఉంది. మాటల్లో చెప్పుకునే విషయాలను రాతలో పెట్టినప్పుడు అది మరింతగా హాని చేసే ప్రమాదం ఉంది. 'మీ అభిప్రాయంతో ఏకీభవించకపోవచ్చు, కానీ మీ అభిప్రాయానికి విలువివ్వాల్సిందే' అనే పరస్పర గౌరవ భావన, దృక్పథాల వల్లనే మంచి ఫలితాలు వస్తాయి.
>
> – డాక్టర్ సుజాత రాజమణి, మానసిక నిపుణులు



పాతగాయాలూ రేగే ప్రమాదం

దంపతుల మధ్య సంభాషణల రూపంలో ఎదురుబొదురుగా ఘర్షణలు జరుగుతున్నప్పుడు ఏదైనా మాటతూలినా గాలికి పోయే మాటల వల్ల ఆ తర్వాత ఎలాంటి ప్రభావమూ ఉండదు. కానీ 'రాత' ఎప్పటికీ నిలిచిపోయే అవకాశం ఉంది. అందువల్ల ఆ తర్వాత ఎప్పుడో చదువుకున్నప్పుడూ పాత మాటలూ, పాత వాదనల ప్రభావాలు కెలికినట్లుగా అయి, అవి ఆ తర్వాతెప్పుడో కూడా ప్రమాదం తెచ్చిపెట్టవచ్చని మరికొందరు చెబుతున్నారు.

అంతుఉండకపోవచ్చు... ఆ అంశమే ప్రమాదం తేవచ్చు...

పొద్దున్నే భార్యాభర్తల మధ్య వాదన చెలరేగింది. ఇద్దరూ తమ తమ పనులు చేసుకుంటూనే వాదనల్లో మునిగిపోయారు. ఆఫీసుకు బయల్దేరే సమయానికి ఘర్షణ పెద్దదైంది. కానీ ఆఫీసు సమయానికి ఎవరి దారిలో వాళ్లు వెళ్లిపోవడంతో ఆ 'వాదోపవాదాలు' అక్కడితో ముగుస్తాయి. కానీ 'ఫెక్స్‌టింగ్' అలా కాదు. ఆఫీసుకు వెళ్లే దారిలో బస్సులోనో, ఆటోలోనో లేదా మెట్రోరైల్ లోనో అలాగే కొనసాగవచ్చు. అంతేకాదు... ఆఫీసుకు చేరి, సీట్లలో కూర్చున్నాక కూడా అదేపనిగా కొనసాగితే ప్రమాదమే. ఆ మాటకొస్తే కీలకమైన మీటింగుల్లోనూ 'టెక్ట్స్ మెసేజు'లు కొనసాగుతూ... అసలు లక్ష్యానికి అడ్డంగా మారవచ్చు. టెక్ట్స్ వల్ల ఒనగూరే సౌలభ్యమల్లా వాదన మౌనంగా కొనసాగుతూ... అది మాటల ద్వారా బయటకు తెలియదంతే. కానీ పని ప్రదేశంలో... చేయాల్సిన పని వదిలేసి అదేపనిగా వాదులాడుకుంటూ పోతే... ఆఫీసులో పూర్తి చేయాల్సిన పనులు కొనసాగకపోగా / జరగకపోగా... అదే ఇబ్బంది తెచ్చిపెట్టే ప్రమాదమూ ఉందంటున్నారు కపుల్ కౌన్సెలింగ్ నిర్వాహకులు, మనస్తత్వ నిపుణులు. అంతేకాదు... అది పనితీరుతో పాటు, బంధాల విషయాల్లోనూ ప్రమాదం తెచ్చిపెట్టవచ్చునని హెచ్చరిస్తున్నారు.

వస్తువులో కాదు... అంతా మన విచక్షణలోనే ఉంది...

''ఏదైనా ప్రయోజనం అన్నది ఆ వస్తువును మనం ఉపయోగించే తీరులో లేదా మన విచక్షణను బట్టే ఉంటుందిగానీ... ఉపకరణంలో ఏమీ ఉండదు. ఇంగ్లిష్‌లో చెప్పాలంటే 'ఆబ్జెక్ట్'లో కాకుండా 'ఆబ్జెక్టివ్'లోనే అంతా ఉంది'' అంటూ వ్యాఖ్యానిస్తున్నారు కొందరు మనస్తత్వ నిపుణులు.



క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

ఏబీఎన్ ఆమ్రో ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ శుభారంభం చేసింది. నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 7-6 (8/6), 4-6, 10-5తో హ్యూగో నిస్ (మొనాకో)-జిలెన్‌స్కీ (పోలాండ్) జోడీపై గెలిచింది. 96 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ 12 ఏస్‌లు సంధించారు. క్వార్టర్ ఫైనల్లో గ్లాస్‌పూల్ (బ్రిటన్)-హీలియోవారా (ఫిన్లాండ్)లతో బోపన్న-ఎబ్డెన్ తలపడతారు.



నేటి నుంచి రంజీ ట్రోఫీ ఫైనల్

భారత దేశవాళీ క్రికెట్ ప్రతిష్టాత్మక టోర్నీ 'రంజీ ట్రోఫీ' టైటిల్ కోసం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానంలో బెంగాల్, సౌరాష్ట్ర జట్లు నేటి నుంచి అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఉదయం గం. 9:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్-2లో, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. 1990లో చివరిసారి బెంగాల్ జట్టు రంజీ ట్రోఫీ టైటిల్ నెగ్గింది. ఆ తర్వాత నాలుగుసార్లు ఫైనల్ చేరి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. గత పదేళ్లలో ఐదోసారి ఈ మెగా టోర్నీ ఫైనల్ ఆడుతున్న సౌరాష్ట్ర 2020లో బెంగాల్‌ను ఓడించి తొలిసారి విజేత అయింది.

ఆర్‌సీబీ మెంటార్‌గా సానియా మీర్జా

బెంగళూరు: హైదరాబాదీ టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా రాకెట్ వీడాక క్రికెట్ ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టనుంది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో తలపడే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మెంటార్‌గా ఆమెను నియమించారు. ఈ సందర్భంగా 'ఆర్‌సీబీ మహిళల జట్టులో భాగమవడం సంతోషంగా ఉంది. రిటైర్మెంట్ అనంతరం మరో పాత్ర పోషించేందుకు ఈ జట్టు, బ్రాండ్ నా దృక్పథానికి సరిగ్గా సరిపోతుంది. డబ్ల్యూపీఎల్‌తో అమ్మాయిల క్రికెట్ మరో దశకు చేరుతుంది' అని ఆరు గ్రాండ్‌స్లామ్ (డబుల్స్) టైటిల్స్ విజేత సానియా తెలిపింది. ఆమె వచ్చే వారం దుబాయ్ ఈవెంట్‌తో టెన్నిస్‌కు వీడ్కోలు పలకనుంది. ప్రస్తుతం న్యూజిలాండ్ మహిళల జట్టుకు హెడ్ కోచ్‌గా ఉన్న ఆస్ట్రేలియాకు చెందిన బెన్ సాయెర్‌కు ఆర్‌సీబీ హెడ్ కోచ్ బాధ్యతలు అప్పగించారు. సహాయ కోచ్‌గా మలోలన్ రంగరాజన్, ఫీల్డింగ్ కోచ్‌గా వనిత, బ్యాటింగ్ కోచ్‌గా ఆర్‌ఎక్స్ మురళీలను నియమించారు.



బ్లాక్‌హాక్స్ విజయం

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ రెండో విజయం నమోదు చేసింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో బుధవారం హైదరాబాద్ అంచె పోటీలు మొదలయ్యాయి. కొచ్చి బ్లూ స్పైకర్స్ జట్టుతో మ్యాచ్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ 15-13, 10-15, 15-13, 15-6, 13-15తో నెగ్గింది. బ్లాక్‌హాక్స్ తరఫున హేమంత్ 17 పాయింట్లు, ప్రశాంత్ గురు 12 పాయింట్లు స్కోరు చేశారు.



భారత్‌కు రెండో గెలుపు

దుబాయ్: ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ వరుసగా రెండో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో భారత్ 5-0తో గెలిచింది.

'టెస్టు క్రికెట్ పూజారి'

100వ మ్యాచ్ ఆడనున్న చతేశ్వర్ పుజారా ● సుదీర్ఘ కెరీర్‌లో చిరస్మరణీయ ఘనతలెన్నో

సౌతాంప్టన్‌లో 132 నాటౌట్, అడిలైడ్‌లో 123, మెల్‌బోర్న్‌లో 106, జొహన్నెస్‌బర్గ్‌లో 153, సిడ్నీలో 193, కొలంబోలో 145 నాటౌట్, హైదరాబాద్‌లో 204, బెంగళూరులో 92... ఒకటా, రెండా ఎన్ని అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనలు... వాటిలో కొన్ని భారత్ విజయాలకు బాటలు వేశాయి... మరి కొన్ని ఓటమి ఖాయమనుకున్న దశలో ఆపద్బాంధవుడిగా నిలిచి ఆదుకున్న ఇన్నింగ్స్‌లూ ఉన్నాయి... తనకే సాధ్యమైన శైలితో ప్రపంచవ్యాప్తంగా టెస్టు క్రికెట్‌పై చతేశ్వర్ పుజారా తనదైన ముద్ర వేశాడు. పుష్కరకాలంగా భారత బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచిన ఈ రాజ్‌కోట్ ప్లేయర్ ఇప్పుడు అరుదైన 100వ టెస్టు మైలురాయిని చేరుకుంటున్నాడు. రేపటి నుంచి ఆస్ట్రేలియాతో జరిగే టెస్టు పుజారాకు వందోది కానుంది. ఈ ఘనత సాధించిన 13వ భారత ఆటగాడిగా అతను నిలుస్తాడు. **–సాక్షి క్రీడా విభాగం**



టెస్టు కెరీర్: పుజారా 99 టెస్టుల్లో 44.15 సగటుతో 7021 పరుగులు సాధించాడు. ఇందులో 19 సెంచరీలు, 34 అర్ధసెంచరీలు ఉన్నాయి.

525 బంతులు: టెస్టు ఇన్నింగ్స్‌లో అత్యధిక బంతులు ఆడిన భారత క్రికెటర్ పుజారా. ఆసీస్‌పై రాంచీ (2017)లో ఈ రికార్డు నమోదు చేశాడు.

అక్టోబర్ 9, 2010, బెంగళూరు... భారత్, ఆస్ట్రేలియా రెండో టెస్టు... మ్యాచ్ ఆరంభానికి కొద్దిసేపు ముందు భారత స్టార్ బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్ నేరుగా చతేశ్వర్ పుజారా వద్దకు వచ్చాడు. 'నా వెన్నునొప్పి తగ్గలేదు, ఈ మ్యాచ్ ఆడలేనేమో' అని పుజారాతో చెప్పాడు. దాంతో పుజారాకు అర్థమైపోయింది ఈ మ్యాచ్‌తో తాను టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేయబోతున్నానని. సరిగ్గా ఐదేళ్ల క్రితం అదే తేదీన తాను ఎంతగానో ప్రేమించే, తన కెరీర్ గురించి కలలుగన్న తల్లి చనిపోయిన రోజది! ఒక వైపు ఆనందం, మరోవైపు అమ్మను గుర్తు చేసుకుంటూ మ్యాచ్ బరిలోకి దిగిన పుజారా తొలి ఇన్నింగ్స్ 3 పరుగులకే పరిమితమైంది. రెండో ఇన్నింగ్స్‌లో ద్రవిడ్‌ను కాదని పుజారాను ధోని మూడో స్థానంలో పంపడం అందరినీ ఆశ్చర్యపర్చింది. అయితే కీలక అర్ధసెంచరీతో అతను రాబోయే రోజుల గురించి సంకేతాలిచ్చాడు. హైదరాబాద్‌లో న్యూజిలాండ్‌తో ఆడిన మరో మ్యాచ్‌లో చేసిన 159 పరుగులతో ద్రవిడ్ స్థానాన్ని భర్తీ చేస్తూ 'నయా వాల్'గా గుర్తింపు తెచ్చుకున్న పుజారా ప్రస్థానం పలు చిరస్మరణీయ విజయాల మీదుగా ఇప్పుడు వందో టెస్టు వరకు నిర్విఘ్నంగా సాగింది.

అదే అతడి బలం...

పుజారా బ్యాటింగ్ శైలిని చూస్తే సహజంగానే పాతకాలపు క్రికెట్ గుర్తుకొస్తుంది. అసలైన సంప్రదాయ టెస్టును బతికిస్తున్న కొద్ది మందిలో కచ్చితంగా పుజారా పేరు ఉంటుంది. అద్భుతమైన టెక్నిక్ లేకపోయినా తన అసమాన పట్టుదల, ఏకాగ్రతతోనే అతను ప్రపంచ క్రికెట్‌లో తగిన గుర్తింపు తెచ్చుకున్నాడు. దుర్భేద్యమైన డిఫెన్స్‌తో గంటలపాటు క్రీజ్‌లో నిలిచిపోయి బౌలర్ల సహనం పరీక్షించడం, వారు అలసిపోయేలా చేసి ఆపై పరుగులు రాబట్టడం అతని శైలి. ప్రత్యర్థి ఎవరైనా, వేదిక ఏదైనా సుదీర్ఘ సమయం పాటు ఆడే మ్యాచ్ ఫిట్‌నెస్ ఉంటే చాలు అనే నమ్మే పుజారా తన బలాన్ని నమ్ముకొనే భారత క్రికెట్‌లో ఇన్నేళ్లు కొనసాగాడు. 'నా బ్యాటింగ్ శైలి గురించి చర్చ, విమర్శలు అనవసరం. టెస్టుల్లో పరిస్థితిని బట్టి పరుగులు చేయడం ముఖ్యం. ఎలా చేశామన్నది కాదు' అని దీనిపై అతను స్పష్టతనిచ్చాడు. ఈ క్రమంలోనే టీమిండియా గొప్ప విజయాల్లో అతను కీలకపాత్ర పోషించాడు. బ్యాటర్లకు నరకంలా మారిన జొహన్నెస్‌బర్గ్ పిచ్‌పై ఒక టెస్టు లో 54వ బంతికి తొలి పరుగు తీయడం కూడా అలాంటిదే. ఒకప్పుడు సౌరాష్ట్ర తరఫున దేశవాళీ క్రికెట్ ఆడిన తండ్రి అరవింద్ పుజారానే చతేశ్వర్‌కు తొలి గురువు కాగా, ఆయన పర్యవేక్షణలోనే అతను రాటుదేలాడు. అండర్-14 స్థాయిలోనే ట్రిపుల్ సెంచరీ సాధించి ఆపై అండర్-19 స్థాయి వరకు వేగంగా పుజారా దూసుకుపోయాడు. రంజీ ట్రోఫీలో నాలుగు సీజన్ల పాటు 50 సగటుతో పరుగులు చేయడంతో 22 ఏళ్ల వయసులో భారత జట్టులో అవకాశం దక్కింది.

ఆసీస్ గడ్డపై అద్భుతాలు...

సుదీర్ఘ కెరీర్‌లో ఎన్ని విజయాలు ఉన్నా ప్రతీ ఆటగాడికి తనకంటూ కొన్ని ప్రత్యేక క్షణాలు కచ్చితంగా ఉంటాయి. అవి వ్యక్తిగతమైనవి కావచ్చు లేదా జట్టు కోసం సాధించిన ఘనతలు కావచ్చు. అలాంటి ప్రదర్శనలే ఆ ప్లేయర్‌ను అందరూ గుర్తుంచుకునేలా శిఖరాన నిలబెడతాయి. అత్యంత బలమైన ఆస్ట్రేలియా జట్టును వారి సొంతగడ్డపైనే వరుసగా రెండు సిరీస్‌లలో ఓడించడం భారత్‌కు సంబంధించి అసాధారణ ఘనత. ఈ రెండు సందర్భాల్లోనూ పుజారా పాత్ర ప్రత్యేకం. 2018-19 సిరీస్‌లో 3 సెంచరీలు సహా ఏకంగా 521 పరుగులు సాధించి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. 2020-21 సిరీస్‌లో కూడా పుజారా మళ్లీ కీలకంగా మారాడు. ముఖ్యంగా చారిత్రాత్మక బ్రిస్బేన్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 211 బంతుల్లో చేసిన 56 పరుగులు జట్టు గెలుపులో ప్రధాన పాత్ర పోషించాయి. ముఖ్యంగా ఆసీస్ పేసర్ల దెబ్బలను ఓర్చుకుంటూ (9 సార్లు బంతి అతని శరీరాన్ని బలంగా తాకింది) చివరి రోజు అసమాన పోరాటం ప్రదర్శించడం విశేషం. సీనియర్ల గైర్హాజరులో 5 వన్డేలు ఆడే అవకాశం దక్కినా ఆ ఫార్మాట్ తనది కాదనే విషయం పుజారాకు బాగా తెలుసు. అయితేనేం, భారత టెస్టు క్రికెట్‌కు సంబంధించి పుజారా ఒక అమూల్య వజ్రం అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

మెరిసిన దీప్తి, రిచా

- మహిళల టి20 ప్రపంచకప్‌లో భారత్‌కు రెండో గెలుపు
- వెస్టిండీస్‌కు రెండో పరాజయం
- 18న ఇంగ్లండ్‌తో టీమిండియా మ్యాచ్





కేప్‌టౌన్: టైటిల్ సాధించడమే లక్ష్యంగా టి20 ప్రపంచకప్‌లో బరిలోకి దిగిన భారత మహిళల జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. గ్రూప్'బి'లో బుధవారం హర్మన్‌ప్రీత్ సేన ఆరు వికెట్ల తేడాతో వెస్టిండీస్‌పై గెలిచింది. మొదట వెస్టిండీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 118 పరుగులు చేసింది. ఓపెనర్ స్టెఫానీ టేలర్ (40 బంతుల్లో 42; 6 ఫోర్లు), షెమైన్ క్యాంప్‌బెల్ (36 బంతుల్లో 30; 3 ఫోర్లు) రాణించారు. భారత బౌలర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ (3/15) పొదుపైన బౌలింగ్‌తో కట్టడి చేసింది. దీంతోపాటు అంతర్జాతీయ టి20ల్లో 100 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా ఘనత వహించింది. తర్వాత భారత్ 18.1 ఓవర్లలో 4 వికెట్లే కోల్పోయి 119 పరుగులు చేసి గెలిచింది. టాపార్డర్‌లో స్మృతి మంధాన (10), జెమీమా (1) విఫలమైనా... మరో ఓపెనర్ షఫాలీ వర్మ (23 బంతుల్లో 28; 5 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (42 బంతుల్లో 33; 3 ఫోర్లు) రాణించారు. రిచా ఘోష్ (32 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు) ధాటిగా ఆడి అజేయంగా నిలిచింది. 43 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయిన దశలో హర్మన్, రిచా నాలుగో వికెట్‌కు 72 పరుగులు జోడించారు.

స్కోరు వివరాలు

వెస్టిండీస్ ఇన్నింగ్స్: హేలీ మాథ్యూస్ (సి) రిచా (బి) పూజ 2; స్టెఫానీ (ఎల్బీడబ్ల్యూ) (బి) దీప్తి శర్మ 42; షెమైన్ (సి) స్మృతి (బి) దీప్తి శర్మ 30; హెన్రీ (రనౌట్) 2; చెడియాన్ (నాటౌట్) 21; షబిక (బి) రేణుక 15; అఫీ ఫ్లెచర్ (బి) దీప్తి శర్మ 0; రషడ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 118. వికెట్ల పతనం:** 1-4, 2-77, 3-78, 4-79, 5-114, 6-115. **బౌలింగ్:** రేణుక 4-0-22-1, పూజ 4-1-21-1, రాజేశ్వరి 4-0-30-0, దీప్తి శర్మ 4-0-15-3, షఫాలీ 1-0- 5-0, రాధా యాదవ్ 1-0-8-0, దేవిక 2-0- 16-0.

భారత్ ఇన్నింగ్స్: షఫాలీ (సి) ఫ్లెచర్ (బి) కరిష్మా 28; స్మృతి (స్టంప్డ్) రషడ (బి) కరిష్మా 10; జెమీమా (సి అండ్ బి) హేలీ మాథ్యూస్ 1; హర్మన్‌ప్రీత్ (సి) షెమైన్ (బి) హెన్రీ 33; రిచా ఘోష్ (నాటౌట్) 44; దేవిక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (18.1 ఓవర్లలో 4 వికెట్లకు) 119. వికెట్ల పతనం:** 1-32, 2-35, 3-43, 4-115. **బౌలింగ్:** షమిలియా 2.1-0-27-0, హెన్రీ 3-1-21-1, హేలీ 4-0-12-1, కరిష్మా 4-0-14-2, అఫీ ఫ్లెచర్ 2-0-24-0, షకీరా 2-0-11-0, షబిక 1-0-10-0.

భారత్ నంబర్‌వన్... కాదు కాదు నంబర్ 2

ఐసీసీ తప్పుడు లెక్కలతో గందరగోళం

దుబాయ్: టెస్ట్ టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ రెండో ర్యాంక్ నుంచి నంబర్‌వన్ ర్యాంక్‌కు ఎగబాకిందని ఐసీసీ బుధవారం మధ్యాహ్నం ప్రకటించింది. దాంతో ఇప్పటికే వన్డే, టి20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న భారత్ టెస్టుల్లోనూ టాప్ ర్యాంక్ అందుకోవడంతో ఏకకాలంలో మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) టీమిండియా నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచిందని అభిమానులు సంబరపడ్డారు. అయితే భారత్ ఇంకా టాప్ ర్యాంక్‌కు చేరుకోలేదని... రెండో ర్యాంక్‌లోనే కొనసాగుతోందని... తమ రేటింగ్ పాయింట్ల లెక్కల్లో తప్పిదంతో ఈ గందరగోళం చోటు చేసుకుందని బుధవారం రాత్రి ఐసీసీ వివరణ ఇచ్చింది. ప్రస్తుత టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా 126 రేటింగ్‌తో టాప్ ర్యాంక్‌లో, భారత్ 115 రేటింగ్‌తో రెండో ర్యాంక్‌లో ఉన్నాయి.



సినిమా

మధుర గతమా...


● దేవ్ మోహన్, సమంత

శకుంతలగా సమంత, దుష్యంతుడిగా దేవ్ మోహన్ నటించిన చిత్రం 'శాకుంతలం'. గుణశేఖర్ దర్శకత్వంలో 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ ఈ చిత్రాన్ని నిర్మించారు. శకుంతల-దుష్యంతుడి ప్రేమ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఏప్రిల్ 14న విడుదల కానుంది. మణిశర్మ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'మధుర గతమా.. కాలాన్నే ఆపక ఆగావే సాగక, అంగుళికమా జాలైనా చూపక చేజారావే వంచికా..' అంటూ సాగే పాటని బుధవారం విడుదల చేశారు. శ్రీమణి రాసిన ఈ పాటని అర్మాన్ మాలిక్, శ్రేయా ఘోషల్ పాడారు. ఈ చిత్రంలో మోహన్‌బాబు, ప్రకాశ్‌రాజ్, మధుబాల, గౌతమి తదితరులు నటించారు.

కొత్త తరం ప్రేమకథ


● దీపక్, అల్లు అరవింద్

'**అ**తడు, ఆర్య, పౌర్ణమి, భద్ర' వంటి చిత్రాల్లో బాలనటుడిగా నటించిన దీపక్ సరోజ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. వి. యశస్వి దర్శకత్వంలో జయ ఆడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్‌ను డైరెక్టర్ హరీష్ శంకర్ ఆవిష్కరించగా, నిర్మాత అల్లు అరవింద్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''కొత్త తరం ప్రేమకథగా రూపొందిన చిత్రం ఇది. ఈ వేసవిలో రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. తన్వి నేగి, నాదిని, ఆనంద్, కల్యాణీ నటరాజన్, మాథ్యూ వర్గీస్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: రథన్, కెమెరా: శ్యామ్ కె. నాయుడు, లైన్ ప్రొడ్యూసర్: బి. శ్యామ్‌కుమార్.


● రానా, వెంకటేశ్

నాగ వెర్సస్ రానా

బాబాయ్ వెంకటేశ్, అబ్బాయ్ రానా తండ్రీకొడుకులుగా నటించిన వెబ్ సిరీస్ 'రానా నాయుడు'. నాగ పాత్రలో వెంకటేశ్, రానా నాయుడుగా రానా నటించారు. అమెరికన్ సిరీస్ 'రే డోనోవన్'కు ఇండియన్ అడాప్షన్‌గా రూపొందిన ఈ సిరీస్ మార్చి 10 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా బుధవారం ముంబైలో 'రానా నాయుడు' ట్రైలర్‌ను విడుదల చేశారు. సుందర్ ఆరోన్, కరణ్ అన్షుమాన్ నిర్మించారు. కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ ఎస్. వర్మ దర్శకత్వం వహించారు. "రానాకి అతని తండ్రి నాగతో పెద్ద సమస్య ఉంటుంది. ఈ తండ్రీకొడుకుల మధ్య వచ్చే సమస్య ప్రధానాంశంగా ఈ సిరీస్ సాగుతుంది" అని దర్శక-నిర్మాతలు పేర్కొన్నారు. "రానా నాయుడు పాత్ర సవాలుగా అనిపించింది" అన్నారు రానా. వెంకటేశ్, సుర్వీన్ చావ్లా, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, గౌరవ్ చోప్రా, ప్రియా బెనర్జీ, ఆశిష్ విద్యార్థి తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సినిమాతో జాన్వీ ఎంట్రీ?

దివంగత ప్రముఖ నటి శ్రీదేవి పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ టాలీవుడ్ ఎంట్రీ గురించి ఎప్పటికప్పుడు వార్తలు వస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది ఆ వార్త నిజం అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. 'జనతా గ్యారేజ్' తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందనున్న చిత్రం ద్వారా జాన్వీ తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పనున్నారని సమాచారం. గత వారం జాన్వీ హైదరాబాద్ వచ్చారని తెలిసింది. ఎన్టీఆర్ సినిమాకి సంబంధించిన ఫోటోషూట్‌లో పాల్గొనడానికే భాగ్యనగరంలోకి ఈ బ్యూటీ అడుగుపెట్టారట. ఇక ఎన్టీఆర్ సినిమాలో హీరోయిన్‌గా నటించడం కోసం ఓ బాలీవుడ్ మూవీని కూడా జాన్వీ వదులుకున్నారని టాక్. సో... జాన్వీ కపూర్ టాలీవుడ్ ఎంట్రీ దాదాపు ఖరారైనట్లే అని ఊహించవచ్చు. ఈ నెల 24న ఎన్టీఆర్ సినిమా ప్రారంభం కానుందట. మరి ఆ రోజు హీరోయిన్ని ప్రకటిస్తారేమో చూడాలి.


● నాగవంశీ, సంయుక్త మీనన్, త్రివిక్రమ్, ధనుష్, వెంకీ అట్లూరి, తమన్

సార్ మీ అందరి కథ – ధనుష్

''సార్' సినిమా అన్నివర్గాల వారికి నచ్చుతుంది. ఎందుకంటే ప్రేక్షకులు వాళ్ల కథతో కనెక్ట్ అవుతారు. 'సార్' మీ అందరి కథ.. మీకు నచ్చుతుందని, అందరూ ఎంజాయ్ చేస్తారనే నమ్మకం ఉంది'' అని హీరో ధనుష్ అన్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ధనుష్, సంయుక్త మీనన్ జంటగా తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'సార్' (తమిళంలో 'వాతి'). శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ శుక్రవారం విడుదలకానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ధనుష్ మాట్లాడుతూ– ''2002లో నా తొలి చిత్రం విడుదలయినప్పుడు నెర్వస్‌గా ఉన్నా.. ఇప్పుడు 2023లో నా తొలి తెలుగు సినిమా రిలీజ్ అవుతోంది.. ఇప్పుడు కూడా అలాగే ఉంది. తమిళ్, హిందీ, ఇంగ్లిష్ సినిమాలు చేశాను.. ప్రతి సినిమాని నా మొదటిదిగానే భావిస్తా. 'సార్' ఒక సింపుల్ ఫిల్మ్.. కానీ, గ్రాండ్ ఎమోషన్స్, మెసేజ్ ఉంటుంది. నా తర్వాతి తెలుగు సినిమాకి తప్పకుండా తెలుగులో మాట్లాడతాను'' అన్నారు. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ– ''ఒక మనిషి జీవన శైలిని మార్చేది చదువు మాత్రమే. అంత గొప్ప ఆయుధాన్ని డబ్బులేని వాళ్లకి దూరం చేయడం ఎంత వరకు న్యాయం? అనే ప్రశ్నే 'సార్' సినిమాలో వెంకీ అడిగే ప్రయత్నం చేశాడు. భారతీయ సినిమా చరిత్రలో ఒకప్పటి తరంలో శివాజీ గణేశన్‌గారు, కమల్ హాసన్‌గారు, తెలుగులో ఎన్టీఆర్‌గారు, నాగేశ్వర రావుగారు.. ఇలా తొలి తరం నటుల్లో ఎంత గొప్పవారు ఉన్నారో తర్వాతి తరం గొప్ప నటుల్లో ధనుష్‌కి నేను టాప్ ప్లేస్ ఇస్తాను.. ఎందుకంటే సినిమా హిట్ అయినా, ఫ్లాప్ అయినా ఆయనకు భయం లేదు. పని చేయడాన్ని మాత్రమే ఇష్టపడతాడు. అలా పనిచేసుకుంటూ పోయే ధనుష్‌ని ఎవరూ ఆపలేరు'' అన్నారు. ''మా సార్' చిత్రం ప్రీమియర్స్ ఒక రోజు ముందే వేస్తున్నామంటే సినిమాపై మాకు ఎంత నమ్మకం ఉందో జనాలకు ఇప్పటికే అర్థమై ఉంటుంది.. చాలా మంచి సినిమా ఇది.. ఎవరూ నిరుత్సాహపడరు'' అన్నారు సూర్యదేవర నాగవంశీ. ''నా 'తొలి ప్రేమ' సినిమా తర్వాత ఇంత నమ్మకంగా చెబుతున్నా. 'సార్' ప్రీమియర్స్ అయిన తర్వాత వచ్చే మౌత్ టాక్‌తో 17న అందరూ సినిమాకి వస్తారు'' అన్నారు వెంకీ అట్లూరి. ఈ వేడుకలో నిర్మాత ఎస్.రాధాకృష్ణ, కెమెరామేన్ జె.యువరాజ్, నటుడు సాయికుమార్, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి పాల్గొన్నారు.


● జాన్వీ కపూర్

మన జీవితాల్లోనివే ఈ సినిమాలో ఉన్నాయి

– సుష్మిత కొణిదెల


● విష్ణుప్రసాద్, సుష్మిత, నాగబాబు, గౌరి, సంతోష్ శోభన్, ప్రశాంత్

''**మ**న జీవితంలో మనం అనుభవించే నిజమైన భావోద్వేగాలు, లవ్, ఫెంటాస్టిక్ డ్రామా 'శ్రీదేవి శోభన్‌బాబు'లో ఉంటాయి. ప్రశాంత్‌తో పాటు యూనిట్ అంతా ఈ సినిమాకి మనసు పెట్టి పని చేశారు'' అని సుష్మిత కొణిదెల అన్నారు. సంతోష్ శోభన్, గౌరి జి. కిషన్ జంటగా ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శ్రీదేవి శోభన్‌బాబు'. సుష్మిత కొణిదెల, విష్ణు ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకలో సుష్మిత మాట్లాడుతూ– ''మా నాన్నగారి (చిరంజీవి) ఆశీస్సులతో మా 'శ్రీదేవి శోభన్‌బాబు'ని మీ 'శ్రీదేవి శోభన్‌బాబు'గా థియేటర్స్‌కి తెస్తున్నాం'' అన్నారు. ''చిరంజీవిగారికి నేను పెద్ద అభిమానిని. ఓ కాఫీ షాప్‌లో సుష్మిత అక్కని కలిసి, 'నేను చిరంజీవి సార్ అభిమానిని.. డైరెక్టర్ అవుదామని ప్రయత్నిస్తున్నాను' అన్నాను. అలా చెప్పిన ఐదు రోజులకే అక్క నుంచి కాల్ వచ్చింది.. నాన్న (చిరంజీవి) కథ వింటానన్నారు.. ఇంటికి రమ్మన్నారని అక్క అన్నారు. అక్కడికి వెళ్లగానే చిరంజీవిగారు సొంత మనిషిలా నన్ను పలకరించారు'' అన్నారు. ''అచ్చమైన తెలుగు సినిమా 'శ్రీదేవి శోభన్‌బాబు'' అన్నారు సంతోష్ శోభన్. ''మా చిత్రాన్ని అందరూ ఎంజాయ్ చేస్తారు'' అన్నారు విష్ణు ప్రసాద్.

అందుకే తెలుగు సినిమాలంటే ఇష్టం


● కశ్మీర

''**మం**చి కంటెంట్‌కు కమర్షియల్ అంశాలు జోడించి, తెలుగు సినిమాలు తీస్తుంటారు. అందుకే తెలుగు సినిమాలంటే నాకు ఇష్టం. ఇలాంటి తరహా సినిమాలు తీయడం రిస్క్ అయినప్పటికీ చాలెంజింగ్‌గా తీసుకుని ఇక్కడ తెరకెక్కిస్తారు. అయితే మా (మరాఠీ) సినిమాలు కమర్షియల్‌గా కాకుండా ఎక్కువగా రియలిస్టిక్‌గా ఉంటాయి'' అని అన్నారు కశ్మీరా పరదేశి. కిరణ్ అబ్బవరం, కశ్మీరా పరదేశి జంటగా మురళీ కిశోర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో కశ్మీరా మాట్లాడుతూ– ''తిరుపతి నేపథ్యంలో వస్తున్న సినిమా 'వినరో భాగ్యము విష్ణు కథ'. తిరుపతిలో షూటింగ్ చేయడం వల్ల పాజిటివ్ వైబ్రేషన్స్ కలిగాయి. ఈ చిత్రంలో నటనకు స్కోప్ ఉన్న దర్శన పాత్ర చేశాను. గీతా ఆర్ట్స్ వంటి బ్యానర్‌లో సినిమా చేయడం కంఫర్ట్‌గా అనిపించింది. ప్రస్తుతం తమిళంలో ఓ సినిమా, హిందీలో ఓ సినిమా చేస్తున్నాను. తెలుగులో చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

బంగారు భూగోళమా...


● చంద్రబోస్

ఈ ఏడాది జనవరిలో కాలిఫోర్నియాలోని బెవర్లీ హిల్స్‌లో గల 'ది బెవర్లీ హిల్టన్' వేదికగా 80వ గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ ప్రదానోత్సవం జరిగిన విషయం తెలిసిందే. ఈ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ స్కోర్' విభాగంలో 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాటకు అవార్డు లభించింది. ఈ పాటకు గాను సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి, గీత రచయిత చంద్రబోస్‌లకు అవార్డు దక్కింది. అవార్డుల ప్రదానోత్సవం రోజున కీరవాణి ఆ అవార్డును వేదికపైనే అందుకున్నారు. కాగా, ప్రస్తుతం లాస్‌ఏంజెల్స్‌లో ఉన్న రచయిత చంద్రబోస్ గోల్డెన్ గ్లోబ్ అవార్డును స్వీకరించారు. 'గోల్డెన్ గ్లోబ్ విన్నర్ చంద్రబోస్ మా కార్యాలయానికి వచ్చి ఆయనకు చెందిన అవార్డును (నాటు నాటు పాటకు..) స్వీకరించారు. ఆయనకు మరోసారి శుభాకాంక్షలు'' అని గోల్డెన్ గ్లోబ్ ప్రతినిధులు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఈ విషయంపై చంద్రబోస్ స్పందిస్తూ ''మనస్ఫూర్తిగా అందరికీ ధన్యవాదాలు. బంగారు భూగోళమా.. (లవ్‌యూ)'' అని ట్వీట్ చేశారు. 'నాటు నాటు' పాట 95వ ఆస్కార్ అవార్డ్స్‌లోని 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో నామినేట్ అయిన సంగతి తెలిసిందే. ఆస్కార్ వేడుక మార్చి 12 (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 13)న లాస్ ఏంజిల్స్‌లో జరగనుంది.

సాక్షి బిజినెస్
గురువారం
16-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	243	61,275
నిఫ్టీ ▲	86	18,016

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,963	▲	2
డోజోన్స్	33,901	▽	188
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,998	▲	44
డాక్స్	15,506	▲	126
షాంఘై	3,280	▽	13
నికాయ్	27,501	▽	201

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (24 క్యారట్)	56,478 ▽	540
బంగారం (22 క్యారట్)	56,252 ▽	538
వెండి (కిలో)	65,411 ▽	430

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.15	83.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.82	91.33
€	యూరో	ఎస్‌బీఐ	99.18	102.54
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	61.43	63.42
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.51	58.90
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.34	63.35
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.08	22.76
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.65	23.44
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.99	13.16

పెరిగిన ఎస్‌బీఐ రుణ రేటు



ముంబై: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన నిధుల సమీకరణ ఆధారిత రుణరేటు–ఎంసీఎల్‌ఆర్‌ను అన్ని కాలపరిమితులపై 10 బేసిస్ పాయింట్లు లేదా 0.1 శాతం (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెంచింది. ఈ వారం మొదట్లో ఆర్‌బీఐ బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు రెపోను పావు శాతం పెంచడం (6.5 శాతానికి అప్) దీనికి నేపథ్యం. ఎస్‌బీఐ రేట్ల పెంపు ఇలా ఉంది.

- ఓవర్‌నైట్ రుణ రేటు 10 బేసిస్ పాయింట్లు పెరిగి 7.95 శాతానికి చేరింది.
- 1, 3 నెలల రేట్లు 8.10 శాతానికి చేరాయి.
- ఆరు నెలల రుణరేటు 8.40 శాతానికి ఎగసింది.
- రుణాలకు సాధారణంగా ప్రాతిపదికగా ఉండే ఏడాది రేటు 8.40 శాతానికి పెరిగింది.
- రెండేళ్ల రేటు 8.60 శాతానికి మూడేళ్ల రేటు 8.70 శాతానికి ఎగసింది.

ఏప్రిల్ 1 నుంచే రిటర్నుల ఫైలింగ్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2022–23) నూతన రిటర్నులు (ఐటీఆర్‌లు) ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి తెలిపింది. దీంతో అసెస్‌మెంట్ సంవత్సరం మొదటి రోజు నుంచే (2023 ఏప్రిల్ 1) రిటర్నులు దాఖలు చేసుకోవడం వీలవుతుంది. గతేడాదితో పోలిస్తే, ఐటీఆర్‌లలో పెద్దగా మార్పులు చేయలేదని తెలిపింది. ఆదాయ పన్ను చట్టం 1961లో చేసిన సవరణల మేరకు స్వల్ప మార్పులను ప్రవేశపెట్టినట్టు స్పష్టం చేసింది. ఐటీఆర్ 1 నుంచి ఐటీఆర్ 7 వరకు పత్రాలను సీబీడీటీ నోటిఫై చేయడం తెలిసిందే. సాధారణంగా ఏటా మార్చి లేదా ఏప్రిల్‌లో ఐటీఆర్‌లను నోటిఫై చేస్తుంటారు. ఈ విడత ముందుగానే ఈ ప్రక్రియను సీబీడీటీ పూర్తి చేసింది.


కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-2-2023	
విశాఖ	440–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	409–00
విజయవాడ	409–00
రిటైల్ ధర (డజను)	66.00
15-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	389–00
వరంగల్	391–00
రిటైల్ ధర	4.45

రెండోనెలా ఎగుమతులు కిందికే...

- జనవరిలో 7 శాతం డౌన్
- విలువలో 32.91 బిలియన్ డాలర్లు
- డిమాండ్ మందగమనం నేపథ్యం

న్యూఢిల్లీ: భారత్ వస్తు ఎగుమతులు వరుసగా రెండోనెల జనవరిలోనూ క్షీణతను నమోదుచేశాయి. 2022 ఇదే నెలతో పోల్చి ఎగుమతులు 6.58 శాతం తగ్గి, 32.91 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అంతర్జాతీయ మందగమన పరిస్థితులు దీనికి నేపథ్యం. గడచిన 10 నెలలుగా ఇంజనీరింగ్ గూడ్స్, ముడి ఇనుము, ప్లాస్టిక్, రత్నాలు–ఆభరణాల రంగాలు క్షీణ రేటులో ఉన్నాయి.



దిగుమతులూ క్షీణతే..

దిగుమతులు కూడా జనవరిలో 3.63 శాతం క్షీణించాయి. విలువలో 50.66 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. పసిడి దిగుమతులు ఏప్రిల్–జనవరి మధ్య 11.26% తగ్గి 29 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

వాణిజ్యలోటు 12 నెలల కనిష్టం

ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్యలోటు జనవరిలో 12 నెలల కనిష్టంగా 17.75 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

10 నెలల్లో...

ఆర్థిక సంవత్సరం 10 నెలల కాలంలో (ఏప్రిల్–జనవరి) వస్తు ఎగుమతులు 8.51 శాతం పెరిగి 369.25 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 21.89 శాతం పెరిగి 602.20 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వెరసి వాణిజ్యలోటు ఈ కాలంలో 233 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. గత ఆర్థిక సంవత్సరం భారత్ ఎగుమతుల విలువ 400 బిలియన్ డాలర్లుపైబడగా, 2022–23లో కూడా దాదాపు ఇదే గణాంకాలు నమోదయ్యే అవకాశం కనిపిస్తోంది. తాజా సమీక్షా కాలం 10 నెలల్లో క్రూడ్ దిగుమతుల విలువ 53.54 శాతం పెరిగి 178.45 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

రష్యా నుంచి 384 శాతం పెరిగిన దిగుమతులు

2022–23 ఏప్రిల్–జనవరి మధ్య రష్యా నుంచి భారత్ దిగుమతులు ఏకంగా 384 శాతం పెరగడం గమనార్హం. విలువలో ఏకంగా 37.31 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. క్రూడ్ ఈ విలువలో కీలక వెయిటేజ్ పొందింది. 2021–22లో 9.86 బిలియన్ డాలర్ల దిగుమతులతో రష్యా భారత్‌కు 18వ అతి పెద్ద దిగుమతిదారుగా ఉంది. తాజా సమీక్షా నెల్లో ఈ అంకె 4కు తగ్గిపోయింది.

ఆర్థిక మంత్రి సూచనలు..

అంతర్జాతీయంగా మందగమనం వచ్చే అవకాశాలను, తమ తమ వ్యాపారాలపై దాని ప్రభావాల గురించి ఎగుమతిదారులు ముందస్తుగానే అంచనాలు వేసుకుని సన్నద్ధంగా ఉండాలని అసోచాం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ ఉండాలని పేర్కొన్నారు.

రూపాయిలో వాణిజ్యానికి ఆసక్తి

భారత్‌తో రూపాయిలో వాణిజ్య కార్యకలాపాల నిర్వహణకు పలు దేశాల్లో ఆసక్తి పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇందుకు వీలుగా పలు బ్యాంకులు ప్రత్యేక వ్యాస్ట్రో అకౌంట్లను ప్రారంభిస్తున్నాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) సంతోష్ కుమార్ పేర్కొన్నారు. అకౌంట్లు ప్రారంభించిన జాబితాలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యుకో బ్యాంక్‌సహా 20 బ్యాంకులు ఉన్నట్లు ఆయన తెలిపారు. రష్యాసహా రూపాయిలో ట్రేడింగ్‌కు ఆసక్తి చూపిస్తున్న దేశాల్లో కొన్ని ఆఫ్రికన్ దేశాలు ఉన్నాయి. భారత్ పొరుగు దేశాలు బంగ్లాదేశ్, శ్రీలంక, మారిషస్‌లు కూడా వీటిలో ఉన్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, ఈ నేపథ్యంలో ఆ దేశంపై అంతర్జాతీయ ఆంక్షలు, దీనితో డాలర్ మారకంలో వాణిజ్యంలో ఇబ్బందులు వంటి పరిణామాలు రూపాయిలో వాణిజ్యానికి దారితీసిన సంగతి తెలిసిందే.

ఏపీలో డ్రోగో డ్రోన్స్ శిక్షణ కేంద్రం

కంపెనీ ఎండీ యశ్వంత్ బొంతు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో .. డ్రోన్ ఆపరేటర్లను తయారు చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తాడేపల్లిలో శిక్షణ కేంద్రాన్ని డ్రోగో డ్రోన్స్ ప్రారంభించింది. 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ సెంటర్ ఏర్పాటైంది. రాష్ట్రంలో డ్రోన్ పైలట్లకు శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన అనుమతులు పొందిన తొలి ప్రైవేట్ సంస్థ తమదేనని డ్రోగో డ్రోన్స్ ఎండీ యశ్వంత్ బొంతు తెలిపారు. తాడేపల్లిలో రెండు నెలల్లో డ్రోన్స్ తయారీ యూనిట్ ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. ఎన్‌ఎండీసీ, జీఎండీసీ, ఎంఈఐఎల్, జీఏఐఎల్, ఏపీఎస్‌ఎస్‌ఎల్‌ఆర్ తదితర సంస్థలకు అవసరమైన భూ సర్వేలు చేసినట్లు తెలిపారు. కాగా, పదో తరగతి ఉత్తీర్ణులై, 18 సంవత్సరాలు నిండిన వారు డ్రోన్ ఆపరేటర్‌గా శిక్షణ తీసుకోవచ్చు. డీజీసీఏ రూపొందించిన సిలబస్ ప్రకారం వారంపాటు శిక్షణ ఉంటుంది. బ్యాచ్‌లో 30 మంది విద్యార్థులను చేర్చుకుంటారు. ఫిబ్రవరి 20 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

కలిసొచ్చిన ఆఖరి గంట కొనుగోళ్లు

- 18 వేలపైకి నిఫ్టీ
- సెన్సెక్స్ లాభం 243 పాయింట్లు



ముంబై: ఆఖరి గంట కొనుగోళ్లతో స్టాక్ సూచీలు బుధవారం ఇంట్రాడే నష్టాలను భర్తీ చేసుకొని లాభాలతో ముగిశాయి. వరుసగా నాలుగో ట్రేడింగ్‌లోనూ విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే మొగ్గుచూపడంతో మార్కెట్ వర్గాల్లో విశ్వాసం నెలకొంది. మూడువారాల ఆటుపోట్ల ట్రేడింగ్ తర్వాత నిఫ్టీ ఎట్టకేలకు 18000 స్థాయిపై ముగిసింది. ప్రపంచ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాల ప్రభావంతో ఉదయం సూచీలు ఫ్లాటుగా మొదలయ్యాయి. తొలి సెషన్‌లో బలహీనంగా కదలాడాయి. ఉదయం సెన్సెక్స్ 42 పాయింట్ల నష్టంతో 60,990 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 61,353 – 60,750 మధ్య కదలాడింది. చివరికి 243 పాయింట్లు పెరిగి 61,275 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 33 పాయింట్ల పతనంతో 17,897 వద్ద ప్రారంభమైంది. ట్రేడింగ్‌లో 17,854 – 18,034 శ్రేణిలో ఊగిసలాడింది. ఆఖరికి 86 పాయింట్లు బలపడి 18వేల స్థాయిపైన 18,016 వద్ద నిలిచింది. ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా షేర్లు మాత్రమే నష్టాలను చవిచూశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.432 కోట్ల షేర్లను, దేశీ ఇన్వెస్టర్లు రూ.517 కోట్ల షేర్లను కొన్నారు.

- హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో విశ్వాసం కోల్పోతున్న ఇన్వెస్టర్లలో తిరిగి భరోసా నింపేందుకు అదానీ గ్రూప్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. మొత్తం పదింటికి గానూ ఆరు కంపెనీల షేర్లు లాభాలతో ముగిశాయి.

ఫోక్స్‌వ్యాగన్ విక్రయాల్లో 58% వృద్ధి

ముంబై: ఫోక్స్‌వ్యాగన్ ఇండియా 2022లో రికార్డు స్థాయి వాహనాలను విక్రయించింది. వార్షిక ప్రాతిపదికన 58% వృద్ధిని సాధించింది. కస్టమర్ల ఆంక్షలకు అనుగుణంగా మోడళ్లను తీర్చిదిద్దడం, ముఖ్యంగా టైగన్ మోడల్‌కు లభించిన భారీ స్పందన అమ్మకాల వృద్ధికి దోహదపడ్డాయని కంపెనీ తెలిపింది. ''భారతీయ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక బ్రాండ్‌ను రూపొందించాము. భిన్న ఉత్పత్తుల తయారీ, విభిన్నమైన మార్కెట్ వ్యూహాల వల్ల కిందటేడాది బలమైన పనితీరు కనబరిచాము. ఈ ఏడాదిలోనూ మెరుగైన ప్రదర్శనతో మార్కెట్‌ను మరింత పెంచుకుంటాము'' అని కంపెనీ భారత డైరెక్టర్ అశిష్ గుప్తా తెలిపారు.

వొడాఫోన్ ఐడియా నష్టాలు అప్

- క్యూ3లో రూ. 7,990 కోట్లు
- కస్టమర్ల సంఖ్య 22.86 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో మొబైల్ టెలికం రంగ కంపెనీ వొడాఫోన్ ఐడియా నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర నష్టం పెరిగి రూ. 7,990 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 7,234 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం మాత్రం 9 శాతంపైగా బలపడి రూ. 10,621 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. రూ. 9,717 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఈ కాలంలో కంపెనీ రూ. 16,133 కోట్లమేర (స్పెక్ట్రమ్ వాయిదాలు, ఏజీఆర్ బకాయిలపై) చెల్లించవలసిన వడ్డీని ప్రభుత్వం ఈక్విటీగా మార్పిడి చేసుకుంది. దీంతో వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వం 33 శాతం వాటాతో అతిపెద్ద వాటాదారుగా ఆవిర్భవించింది. మరోపక్క కంపెనీ బోర్డు ఏటీసీ ఇండియాకు రూ. 1,600 కోట్ల విలువైన ఆప్షనల్లీ కన్వర్టిబుల్ డిబెంచర్ల జారీకి ఆమోదించింది. కాగా, తాజా సమీక్షా కాలంలో ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 17 శాతం పైగా మెరుగై రూ. 135ను తాకింది. మొత్తం కస్టమర్ల సంఖ్య 23.44 కోట్ల(క్యూ2) నుంచి 22.86 కోట్లకు నీరసించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు ఎన్‌ఎస్‌ఈలో యథాతథంగా రూ. 7.70 వద్ద ముగిసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏఈసీఎస్, హైదరాబాద్‌లో టీచర్ పోస్టులు

హైదరాబాద్ ఈసీఐఎల్‌లోని అటామిక్ ఎనర్జీ సెంట్రల్ స్కూల్స్ 2023–24 సంవత్సరానికి సంబంధించి ఒప్పంద/పీరియడ్ ప్రాతిపదికన ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టుల వివరాలు:** ప్రిపరేటరీ టీచర్స్, ప్రైమరీ టీచర్స్, పీఆర్‌టీ(తెలుగు), టీజీటీ(మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, సోషల్ సైన్స్, ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, పీఈటీ, ఆర్ట్).
- **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్,డీఈఎల్‌ఈడీ, డిగ్రీ, పీఆర్‌టీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:**ప్రిపరేటరీ టీచర్, పీఆర్‌టీ ఖాళీలకు 30 ఏళ్లు, టీజీటీ పోస్టులకు 35ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు ప్రిపరేటరీ టీచర్, పీఆర్‌టీ ఖాళీలకు రూ.21,250, టీజీటీ పోస్టులకు రూ. 26,250 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:**రాతపరీక్ష,స్కిల్‌టెస్ట్ ఆధారంగా
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 21.02.2023.
- **వెబ్‌సైట్:** nfc.gov.in

ఏఆర్‌సీఐ, హైదరాబాద్‌లో 18 రీసెర్చ్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్(ఏఆర్‌సీఐ).. రీసెర్చ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 18
- **పోస్టుల వివరాలు:**రీసెర్చ్ అసోసియేట్లు–3,జూనియర్ రీసెర్చ్ ఫెలో,సీనియర్ రీసెర్చ్ ఫెలో–15

అర్హత

- **రీసెర్చ్ అసోసియేట్లు:** ఎంఈ/ఎంటెక్/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. **స్టైపెండ్:** నెలకు రూ.47,000 నుంచి రూ.54,000 చెల్లిస్తారు.
- **జూనియర్ రీసెర్చ్ ఫెలో:** బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్/ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. యూజీసీ నెట్/గేట్/నెట్ అర్హత సాధించాలి. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. **స్టైపెండ్:** నెలకు రూ. 31,000 చెల్లిస్తారు.
- **సీనియర్ రీసెర్చ్ ఫెలో:** బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్/ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. యూజీసీ నెట్/గేట్/నెట్ అర్హత సాధించాలి. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు. కనీసం 2 ఏళ్లు పని అనుభవం ఉండాలి. **స్టైపెండ్:**నెలకు రూ.35,000చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ /షార్ట్‌లిస్టింగ్/పర్సనల్ ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరితేది:** 13.03.2023.
- **వెబ్‌సైట్:** arci.res.in

ఆల్ ఇండియా అటవీ ఆఫీసర్!

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్.. సంక్షిప్తంగా ఐఎఫ్‌ఎస్. ఆల్ ఇండియా సర్వీసు. ఐఎఫ్‌ఎస్-2023 ఎంపిక ప్రక్రియకు యూపీఎస్సీ దరఖాస్తులు కోరుతోంది. దీనిద్వారా మొత్తం 150 ఐఎఫ్‌ఎస్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది. బీఎస్సీ, బీటెక్, అగ్రికల్చరల్ బీఎస్సీ తదితర సైన్స్, ఇంజనీరింగ్ డిగ్రీ అర్హతతో ఈ పరీక్షకు పోటీపడొచ్చు. ఎంపిక ప్రక్రియలో సత్తా చాటి..తుది విజేతలుగా నిలిస్తే.. డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభమవుతుంది!! ఈ నేపథ్యంలో.. ఐఎఫ్‌ఎస్-2023 సమాచారం, ఎంపిక విధానం, అర్హతలు, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..

- » ఐఎఫ్‌ఎస్-2023 ఎంపిక ప్రక్రియ ప్రారంభం
- » 150 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసిన యూపీఎస్సీ
- » మూడు దశల ఎంపిక ప్రక్రియ ద్వారా నియామకం
- » తుది జాబితాలో నిలిస్తే.. డీఎఫ్‌ఓ హోదాతో కెరీర్ ప్రారంభం



అర్హతలు

యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీల్లో ఏదైనా ఒక సబ్జెక్టుతో బ్యాచిలర్ డిగ్రీ లేదా అగ్రికల్చర్/ఫారెస్ట్రీలో బ్యాచిలర్ డిగ్రీ(లేదా) ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరు మెయిన్ పరీక్షకు దరఖాస్తు నాటికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.

వయసు

2023 ఆగస్ట్ 1నాటికి 21–32 ఏళ్ల మధ్య ఉండాలి(ఆగస్ట్ 2, 1991–ఆగస్ట్ 1, 2002 మధ్యలో జన్మించి ఉండాలి). ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు లభిస్తుంది.

అటెంప్ట్‌ల సంఖ్య

జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఆరుసార్లు, ఓబీసీ అభ్యర్థులు తొమ్మిదిసార్లు ఐఎఫ్‌ఎస్ పరీక్షకు హాజరుకావొచ్చు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అటెంప్ట్‌ల విషయంలో ఎలాంటి పరిమితి లేదు. వయో పరిమితి ముగిసేలోపు ఎన్నిసార్లయినా పరీక్షకు హాజరు కావచ్చు.

మూడంచెల ఎంపిక ప్రక్రియ

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు విజేతల ఎంపికకు యూపీఎస్సీ మూడంచెల విధానాన్ని అనుసరిస్తోంది. అవి.. ప్రిలిమినరీ పరీక్ష; మెయిన్ ఎగ్జామినేషన్; పర్సనాలిటీ టెస్ట్.

ప్రిలిమ్స్ ఉమ్మడిగానే

ఐఎఫ్‌ఎస్ ఎంపిక ప్రక్రియలో తొలి దశ.. ప్రిలిమినరీ పరీక్ష. సివిల్ సర్వీసెస్ ఎంపిక విధానంలో తొలిదశ అయిన ప్రిలిమ్స్ పరీక్షనే ఐఎఫ్‌ఎస్‌కు కూడా ప్రిలిమ్స్‌గా నిర్దేశించారు. అంటే.. ఐఎఫ్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు..ముందుగా సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షకు హాజరై అందులో అర్హత సాధించాల్సి ఉంటుంది. సివిల్స్ ప్రిలిమ్స్‌లో ప్రతిభ ఆధారంగా.. ఐఎఫ్‌ఎస్ అభ్యర్థులకు రెండో దశలో మెయిన్ పరీక్షలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ప్రిలిమినరీ పరీక్షలో జనరల్ స్టడీస్ పేపర్-1, జనరల్ స్టడీస్ పేపర్-2(సీశాట్ ఆప్టిట్యూడ్) పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్‌కు 200 మార్కులు చొప్పున నాలుగు వందల మార్కులకు ప్రిలిమ్స్ పరీక్ష ఉంటుంది.

మెయిన్‌లో ఆరు పేపర్లు

ఐఎఫ్‌ఎస్ రెండో దశ మెయిన్‌లో రెండు కామన్ పేపర్స్, నాలుగు ఆప్షనల్ పేపర్స్ ఉంటాయి. మొత్తం ఆరు పేపర్లలో 1400 మార్కులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఆ వివరాలు..

పేపర్	సబ్జెక్ట్	మార్కులు
పేపర్–1	జనరల్ ఇంగ్లిష్	300
పేపర్–2	జనరల్ నాలెడ్జ్	300
పేపర్–3	ఆప్షనల్ సబ్జెక్ట్–1 పేపర్–1	200
పేపర్–4	ఆప్షనల్ సబ్జెక్ట్–1 పేపర్–2	200
పేపర్–5	ఆప్షనల్ సబ్జెక్ట్–2 పేపర్–1	200
పేపర్–6	ఆప్షనల్ సబ్జెక్ట్–2 పేపర్–2	200
మొత్తం మెయిన్ ఎగ్జామ్ మార్కులు:		1400

ఆప్షనల్ సబ్జెక్ట్స్.. నిర్దేశిత జాబితా

ఐఎఫ్‌ఎస్ మెయిన్‌లో ఆప్షనల్ సబ్జెక్ట్స్ విషయంలో యూపీఎస్సీ నిర్దిష్ట నిబంధనలు విధించింది. యూపీఎస్సీ పేర్కొన్న జాబితా నుంచి రెండు సబ్జెక్టులను ఆప్షనల్స్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది. ఇలా ఎంచుకున్న సబ్జెక్టులలోనే ఆప్షనల్ సబ్జెక్ట్–1, ఆప్షనల్ సబ్జెక్ట్–2 పేరుతో.. ఒక్కో సబ్జెక్ట్ నుంచి రెండు పేపర్లలో పరీక్ష నిర్వహిస్తారు. యూపీఎస్సీ మొత్తం 14 సబ్జెక్టులను ఆప్షనల్ సబ్జెక్టుల జాబితాలో పేర్కొంది. అవి.. అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీ.

వీటికి అనుమతి లేదు

14 ఆప్షనల్ సబ్జెక్టులు అందుబాటులో ఉన్నప్పటికీ.. సిలబస్ అంశాలు లేదా డొమైన్ కోణంలో ఒకే విధంగా ఉన్న రెండు సబ్జెక్టులను ఆప్షనల్‌గా ఎంచుకోకూడదనే నిబంధనను కూడా యూపీఎస్సీ విధించింది. అవి.. అగ్రికల్చర్–అగ్రికల్చరల్ ఇంజనీరింగ్; అగ్రికల్చర్–యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్; అగ్రికల్చర్ అండ్ ఫారెస్ట్రీ; కెమిస్ట్రీ అండ్ కెమికల్ ఇంజనీరింగ్; మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్; ఇంజనీరింగ్ సబ్జెక్టులకు సంబంధించి ఏదైనా ఒక ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌ను మాత్రమే ఆప్షనల్‌గా ఎంపిక చేసుకోవాలి. మరో ఆప్షనల్ సబ్జెక్ట్‌గా యూపీఎస్సీ నిర్దేశించిన నాన్-ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌ల నుంచి ఎంచుకోవాలి.

తుది దశ.. పర్సనాలిటీ టెస్ట్/ఇంటర్వ్యూ

ఐఎఫ్‌ఎస్ ఎంపిక ప్రక్రియలో తుది దశ.. పర్సనాలిటీ టెస్ట్(ఇంటర్వ్యూ). మెయిన్ పరీక్షలో సాధించిన మార్కులు, అందుబాటులో ఉన్న ఖాళీల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఆ తర్వాత 1:2(ఒక్కో పోస్ట్‌కు ఇద్దరు చొప్పున)నిష్పత్తిలో 300 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ ఇంటర్వ్యూలో పొందిన మార్కులు, మెయిన్‌లో సాధించిన మార్కులను కలిపి విజేతలను ప్రకటిస్తారు.

విజయం సాధించాలంటే

స్పష్టమైన ప్రణాళిక

ఐఎఫ్‌ఎస్ ప్రిలిమ్స్ పరీక్ష సన్నద్ధత నుంచే పకడ్బందీ ప్రణాళికను అనుసరించాలి.ముందుగా సిలబస్‌ను అధ్యయనం చేయాలి. ఆ తర్వాత గత ప్రశ్నపత్రాల పరిశీలన ద్వారా ఏఏ అంశాలకు ఎంత వెయిటేజీ ఉంటోంది.. పరీక్షలో ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు..ప్రశ్నలు అడిగే తీరు ఎలా ఉంది.. తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

కరెంట్ అఫైర్స్..కీలకంగా

అభ్యర్థులు కరెంట్ అఫైర్స్ అత్యంత కీలకమని గుర్తించాలి. గత కొన్నేళ్ల ప్రిలిమ్స్ పేపర్ల సరళిని పరిగణనలోకి తీసుకుంటే.. కరెంట్ అఫైర్స్ సంబంధిత అంశాలపై ప్రశ్నలు అడుగుతున్నారు. అదే విధంగా కోర్ అంశాలను, సమకాలీన పరిణామాలతో కలిపి అడిగే ప్రశ్నలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కాబట్టి అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తూ అభ్యసనం సాగించాలి.

జీఎస్.. జీకే ఉమ్మడి ప్రిపరేషన్

ఐఎఫ్‌ఎస్ అభ్యర్థులు ప్రిలిమ్స్ పేపర్–1లో ఉండే జనరల్ స్టడీస్‌కు, అదే విధంగా మెయిన్ పరీక్షలో పేపర్–2గా నిర్వహించే జనరల్ నాలెడ్జ్‌కు ఒకే సమయంలో సన్నద్ధత పొందేలా వ్యవహరించాలి. ప్రిలిమ్స్ జనరల్ స్టడీస్ పేపర్–1 ప్రిపరేషన్‌నే మెయిన్స్ జనరల్ నాలెడ్జ్ పేపర్ సిలబస్‌తో అనుసంధానం చేసుకుంటూ.. ప్రిపరేషన్ సాగించాలి. ఫలితంగా రెండు పేపర్లకు ఒకే సమయంలో సంసిద్ధత పొందే అవకాశం లభిస్తుంది.

మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లు

ఐఎఫ్‌ఎస్ పరీక్షలో విజయానికి ఉపకరించే మరో మార్గం..మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావడం. వాటి ఫలితాలను విశ్లేషించుకుని స్వీయ బలాలు, బలహీనతలను తెలుసుకోవాలి. వాటి ఆధారంగా తాము ఇంకా పదును పెట్టుకోవాల్సిన అంశాలకు ప్రత్యేక సమయం కేటాయించుకోవాలి.

ప్రిలిమ్స్ పేపర్-2

ప్రిలిమినరీ పేపర్–2 అర్హత పరీక్షే. అయితే ఇందులో కనీసం 33 శాతం మార్కులు సొంతం చేసుకోవడం తప్పనిసరి. ఇందుకోసం బేసిక్ మ్యాథమెటిక్స్, న్యూమరసీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై పట్టు సాధించాలి.

మెయిన్స్‌పై.. ప్రత్యేక దృష్టి

అభ్యర్థులు వీలైనంత మేరకు.. ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు ఒకే సమయంలో ప్రిపరేషన్ సాగించే విధంగా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. జనరల్ నాలెడ్జ్‌లో హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ తదితర కోర్ సబ్జెక్టుల మొదలు సమకాలీన సమస్యల వరకు ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి ఆయా సబ్జెక్టులకు సంబంధించి బేసిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో సంబంధిత విభాగాల్లో జరుగుతున్న పరిణామాలను విశ్లేషించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి.

ఆప్షనల్స్‌లో విజయానికి

రెండో దశ మెయిన్‌లో.. రెండు ఆప్షనల్ సబ్జెక్టులు, ఒక్కో సబ్జెక్ట్‌లో రెండు పేపర్లు చొప్పున మొత్తం నాలుగు పేపర్లకు సన్నద్ధత పొందాల్సి ఉంటుంది. ఆప్షనల్ ఎంపికలో స్పష్టత అవసరం. బాగా పట్టున్న సబ్జెక్ట్‌లనే ఆప్షనల్‌గా ఎంచుకోవాలి. ఆప్షనల్స్‌ను ఎంచుకున్నాక ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి బేసిక్స్, కాన్సెప్ట్స్, ఫార్ములాస్, థీరమ్స్ వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. ప్రాక్టికల్ అప్రోచ్‌తో అభ్యసనం సాగించాలి. ఆయా సబ్జెక్ట్‌లను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. వాటికి సంబంధించి పోటీ పరీక్షల్లో అడుగుతున్న ప్రశ్నలను పరిశీలించడం, వాటిని సాధన చేయడం కూడా ఎంతో ఉపకరిస్తుంది. ఆప్షనల్ సబ్జెక్ట్ ఎంపికలో కాంబినేషన్ల నిబంధన ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు ఒక ఆప్షనల్‌ను తమ డొమైన్ సబ్జెక్ట్ నుంచి ఎంచుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది. రెండో ఆప్షనల్ విషయంలో అందుబాటులో ఉన్న సబ్జెక్టులను, వాటి సిలబస్‌ను పరిశీలించి.. తాము రాణించగలం అనుకున్న సబ్జెక్ట్‌ను ఎంచుకోవడం మేలు అని గత విజేతల అభిప్రాయం.

ఆల్ ఇండియా సర్వీస్‌గా

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌ను కూడా ఆల్ ఇండియా సర్వీస్‌గానే పేర్కొంటారు. ఈ సర్వీస్‌కు ఎంపికైన వారు.. ఇండియన్ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత.. వారు పేర్కొన్న జోన్ ప్రాధమ్యం ఆధారంగా.. సంబంధిత రాష్ట్రాల్లో డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభిస్తారు. ఆ తర్వాత సర్వీస్ నియమావళికి అనుగుణంగా.. కన్జర్వేటర్, చీఫ్ కన్జర్వేటర్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ వంటి ఉన్నత స్థానాలు చేరుకునే అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** ఫిబ్రవరి 21, 2023
- **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** మే 28, 2023
- **మెయిన్ పరీక్షలు:** నవంబర్ 26 నుంచి పది రోజులు
- **తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.upsc.gov.in
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** https://upsconline.nic.in/upsc/OTRP/index.php

క్లుప్తంగా...

దక్షిణ మధ్య రైల్వేకు ప్రధాని అభినందన

సాక్షి, న్యూఢిల్లీ: సరుకుల రవాణాలో దక్షిణ మధ్య రైల్వే రికార్డుస్థాయి ఆదాయాన్ని ఆర్జించింది. ఈ నెల 10వ తేదీ నాటికి సరుకు రవాణా ద్వారా రూ.11 వేల కోట్ల ఆదాయం ఆర్జించినట్టు దక్షిణ మధ్య రైల్వే ట్విట్టర్ వేదికగా ప్రకటించింది. దక్షిణ మధ్య రైల్వే సాధించిన ఈ విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. 'మంచి సరళి.. ఆర్థిక వృద్ధికి కూడా శుభ పరిణామం..'అని ప్రధాని పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్ రెండో విడతకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షకు బుధవారం నుంచి మార్చి 12 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది. మెయిన్ పరీక్షలు ఏప్రిల్ 6, 8, 12 తేదీల్లో జరుగుతాయంది. పరీక్ష కేంద్రాలు సరిపోకపోతే ఏప్రిల్ 13, 15 (రిజర్వ్) తేదీల్లో నిర్వహిస్తామని పేర్కొంది. దీనికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు మార్చి 12వ తేదీ రాత్రి 11.50 లోగా ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించాలని సూచించింది.

స్టాఫ్ నర్సు దరఖాస్తులు 21 వరకు పెంపు

సాక్షి, హైదరాబాద్: స్టాఫ్ నర్సు ఉద్యోగాల దరఖాస్తు గడువును మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పొడిగించింది. ఈనెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మరింత సమాచారం కోసం https://mhsrb.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొంది.

నేడు పోలీస్ జాగిలాల శిక్షకుల పాసింగ్ అవుట్ పరేడ్

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో గురువారం పోలీస్ జాగిలాలు, ట్రైనర్ల పాసింగ్ అవుట్ పరేడ్ జరగనుంది. శాంతి భద్రతల పరిరక్షణ, సంక్లిష్టమైన కేసుల పరిశోధనలో కీలక పాత్ర వహించే విధంగా ప్రత్యేక శిక్షణ పొందిన 48 పోలీస్ జాగిలాలు, 64 మంది జాగిలాల శిక్షకులు ఈ పరేడ్‌లో పాల్గొననున్నారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న శిక్షకులను డీజీపీ అంజనీ కుమార్ అభినందించారు.

17న మరోసారి ఇంటర్ మూల్యాంకనకు టెండర్లు

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెలలో జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షల సమాధాన పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనకు మరోసారి టెండర్లు పిలవాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. బిడ్డింగ్‌లో పోటీ పెంచేలా కొన్ని నిబంధనల్లో మార్పు చేయాలని భావించింది. ఈ అంశంపై ఉన్నతాధికారులతో ఇంటర్ కాలేజీ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్ బుధవారం సమీక్షించారు. ఈ నెల 17న మార్పు చేసిన నిబంధనలతో టెండర్లను పిలిచేందుకు ఏర్పాట్లు చేయాలని మిత్తల్ అధికారులను ఆదేశించినట్టు తెలుస్తోంది. సాధారణ మూల్యాంకన ప్రక్రియలో విద్యార్థుల పేపర్లు ఎక్కడికి వెళ్తాయో తెలుసుకుని, ట్రాక్‌చేసి మోసాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దీన్ని నివారించేందుకు ఈసారి 35 లక్షల పేపర్లు ఆన్‌లైన్ మూల్యాంకనం చేయించాలని ఇంటర్ బోర్డు భావించింది. ఈ దిశగా టెండర్లు పిలిచినప్పటికీ, ఒకే ఒక సంస్థ బిడ్డింగ్‌లో పాల్గొనడంతో ఇటీవల రద్దు చేశారు. ఇప్పటికే ఇంటర్ బోర్డు బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన కంపెనీలను, పేరు మార్చుకున్న మరో కంపెనీలకు అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించింది.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయండి

ఉస్మానియా వర్సిటీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: పీహెచ్‌డీ సహా అన్ని ప్రవేశాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్లను అమలు చేయాలని రాష్ట్ర హైకోర్టు ఉస్మానియా యూనివర్సిటీని ఆదేశించింది. పీహెచ్‌డీ ప్రవేశాలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ చింతల్‌కు చెందిన విద్యార్థి ఎస్.ఉమ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది గాడిపల్లి మల్లారెడ్డి వాదనలు వినిపించారు. పీహెచ్‌డీ ప్రవేశాలకు 2022, ఆగస్టు 1న ఇచ్చిన నోటిఫికేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వ రిజర్వేషన్ విధానాన్ని పాటిస్తున్నామని ఓయూ అధికారులు పేర్కొన్నారని చెప్పారు. విద్యా సంస్థల్లోనూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం 2021, ఆగస్టు 24న జీవో 244ను విడుదల చేసిందని వెల్లడించారు. అయితే వర్సిటీ దీనిని పాటించని కారణంగా ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేదలు ఉన్నత చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని నివేదించారు. ఓయూ తరఫు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ, రిజర్వేషన్ల అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఇకపై అన్ని ప్రవేశాల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని ఆదేశిస్తూ, పిటిషన్‌పై విచారణను ముగించారు.

సైకత శివయ్య

19.5 అడుగుల భారీ లింగావిష్కరణ



సంగారెడ్డి టౌన్: మహాశివరాత్రిని పురస్కరించుకుని సంగారెడ్డిలోని ఫసల్‌వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో 19.5 అడుగుల సైకత మహా లింగాన్ని బుధవారం రాత్రి ఆవిష్కరించారు. విద్యాపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, గాను గాపూర్ పీఠాధిపతి వల్లభానంద సరస్వతి, కూడలి శృంగేరి శంకరాచార్య పీఠాధిపతి అభినవ విద్యారణ్య భారతి స్వామి ముఖ్య అతిథులుగా సైకత శివలింగాన్ని ఆవిష్కరించారు. 360 టన్నుల ఇసుకతో ప్రపంచంలోనే అతి పెద్దదైన సైకత శివలింగాన్ని రూపొందించినట్టు విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు.

భద్రతకు భరోసా ఎల్‌హెచ్‌బీ...

80 కి.మీ. వేగంతో వెళ్తున్న రైలు పట్టాలు తప్పినా క్షేమంగా బయటపడ్డ ప్రయాణికులు

2017 జనవరి:
ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ నుంచి ఒడిశా రాజధాని భువనేశ్వర్ వెళ్తున్న హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్ ఏపీలోని విజయనగరం సమీపంలో పట్టాలు తప్పింది. కోచ్‌లు చెల్లాచెదురై ఒకదానిపైకి ఒకటి చొచ్చుకెళ్లాయి. ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు.

2023 ఫిబ్రవరి 15:
విశాఖపట్నం నుంచి వస్తున్న గోదావరి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మరికాసేపట్లో సికింద్రాబాద్ చేరుకుంటుందనగా బీబీనగర్ సమీపంలోని అంకుషాపూర్ వద్ద పట్టాలు తప్పింది. ఆరు కోచ్‌లు పక్కకు ఒరిగినా ఒకదానిపైకి ఒకటి మాత్రం దూసుకెళ్లలేదు. ఫలితంగా ప్రాణనష్టం లేకుండానే ప్రయాణికులు బయటపడ్డారు.

ఈ రెండు దుర్ఘటనల్లో ఉన్న తేడా.. తొలి ప్రమాదంలో సంప్రదాయ ఐసీఎఫ్ కోచ్‌లు ఉన్నాయి. రెండో ప్రమాదానికి గురైన గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు జర్మనీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను వినియోగించారు. ఈ మార్పే ప్రయాణికుల ప్రాణాలను కాపాడింది.

సాక్షి, హైదరాబాద్: బీబీ నగర్ సమీపంలో బుధవారం ఉదయం గోదావరి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ప్రమాదంలో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ప్రయాణికుల ప్రాణాలు కాపాడాయి. ప్రమాద సమయంలో రైలు దాదాపు 80 కి.మీ. వేగంతో వెళ్తున్నప్పటికీ ప్రయాణికులకు పెద్దగా గాయాలు కూడా కాకపోవడం విశేషం. దాదాపు నాలుగేళ్ల క్రితం ఈ రైలుకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ మార్పే ప్రయాణికులకు వరంగా మారింది.

జర్మనీ పరిజ్ఞానంతో...

భారతీయ రైల్వే దశాబ్దాలుగా తమిళనాడులోని పెరంబూర్‌లో ఉన్న ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో ఉత్పత్తి చేస్తున్న బోగీలను వినియోగిస్తూ వస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడు అవి ప్రయాణికులపాలిట మృత్యులోగిళ్లుగా మారుతున్నాయి. దీంతో వాటిని కాకుండా, జర్మనీ పరిజ్ఞానంతో రూపొందే లింక్ హాఫ్‌మాన్‌బుష్ (ఎల్‌హెచ్‌బీ) బోగీలను వినియోగించాలని నిర్ణయించి మారుస్తోంది. ఈ మార్పు జరిగిన రైళ్లు ప్రమాదానికి గురైనప్పుడు ప్రయాణికులు సురక్షితంగా బయటపడగలుగుతున్నారు. దీంతో ఇవి సత్ఫలితాలనిస్తున్నట్టు గుర్తించిన రైల్వే, వీలైనంత వేగంగా అన్ని రైళ్లకు వాటినే వాడాలని నిర్ణయించింది. ఇప్పటికే ఐసీఎఫ్ కోచ్ తయారీని నిలిపేసింది. అన్ని కోచ్ ఫ్యాక్టరీలో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను తయారు చేస్తోంది.

దక్షిణమధ్య రైల్వే పరిధిలో 1,428 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

దక్షిణమధ్య రైల్వే పరిధిలో ఇప్పటివరకు 43 ఎక్స్‌ప్రెస్‌లకు సంబంధించి 68 రేక్స్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ఏర్పాటు చేశారు. గతేడాది మార్చి నాటికి ఈ సంఖ్య 53గా ఉండగా ఏడాది కాలంలో అదనంగా మరో 15 రేక్స్‌కు వాటి ఏర్పాటు పూర్తయింది. వెరసి ఇప్పటివరకు 1,428 కోచ్‌లను బదలాయించి సంప్రదాయ ఐసీఎఫ్ నుంచి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ఏర్పాటు చేయగలిగారు. అయితే ఇంకా 150 రైళ్లకు మార్చాల్సి ఉంది. ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల తయారీ మరింత ఊపందుకుంటే తప్ప వాటి బదలాయింపులో వేగం పుంజుకోదు.

ఐసీఎఫ్, ఎల్‌హెచ్‌బీ బోగీల మధ్య ప్రధాన తేడాలివే...



ఐసీఎఫ్....
- ఈ బోగీలలో డ్యూయల్ బఫర్ హుక్ కప్లర్స్ ఉంటాయి. బోగీకి, బోగీకి మధ్య ఇవే అనుసంధానంగా ఉంటాయి.
- రైలు ప్రమాదాలు జరిగినప్పుడు బోగీలు పరస్పరం ఢీకొని ఒకదానిపైకి ఒకటి దూసుకుపోతున్నాయి. దీంతో భారీ ప్రాణనష్టం సంభవిస్తోంది. రైలు ప్రమాద మరణాల్లో 90 శాతం వీటి వల్లే జరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.
- ఈ బోగీల గరిష్ట వేగ పరిమితి గంటకు 120 కి.మీ. మాత్రమే. కానీ చాలా రైళ్లను గరిష్టంగా 110 కి.మీ. వేగంతోనే నడుపుతున్నారు. అంతకంటే ఎక్కువ వేగంతో వెళ్తే బోగీలు ఊగిపోతూ భారీ శబ్దం చేస్తాయి.
- వీటిలో స్ప్రింగ్ సస్పెన్షన్ విధానం ఉంటుంది. రైలు వేగంగా ప్రయాణించినప్పుడు బోగీలు ఊయలలాగా ఊగకుండా ఈ విధానం నిరోధించలేకపోతోంది.
- ఇందులో సాధారణ ఎయిర్ బ్రేక్ విధానం ఉంటుంది. బ్రేక్ వేశాక వెంటనే నిలిచిపోతే బోగీలు పట్టాలు తప్పే ప్రమాదముంది. దీంతో బ్రేక్ వేశాక రైలు చాలా దూరం ముందుకెళ్లి ఆగుతుంది.
- స్టెయిన్‌లెస్ స్టీల్‌తో రూపొందే ఈ కోచ్‌లలో ఏసీ బోగీకి రూ. కోటిన్నర, స్లీపర్ బోగీకి రూ. 85 లక్షల వరకు ఖర్చు అవుతోంది.
- ఒక్కో కోచ్‌లో 64 మంది ప్రయాణికులు వెళ్లేలా సీటింగ్ ఉంది.

ఎల్‌హెచ్‌బీ...
- ఈ బోగీలకు సెంటర్ బఫర్ కప్లర్లుంటాయి.
- ప్రమాదాలు జరిగినప్పుడు బోగీలు పక్కకు పడిపోతాయి తప్ప ఒకదానిపై ఒకటి దూసుకుపోవు.
- బోగీలు 200 కి.మీ. వేగాన్ని సైతం తట్టుకొనేలా ఉంటాయి. కానీ వాటిని ప్రస్తుతం 160 కి.మీ. వేగానికి పరిమితం చేశారు. ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల బరువు తక్కువగా ఉండటం వల్ల ఎక్కువ వేగంతో పరుగుపెట్టేందుకు వీలుంటుంది. కుదుపులు కూడా చాలా తక్కువగా ఉంటాయి.
- వీటిల్లో ఎయిర్ కుషన్ సస్పెన్షన్ వ్యవస్థ ఉంటుంది. రైలు వేగంగా వెళ్లినా పెద్దగా కుదుపులు ఉండవు.
- బోగీలకు డిస్క్ బ్రేక్‌లు ఉంటాయి. దీనివల్ల రైలు కాసేపటికే ఆగినా బోగీలు పట్టాలు తప్పే ప్రమాదముండదు.
- మైల్డ్ స్టీల్‌తో రూపొందే ఏసీ కోచ్‌లు రూ.2.5 కోట్లు, స్లీపర్ అయితే రూ. కోటిన్నర వరకు ఖర్చవుతోంది.
- ఐసీఎఫ్ కంటే 2 మీటర్ల ఎక్కువ పొడవు ఉండే ఎల్‌హెచ్‌బీ బోగీలో 72 మంది ప్రయాణించవచ్చు.

పట్టాలు తప్పిన గోదావరి ఎక్స్‌ప్రెస్

▶ మొదటి పేజీ తరువాయి

దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఇతర అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముందుగా పట్టాలు తప్పిన ఆరు బోగీలను రైలు నుంచి తప్పించి గోదావరి ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్‌కు పంపించారు. అనంతరం అదుపు తప్పిన బోగీలను ట్రాకు పైకి ఎక్కించి ప్రమాద స్థలం నుంచి తరలించారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు...

జీఎం జైన్ ఆదేశం మేరకు విద్యుత్, ఇంజినీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సిగ్నల్, కమ్యూనికేషన్స్, కమర్షియల్, ఆర్‌పీఎస్ విభాగాల అధికారులు, సిబ్బంది పనుల్లో పాల్గొన్నారు. సుమారు అర కిలోమీటర్ దూరం వరకు పూర్తిగా ధ్వంసమైన రైల్వే ట్రాకు, కంకర, పట్టాలు, విద్యుత్ స్తంభాన్ని తొలగించి వెంటనే కొత్తవి బిగించారు.

సురక్షితంగా ప్రయాణికులు...

పట్టా విరగడంతో గోదావరి ఎక్స్‌ప్రెస్‌లోని ప్రయాణికులు తొలుత భయకంపితులయ్యారు. అయితే ప్రాణాలకు ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. తాము నిద్ర నుంచి మేలుకుంటున్న సమయంలో పెద్ద శబ్దం వచ్చి బోగీలు పక్కకు ఒరిగాయనీ రైలు వేగం తక్కువగా ఉండడంతో ప్రాణాలతో బయట పడ్డామని చెప్పుకొచ్చారు. బ్రతుకు జీవుడా అంటూ కొంత మంది ప్రయాణికులు రైలుదిగి జాతీయ రహదారి వరకు నడుచుకుంటూ వచ్చి బస్సుల్లో నగరానికి బయలు దేరారు. మిగిలిన ప్రయాణీకులను యథావిధిగా సికింద్రాబాద్‌కు రైలులో పంపించారు. ప్రమాద స్థలాన్ని రైల్వే డీసీఎం బస్వరాజ్, మల్కాజ్‌గిరి డీసీపీ జానకీ, తహసీల్దార్ విజయలక్ష్మీ, ఇతర ఉన్నతాధికారులు పరిశీలించారు.



ఎక్కడికక్కడే నిలిచిన రైళ్లు, మరికొన్ని దారి మళ్లింపు

సాక్షి, హైదరాబాద్: గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పడంతో నడికుడి మార్గంలో వచ్చివెళ్లే రైళ్లు ఎక్కడివక్కడే ఆగిపోయాయి, బుధవారం రాత్రి వరకు 9 రైళ్లను రద్దు చేశారు. 19 రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. 7 రైళ్ల వేళలను మార్చి రీషెడ్యూల్‌తో నడిపి, మరో ఆరు రైళ్లను దారి మళ్లించారు. సికింద్రాబాద్ నుంచి నడిచే తిరువనంతపురం, హౌరా, రామంతాపురం, విశాఖపట్నం, భువనేశ్వర్, తిరుపతి, మన్మాడ్‌రైళ్ల వేళలు మార్చి నడిపారు. తిరుపతి-అమరావతి, తిరుపతి-సికింద్రాబాద్, కాచిగూడ-మదురై, ముంబయి-నాగర్‌కోయిల్, అజ్మీర్ -బెంగుళూరు, బెంగుళూరు-జోధ్‌పూర్, మైసూరు-హుబ్లీ, ఆకోలా-తిరుపతి రైళ్లను రెండు వైపులా దారి మళ్లించి నడిపారు. ముంబయి నుంచి బెంగుళూరు వెళ్లే రైలును పెనుకొండ మీదుగా, సికింద్రాబాద్-హజ్రత్‌నిజాముద్దీన్ ను నిజామాబాద్ మీదుగా నడిపారు. తిరుపతి-హజ్రత్ నిజాముద్దీన్, హైదరాబాద్-చెన్నై సెంట్రల్, యశ్వంతాపూర్-కోర్బా, సికింద్రాబాద్-జమ్ముతావి రైళ్లను ప్రత్యామ్నాయ మార్గాల్లో నడిపారు. మచిలీపట్నం-ధర్మవరం, హైదరాబాద్-విశాఖపట్నం, రేపల్లె-సికింద్రాబాద్, విశాఖట్నం-నాందేడ్ , లింగంపల్లి-విశాఖపట్నం రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. హైదరాబాద్-కాజీపేట, సికింద్రాబాద్-భద్రాచలం, కాచిగూడ-నడికుడి, సికింద్రాబాద్-వరంగల్, వరంగల్-హైదరాబాద్, సికింద్రాబాద్-గుంటూరు, సికింద్రాబాద్-రేపల్లె రైళ్లను రద్దు చేశారు.

ప్రయాణికుల పడిగాపులు..

ఉదయమే ఈ రైలు ప్రమాదానికి గురి కావటంతో ఆ మార్గంలో వచ్చివెళ్లే రైళ్లు ఎక్కడివక్కడే ఆగిపోయాయి, దీంతో వాటి కోసం స్టేషన్లలో ఎదురు చూస్తున్న వారు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. రైళ్లు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు గంటల కొద్దీ ఆలస్యంగా చేరడం, ఇంకొన్ని రైళ్లు స్టేషన్ నుంచి ఆలస్యంగా బయలు దేరడంతో 30 వేల మంది ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సికింద్రాబాద్‌తో పాటు నాంపల్లి, కాచిగూడ, వరంగల్, కాజీపేట, నిజామాబాద్‌లాంటి పెద్ద స్టేషన్లలో ప్రయాణికులు పడిగాపులు పడాల్సి వచ్చింది.

15 గంటల్లో పునరుద్ధరణ

సాక్షి, హైదరాబాద్: గోదావరి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన రైల్వే ట్రాక్‌ను రాత్రి 9 తర్వాత పునరుద్ధరించారు. ఉదయం 6.10కి ప్రమాదం జరిగితే రాత్రి 9.15కు ఆ లైన్ మీదుగా శబరి ఎక్స్‌ప్రెస్‌ను నడిపారు. అర కిలోమీటరు నిడివిలో ట్రాక్ పూర్తిగా ధ్వంసమైనా, దాదాపు 400 మంది సిబ్బంది, ఆధునిక యంత్రాలు వినియోగించి ప్రమాదం జరిగిన 15 గంటల్లోనే దాన్ని పునరుద్ధరించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం నగరానికి చేరువగా ఉండటంతో సిబ్బంది, పరికరాలు, ఉన్నతాధికారులు, రిలీఫ్ వ్యాన్లు తొందరగా చేరుకోగలగటంతో పునరుద్ధరణ కూడా వేగంగానే సాగింది.



మరమ్మతులు చేస్తున్న రైల్వే సిబ్బంది

పెద్దశబ్దంతో భయపడిపోయాం



పట్టాలు తప్పిన బోగీలో కుటుంబ సభ్యులతో పడుకుని ఉన్నాం. తెల్లవారుతున్న సమయంలో ఒక్కసారిగా పెద్దశబ్దం వచ్చింది. శబ్దానికి కళ్లు తెరిచి చూస్తున్నపుడే బోగీ మెల్లగా ఒకవైపు వంగిపోతుండడంతో తీవ్రంగా భయభ్రాంతులకు గురయ్యాం. దేవుడి దయ వల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

-మహ్మద్‌పాషా, ప్రయాణికుడు



ఒక మాస్క్..

మూతికి మాస్కు వేసుకుంటాం.. మరి వీరేంటి ముఖానికి వేసుకున్నారు.. ఇదేగా మీ డౌటు.. మేం చెప్పే సమాధానం.. మీక్కూడా కొంచెం విచిత్రంగానే అనిపించొచ్చు. ఎందుకంటే వీరంతా మాస్కులేసుకుని వచ్చింది.. ఓ కంపెనీలో జాబ్ ఇంటర్వ్యూ కోసం.. వీరే కాదు.. వీరిని ఇంటర్వ్యూ చేసినోళ్లు కూడా ఇలా మాస్కులేసుకునే రావడం విశేషం.


అలాగని.. వీళ్లది మాస్కులమ్ముకునే కంపెనీ మాత్రం కాదండోయ్. ఇంటర్వ్యూలో ఎలాంటి వివక్షకు తావు లేకుండా ఉండేందుకే ఇలా చేశారట!! ముఖాన్ని చూసి కాదు.. అభ్యర్థిలోని మెరిట్‌ను చూసి ఎంపిక చేయాలన్నదే తమ ఉద్దేశమని ఈ ఇంటర్వ్యూలను నిర్వహించిన చైనా కంపెనీ చెంగ్డూ లాజిస్టిక్స్ చెప్పింది. కొంచెం చిత్రంగా ఉన్నా.. దీని వల్ల అటు అభ్యర్థుల్లో ఒత్తిడి తగ్గుతుందని.. వారి ఆహార్యం బట్టి కాకుండా సామర్థ్యాలను బట్టి ఎంపిక జరుగుతుంది కాబట్టి ఇటు కంపెనీకి మేలు జరుగుతుందని పేర్కొంది. మరోవైపు సోషల్ మీడియాలో ఈ టైపు ఇంటర్వ్యూ పట్ల సానుకూల స్పందన వ్యక్తమైంది. సమానత్వం అంటే ఇది.. అందంగా ఉండటం అన్నది అదనపు అర్హత కారాదు అంటూ కామెంట్లు పెట్టారు.



ఒక మెసేజ్..

చైనాలో ఇంటర్వ్యూల సంగతి అలా ఉంటే.. ఇక్కడ ఇండియాలో కూడా కొంచెం చిత్రమైన సంగతే జరిగింది...

సాధారణంగా ఆఫీసుల్లో షిఫ్ట్ టైం కన్నా అదనపు సమయం పనిచేయడమే చాలా మందికి అలవాటు.. చాలా కంపెనీలు కూడా అలాగే చేయించుకుంటాయి. అయితే, ఇండోర్‌లోని ఓ ఐటీ కంపెనీలో మాత్రం షిఫ్ట్ టైం ముగియడానికి పది నిమిషాల ముందు కంప్యూటర్ తెరపై వార్నింగ్ మెసేజ్ వస్తుంది. మీ షిఫ్ట్ టైం అయిపోయింది.. మరో 10 నిమిషాల్లో కంప్యూటర్ షట్‌డౌన్ అయిపోతుంది. దయచేసి ఇంటికి వెళ్లండి అని.. దీన్ని తాజాగా సదరు కంపెనీ సాఫ్ట్‌గ్రిడ్ కంప్యూటర్స్ హెచ్‌ఆర్ తన్వీ తన సోషల్ మీడియా అకౌంట్‌లో షేర్ చేసేసరికి అందరూ నోరెళ్లబెట్టేశారట. మేమెప్పుడూ మా కంపెనీలో ఇలాంటిది చూడలేదయ్యా అంటూ కామెంట్లు పెట్టారు.



ఒక మ్యాజిక్..

ఏంటా మ్యాజిక్ అన్న విషయాన్ని తెలుసుకునే ముందు.. ఈ సముద్ర తీర చిత్రాన్ని చూడండి.. సూపర్‌గా ఉంది కదూ.. అందుకే ఆస్ట్రేలియాకు చెందిన డిజిడైరెక్ట్ అనే కంపెనీ నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలో ఇది మొదటి బహుమతిని గెలుచుకుంది. 'జాన్ వాన్ ఐక్' అనే ఫొటోగ్రాఫర్ తీసిన ఈ డ్రోన్ షాట్‌కు జ్యూరీ ఏకగ్రీవంగా ఓటేసింది.

ఇక్కడే ఉంది అసలైన టర్నింగ్ పాయింట్. నిజానికి ఈ చిత్రాన్ని తీసింది ఫొటోగ్రాఫర్ కాదు.. కృత్రిమ మేథ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ). అంతేకాదు.. ఇందులోని బీచ్.. సర్ఫ్ చేస్తున్న వాళ్లు ఇదంతా ఓ మ్యాజిక్కే.. అంటే.. ఇలాంటి బీచ్ ప్రపంచంలో ఎక్కడా లేదు.. దీన్ని కూడా ఏఐనే సృష్టించింది. సిడ్నీకి చెందిన అబ్‌సొల్యూట్లీ ఏఐ అనే కంపెనీ కృత్రిమ మేథ రూపొందించిన ఈ చిత్రాన్ని ఫొటోగ్రఫీ పోటీకి ఎంట్రీగా పంపింది. అయితే.. గెలుపొందిన విషయం తెలిసిన తర్వాత అసలు సంగతిని బయటపెట్టింది. నగదు బహుమతిని తిరిగిచ్చేసింది. కృత్రిమ మేథ టెక్నాలజీ అన్నది ఒక కీలక మలుపుకు చేరుకుందన్న విషయాన్ని నిరూపించేందుకే తాము ఈ పని చేసినట్లు ఆ కంపెనీ తెలిపింది. అలనాటి ప్రఖ్యాత చిత్రకారుడు జాన్ వాన్ ఐక్ పేరు మీద ఈ ఎంట్రీని సమర్పించినట్లు చెప్పింది. ఏఐ రూపొందించిన ఓ చిత్రం ఇలా ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందడం అన్నది ప్రపంచంలో ఇదే తొలిసారని చెబుతున్నారు.

- సాక్షి సెంట్రల్ డెస్క్

పెట్టుబడుల కేంద్రంగా హైదరాబాద్

- అంతర్జాతీయ దిగ్గజ సంస్థలకు కేరాఫ్‌గా విశ్వనగరం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుగా హైదరాబాద్ నగరాన్నే ఎంచుకుంటున్నాయని, ప్రపంచంలోనే ప్రతిష్టాత్మక సంస్థలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కే.తారకరామారావు అన్నారు. మైక్రోసాఫ్ట్ మొదలు పలు సంస్థలు నగరంలో ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేసి ప్రశాంతంగా కొనసాగిస్తున్నాయన్నారు. ఇంతటి అద్భుతమైన వాతావరణం ఏర్పాటుకు ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు కృషి అమోఘమని ఆయన ఉద్ఘాటించారు. బుధవారం ఐటీసీ కాకతీయలో జరిగిన అమెరికన్ ఇండియా ఫౌండేషన్(ఏఐఎఫ్) హైదరాబాద్ చాప్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అత్యంత యువశక్తి ఉన్న దేశం భారత్ మాత్రమేనని, మన దేశంలో సగం జనాభా యువకులతోనే నిండి ఉందన్నారు. ఎలాంటి విజయాలనైనా సాధించే సత్తా భారత్‌కు ఉందన్నారు. ఇటీవల కోవిడ్-19 విపత్కర పరిస్థితుల్లో అత్యంత వేగంగా వ్యాక్సిన్ తయారు చేసింది భారతదేశమేనన్నారు. అందులోనూ హైదరాబాద్ పాత్ర మరువలేనిదని, ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అయిన టీకాల్లో మూడోవంతు భారత్‌లోనే తయారయ్యాయని కేటీఆర్ ఉద్ఘాటించారు.

విశ్వనగరంగా హైదరాబాద్...

గడిచిన ఎనిమిది సంవత్సరాల కాలంలో హైదరాబాద్ విశ్వనగరంగా రూపాంతరం చెందిందని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. అత్యాధునిక వసతులతో రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సంస్థలను ఆకర్షిస్తోందని వివరించారు. ఏఎఎఫ్ హైదరాబాద్ చాప్టర్ ప్రారంభం ఎంతో సంతోషకరమన్న కేటీఆర్ ఏఎంఎఫ్ చేపట్టే కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు.

పల్లెకు పోదాం చలో!

రాష్ట్రంలో 400 గ్రామాల దత్తతకు ఐఎంఏ సన్నాహం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత మెరుగుపరిచేందుకోసం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఉపక్రమించింది. ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజారోగ్య చర్యలకు ఊతమిచ్చేందుకు పల్లెకు పోదాం చలో అనే నినాదంతో కదిలింది. ఇందులో భాగంగా గ్రామాలను దత్తత తీసుకుని ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన, జాగ్రత్త చర్యలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఐఎంఏకు రాష్ట్ర వ్యాప్తంగా 75 శాఖలున్నాయి. ప్రతి జిల్లా కేంద్రంతో పాటు వివిధ నియోజకవర్గ కేంద్రాల్లో ఈ శాఖలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ప్రతి శాఖ ద్వారా కనీసం ఐదు గ్రామాలను దత్తత తీసుకోవాలని ఐఎంఏ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 400 గ్రామాలను దత్తత తీసుకోనున్నట్లు ఐఎంఏ అధ్యక్షుడు బీఎన్ రావు సాక్షికి తెలిపారు.

ప్రతినెలా రెండు సార్లు వైద్య శిబిరాలు..

ఐఎంఏ దత్తత తీసుకున్న గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ప్రతి నెలా రెండు సార్లు ఈ శిబిరాలు ఏర్పాటు చేసి క్యాంపునకు వచ్చే వారికి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారు. వారి ఆరోగ్య పరిస్థితుల ఆధారంగా జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు శస్త్రచికిత్సలు అవసరమైన వారిని పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేస్తారు. దీంతో పాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పారిశుధ్యం, పోషకాహార స్వీకరణ తదితరాలన్నిటిపై ఈ శిబిరాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తారు. శిబిరాల నిర్వహణకు ప్రత్యేకంగా వైద్యుల బృందం ఉంటుంది. ఇందులో జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, చర్మవాధుల నిపుణుడు ఉంటారు. ఇప్పటికే కరీంనగర్‌లో ఐదు గ్రామాలను దత్తత తీసుకుని కార్యక్రమాలు ప్రారంభించారు. 30 మంది వైద్యులు సేవలందిస్తున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.